
**ఇది నోబెల్ బహుమతి పొందిన అమ్మాయి కథ**

తాలిబాన్ల ఆజ్ఞలను ధిక్కరించి

అమ్మాయిలూ చదువుకోవాలనే ఆకాంక్షతో

తీవ్రవాద దాడిని ఎదుర్కొన్న ఓ సాహస పుత్రిక కథ

# నేను మలాలా



ప్రజాశక్తి బుక్‌హౌస్

# నేను మలాలా

**ఇది నోబెల్ బహుమతి పొందిన అమ్మాయి కథ**

తాలిబాన్ల ఆజ్ఞలను ధిక్కరించి

అమ్మాయిలూ చదువుకోవాలనే ఆకాంక్షతో

తీవ్రవాద దాడిని ఎదుర్కొన్న ఓ సాహస పుత్రిక కథ

# నేను మలాలా


హిందీ అనుసరణ : **మీరా**

తెలుగు : **సలీమ మహేష్ దుర్గే**



## ప్రజాశక్తి బుక్‌హౌస్ - తెలంగాణ

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*

*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

I AM MALALA
- Malala Yousafzai
With Christina Lamb

108689

ప్రచురణ సంఖ్య : 1340

ప్రథమ ముద్రణ : అక్టోబర్, 2014
ద్వితీయ ముద్రణ : నవంబర్, 2014
తృతీయ ముద్రణ : నవంబర్, 2014
నాల్గవ ముద్రణ : ఫిబ్రవరి, 2015

వెల : ₹ 50/-

ప్రతులకు
**ప్రజాశక్తి బుక్‌హౌస్** - తెలంగాణ
*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర*
*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

బ్రాంచీలు
హైదరాబాద్ - చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్.
నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం
విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, ఒంగోలు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in

# విషయసూచిక


ప్రచురణకర్తల మాట ........................................ 6

1. నేను మలాలాను ........................................ 8
2. ధైర్యానికి ప్రతీక ........................................ 10
3. స్వాత్ అమ్మాయి........................................ 13
4. పోరాట బాట ........................................ 16
5. తిరుగుబాటు........................................ 21
6. స్వాత్ నాది ........................................ 26
7. షైనింగ్ గర్ల్........................................ 31
8. భయం గుప్పెట ........................................ 34
9. డైరీలో రాసిన నిజాలు ........................................ 39
10. చర్చనీయాంశం ........................................ 61
11. రాజకీయ జీవితం........................................ 67
12. పెరుగుతున్న ప్రసిద్ధి........................................ 72
13. వేటాడిన క్రూరత్వం ........................................ 75
14. వెన్నుతట్టిన ప్రపంచం ........................................ 80
15. ఇంటింటా మలాలా........................................ 85
16. ఫలించిన ఆశీస్సులు ........................................ 87
17. సాకారమైన కల ........................................ 89
18. మెరుపు మెరిసింది ........................................ 92
19. ఐరాసలో మలాలా ఉపన్యాసం........................................ 94
20. సోషలిజమే పరిష్కారం........................................ 99
21. సన్మానాలు, పురస్కారాలు ........................................ 101
22. మలాలాపై ఒక గజల్ ........................................ 104

# ప్రచురణకర్తల మాట

**ఆ** అమ్మాయి వయసు 17 ఏళ్ళు. అయితేనేం, ప్రపంచంలోకే అత్యంత ప్రతిష్టాత్మకమైన బహుమతి ఆమెను వరించింది. 2014 నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్ని భారతీయుడైన కైలాష్ సత్యార్థికి, పాకిస్తానీ టీనేజి బాలిక మలాలా యూసఫ్‌జాయికి ఉమ్మడిగా ప్రదానం చేశారు. ఇంత చిన్న అమ్మాయి ఈ పురస్కారానికి ఎంపిక కావడం నోబెల్ ప్రైజుల చరిత్రలో ఇదే ప్రథమం. మలాలా యూసఫ్‌జాయి ఔన్నత్యానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది?

యావత్ మానవాళికి ఒక పీడగా మారిన తీవ్రవాదంపై అత్యంత సాహసోపేతంగా ఆమె తన ప్రాణం సైతం పణం వొడ్డి పోరాడింది. అమ్మాయిలకు బడికి వెళ్లే హక్కు ఉండాలని నినదించి పాకిస్తాన్ ఛాందస వాదుల ఆగ్రహానికి గురైంది. 'ఒక టీచర్, ఒక విద్యార్థి, ఒక పెన్ను, ఒక పుస్తకం' అంటూ ఆమె ఇచ్చిన నినాదం స్వాత్ లోయలో మార్మోగింది. విద్యతోనే స్త్రీలకు స్వేచ్ఛ లభిస్తుందని బీబీసీ బ్లాగులో 11 ఏళ్ల అతిపిన్న వయసు నుంచే అల్‌మకాయి పేరుతో డైరీ రాసి పాకిస్తాన్‌లో సంచలనం సృష్టించింది. తాలిబన్ల ఆగడాలతో తమ చదువు ఎలా నిలిచిపోతోందో, తమ ప్రాంత మహిళల జీవితాలు ఎంత దుర్భరంగా మారాయో ప్రపంచానికి చాటి చెప్పింది. చదువన్నా, మహిళలకు స్వేచ్ఛన్నా భయపడే తాలిబన్లకు ఈ పరిణామం వెన్నులో వణుకు పుట్టించింది. అందుకే ఆ కిరాతకులు మలాలాను టార్గెట్ చేసుకున్నారు. చదువు తమ హక్కన్న నేరానికి ఆ చిన్నారిపై తుపాకులతో దాడి చేశారు. ఆమెపై దాడి చేసింది తామేనంటూ సగర్వంగా ప్రకటించుకున్నారు. కాని ఆ సంఘటన వారిపట్ల వ్యతిరేకతను మరింత పెంచింది. కుప్పకూలిన మలాలా కోసం ఒక్క పాకిస్తాన్ మాత్రమే కాకుండా ప్రపంచం మొత్తం ఒక్కటై నిలబడింది. మరణశయ్యపై ఉన్న ఆమె కోలుకోవాలని చిన్న పిల్లల నుంచి దేశాధ్యక్షుల వరకు ప్రార్థనలు చేశారు. తన కల, తన ఆశయం నెరవేర్చుకోవాలన్న బలీయ సంకల్పం మలాలాను బతికించింది. అంత కిరాతకంగా

దాడి చేసినా ఆమెలో ధైర్యం ఏ మాత్రం సడలలేదు. మృత్యువు కోరల నుంచి ఆమె బయటపడింది.

అసామాన్యమైన మలాలా ధైర్యసాహసాలకు ప్రపంచం ఆమెకు నీరాజనాలు అర్పించింది. నోబెల్ కంటే ముందే ఎన్నెన్నో ప్రతిష్టాత్మకమైన అవార్డులు రివార్డులు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. ప్రజాసేవ చేసేందుకు తాను రాజకీయ పార్టీ కూడా పెడతానని, అమ్మాయిలకు చదువుకునే హక్కు కోసం పోరాడ దలచిన వారంతా అందులో చేరవచ్చుని కూడా మలాలా తన ఆకాంక్షను వెల్లడించింది. తన 16వ పుట్టిన రోజున అంటే 2013, జులై 12 నాడు ఐక్యరాజ్యసమితిలో ఆమె ప్రసంగించే అసామాన్య గౌరవం ఆమెకు దక్కింది. జులై 12ను మలాలా దినోత్సవంగా ఐరాస ప్రకటించింది. చదువుకునే హక్కు, మహిళలకు స్వేచ్ఛ, శాంతి ఈ మూడింటి కోసం పోరాడాలని పిలుపు ఇచ్చింది.

ఈ భూమ్మీద ఇప్పటికీ 57మిలియన్ల మంది పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు, చదువుకు నోచుకోవడం లేదు. ఈ విద్యాసంక్షోభానికి ఒక మౌన ప్రేక్షకురాలుగా ఉండలేదు మలాలా. ప్రపంచవ్యాప్తంగా అందరికీ చదువుకునే హక్కు ఉండాలంటూ తన ప్రచారాన్ని విస్తరించింది. అమ్మాయిలు అబ్బాయిలు చదువుకు నోచుకోని పరిస్థితి ఎక్కడా ఉండరాదంటూ మలాలా ప్రపంచ దేశాల నాయకులను కలసి విజ్ఞప్తి చేసింది. ఎక్కడా శాంతికి విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దంటూ అమెరికా అధ్యక్షుడితో సమావేశమైన మలాలా ఆయనకు నిర్మొహమాటంగా సూచించింది. అలా ఆమె యువజనులకు ఒక ఐకాన్‌గా నిలిచింది. పాకిస్తాన్ నుంచి నైజీరియా వరకు ఇంకా అనేక దేశాల పిల్లలకు మలాలా నేడు ఒక చోదకశక్తిగా ఒక గొప్ప ప్రేరణగా ఆవిర్భవించింది. పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా వారిని ఎవరూ అడ్డుకోలేరంటూ ఉగ్రవాదులకు, మత ఛాందసులకు వ్యతిరేకంగా పోరాడే ఒక ప్రపంచ స్థాయి శక్తిగా మలాలా యూసఫ్‌జాయి ఎదిగిన తీరు ఒక అద్భుతం. బీబీసీ ఉర్దూ బ్లాగు నుంచి నోబెల్ ప్రైజు వరకు ఆమె ఎదిగిన తీరును పుస్తకం వివరిస్తుంది.

**– ప్రజాశక్తి బుక్‌హౌస్**
**హైదరాబాద్**

# నేను మలాలాను

**ఖు**షాల్ పబ్లిక్ స్కూల్ గంట మోగింది. విద్యార్థులంతా తమ తమ బ్యాగులు సర్దుకుని బిలబిలమంటూ బయటకు వచ్చారు. అమ్మాయిల కోలాహలంతో స్కూల్ ఆవరణ అంతా మార్మోగిపోయింది.

అది అక్టోబర్ 9, 2012. ఆ అమ్మాయిల కళ్లు సంతోషంతో మిలమిల మెరిసిపోతున్నాయి. వారి భవిష్య జీవితపు అసంఖ్యాక స్వప్నాలు ఆ కళ్లలో గోచరిస్తున్నాయి. 14–15 ఏళ్ల ఆ పిల్లలు స్వతంత్రంగా జీవించాలనుకుంటున్నారు. జీవితానికి నిజంగా కావల్సిందదే. స్కూలు బస్సు బయల్దేరింది. అమ్మాయిలు గర్వంగా వెళ్ళి తమ తమ స్థానాల్లో కూర్చొని మాటల్లో లీనమయ్యారు. ఏం మాట్లాడినా, ఎంత మాట్లాడినా మాటలు తరగడం లేదు. బహుశా వయసు ప్రభావం కావచ్చు. అందుకే ఆ చంచలత్వం నుండి బయటకు రాలేకపోతున్నారు. స్కూల్‌కి రావడం అంటే ఎంత సంతోషమో స్కూల్ నుంచి ఇంటికి వెళ్ళడమూ అంతే సంతోషంగా ఉండేది వారికి. ఈ చిన్న ప్రాయంలోనే ఏదో చేయాలనే తపన ఉండేది. తమ ఆటపాటల్లో ఎంత ఉత్సాహం కనబరుస్తారో, చదువులోనూ వారు అంతే ఉత్సాహం కనబరుస్తారు.

స్వాత్‌లోని మింగోరా పట్టణానికి చెందిన అమ్మాయిలు ఇటువంటి వాతావరణంలో పుట్టి పెరిగారు. మంచి విద్య అభ్యసించాలనుకోవాలని కలలు గనడం, వాటిని సాకారం చేసుకోడం... ఈ రెండే అక్కడ గొప్ప విషయాలు. 2009 వచ్చే సరికి పరిస్థితి మారింది. తాలిబాన్లు వచ్చారు. అమ్మాయిలు గడప దాటరాదన్నారు. తాలిబన్ ఆంక్షలతో అమ్మాయిల చదువు దినదిన గండంగా మారింది. తాలిబాన్లు ఎప్పుడు ఏ కొత్త ఆంక్షలు పెడతారో ఎవరికీ తెలీదు. ఆడపిల్లలంతా భయం నీడలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

వర్తమానంలోకి వస్తే... ఒక్కసారిగా అమ్మాయిల కోలాహలం ఆగిపోయింది. ఆకస్మికంగా బస్సు ఆగిపోవడంతో ఆశ్చర్యచకితులై ఒకరినొకరు చూసుకోసాగారు. అసలేమైంది? అనుకున్నారు. బస్సు స్కూల్ నుంచి ఇప్పుడిప్పుడే బయల్దేరింది. ఇళ్ళకు చేరుకోవడానికి ఇంకా చాలా సమయముంది. మరి బస్సు ఎందుకు ఆగిపోయింది?

గతంలో ఎప్పుడూ ఇలా కాలేదు కదా! అనుకోకుండా రోడ్డుపై బస్సు ఆపడం, అది కూడా స్కూల్‌కి కొద్ది దూరంలోనే! గుసగుసలు. కళ్లలో అనుమానం...ఆందోళన. వారిని ఏదో భయం కమ్ముకుంది. ఆ భయం శ్వాస కూడా తీసుకోనివ్వడం లేదు. ఒకవేళ తాము స్కూల్‌కి వెళ్ళకూడదనే ఆంక్షల సందేశం తెచ్చారేమో ? అయినా తాలిబాన్లు అలాంటి ఆజ్ఞ ఇచ్చినా కూడా వారు స్కూల్‌కి వెళ్ళకుండా ఉండలేరు.

అప్పటికే కొంతమంది సాయుధ తీవ్రవాదులు బస్సు ఎక్కినట్లు పిల్లలకు అర్థమయ్యింది. వారు నల్లటి ముసుగులతో ముఖాన్ని కప్పేసుకున్నారు. కాని నిప్పులు కక్కుతున్న వారి కళ్ళు మాత్రం కనిపిస్తున్నాయి. వారి చేతుల్లో తుపాకులు ఉన్నాయి. అమ్మాయిలు భయంతో ఒకరికి ఒకరు అతుక్కుపోయారు. అంతలో ఒక గంభీరమైన స్వరం వినిపించింది... "మలాలా ఎవరు?"

బస్సులో భయానక వాతావరణం అలుముకుంది. ఎవరో గొంతులు నొక్కేసినట్లనిపించింది అమ్మాయిలకు. వారి పెదవులను కుట్టేసినట్లనిపించింది. వారి పకపక నవ్వులు ఎప్పుడో ఆగిపోయాయి. ఒకరికొకరికి అతుక్కుపోయి, ఒకరి చేతులు ఒకరు పట్టుకుని చేష్టలుడిగి కూర్చున్నారు.

ఇంతలో కొన్ని చూపులు మలాలా వైపు తిరిగాయి. అంతే... ఒక తీవ్రవాది చేతిలో తుపాకి భీకరంగా ఘర్జించింది. మలాలా సీట్లోంచి కుప్పకూలింది. మరో ఇద్దరు అమ్మాయిలకు కూడా బుల్లెట్ గాయాలయ్యాయి. తీవ్రవాదులు బస్సు దిగి మాయమయ్యారు.

అంతా క్షణాల్లో జరిగింది. బస్సు అంతా రక్తంతో హోలీ ఆడినట్లుంది. నెత్తుటిమడుగులో పడివుంది మలాలా. పిల్లలందరూ "మలాలా, మలాలా" అని అరుస్తున్నారు. "నేను మా నాన్న దగ్గరకు వెళ్ళాలి, నేను నాన్న దగ్గరకు వెళ్ళాలి"... మలాలా గొంతు బలహీనంగా వినవస్తోంది.

"మలాలా లే, లే మలాలా" అంటూ భీతిల్లిన సాటి అమ్మాయిలు అదేపనిగా పిలుస్తున్నారు. "ఆఁ నేను మలాలాను, నేను మలాలాను" అంటూ ఆమె స్పృహ కోల్పోయింది.

# ధైర్యానికి ప్రతీక

**మ**లాలా యూసుఫ్‌జాయి నేడు యావత్ ప్రపంచంలో ధైర్యానికి మారుపేరుగా నిలిచింది. పాకిస్తాన్‌లోని అమ్మాయిలందరికి విద్యనభ్యసించాలని పిలుపునిచ్చింది. అప్పుడామె వయసు కేవలం 11 ఏళ్లు. షరియత్ చట్టం ప్రకారం పాకిస్తాన్ స్వాత్ జిల్లాలోని ఆడపిల్లలు చదువుకోవడానికి అవకాశం లేదని 2009లో తాలిబాన్లు కట్టుబాటు చేశారు. ఆడపిల్లలు ఇంటి నుండి బయటికి రావడం, పరదా లేకుండా తిరగడం వంటివి తహారీక్–ఏ–తాలిబాన్ పాకిస్తాన్ (టి.టి.పి.) నాయకులకు ససేమిరా నచ్చని విషయాలు. కాని మలాలా మాత్రం వారి ఛాందసత్వపు ఆలోచనలు, భావాలు దేశాన్ని నాశనంవైపు మళ్ళిస్తాయని రాజీలేని సందేశాన్నిచ్చింది. వారికి ఇదంతా అవసరం లేదు. మనకు శాంతి కావాలి, విద్యావంతులు కావాలి అంటుంది. మలాలా 15 ఏళ్ల వయస్సులోనే ఇది నిరూపించగలిగింది. ఈ వయసులో చాలా మంది పిల్లలు ఈవిధంగా కనీసం ఆలోచించలేరు కూడా.

మలాలా తాలిబాన్లను ధైర్యంగా, బహిరంగంగా ఎదిరించింది. ఇది మన అందరి హక్కు అని రాతపూర్వక ప్రచారం చేసింది. తాలిబాన్లు ఆమెను బెదిరిస్తున్నారు. అయినా ఆమె మాత్రం స్వాత్ చుట్టు పక్కల ప్రాంతాలలో ప్రచారం పొందుతూనే ఉంది. నిర్భయంగా ఆమె తాలిబాన్ల క్రూరత్వాన్ని నిందిస్తూ, ప్రజలు వారిపై పోరాడాలని, నిప్పులు చెరుగుతోంది. ఇంటర్‌నెట్‌లలో ఈమె వీడియోలు చూసి ప్రతి ఒక్కరు ఆమెతో ఏకీభవించారు. తాలిబాన్లకు వ్యతిరేకంగా మాట్లాడే మాటల్లో ఆమె బాల్యం ఎక్కడా కనిపించదు. తను మాట్లాడే మాటలు విని తాలిబాన్లు రెచ్చిపోతారని తెలిసే ఆమె మాట్లాడుతుంది.

వాస్తవంగా కూడా జరిగింది అదే. తాలిబాన్లు బెదిరిపోయారు. ఒక అమ్మాయి పిలుపే తమ పట్ల ఇంత వ్యతిరేకత సృష్టించడాన్ని వారు జీర్ణించుకోలేక పోయారు.

మలాలా ఏకంగా పడమటి ప్రపంచానికి ప్రతినిధి అయినట్లు తాలిబాన్లు భావించారు. ఆమె “షరియత్ చట్టానికి” సవాలు విసిరింది. అందుకని ఈ తాలిబాన్ ఉగ్రవాదులు ముక్కుపచ్చలారని ఆ అమ్మాయి ప్రాణం తీయాలని నిర్ణయించారు.

మలాలా తనపై తూటాల వర్షం కురియక ముందే “ఇస్లాంని అడ్డుపెట్టుకొని తాము అభివృద్ధి చెందకుండా అడ్డుకుంటున్నారని, అమ్మాయిలు భయపడుతున్నారని” ఒక వార్త పత్రికకు రాసింది. దీంతో తాలిబాన్లు ఈ చిన్న అమ్మాయి తమ లోపాలను ఎక్కడ బయట పెడుతుందో అని భయపడసాగారు. ఎందుకంటే స్వాత్ లోయలోని అమ్మాయిలు ఇప్పుడు తుపాకులకు భయపడటం లేదు. వారు స్కూల్‌కు వెళ్తున్నారు. “షరియత్ చట్టాన్ని” అడ్డం పెట్టుకొని మహిళలను అజ్ఞానంలోకి నెట్టేస్తున్నారని వారు అర్థం చేసుకుంటున్నారు. దీని గురించి కూడా ఆమె తన శక్తిని చాటుతూ సమాజాన్ని ఆలోచింపచేసే వైపు తీసుకువెళ్ళడంలో ప్రధాన భూమిక పోషిస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏరోజైనా తాలిబాన్లు తనను పట్టుకొని కాల్చేస్తారని. లేదా తన శరీరంపై యాసిడ్ పోస్తారని ఆమెకు బాగా తెలుసు. స్వాత్ ప్రాంత ఆత్మగౌరవం కోసం నా చివరి శ్వాస వరకు పోరాడుతూనే ఉంటాను... అని ప్రకటించింది.

మలాలా ఆచరణలో కూడా ఇది నిజం చేసి చూపింది. ఆమె స్వాత్ లోయలో తిరిగి తిరిగి అమ్మాయిల చదువు గురించి ప్రచారం చేసింది. ఆమె వెళ్ళిన ప్రతిచోట ఇలా అంటుంది “ఎప్పుడో ఒకప్పుడు ప్రతి ఒక్కరూ మరణించక తప్పదు. అలాంటప్పుడు నేను తాలిబాన్ల తుపాకులకు ఎందుకు భయపడాలి?”

తాలిబాన్ల తుపాకులకు మలాలా భయపడలేదు. అప్పుడే వాళ్ళు ఆ అమ్మాయికి భయపడ్డారు. కాని ఆమె దగ్గర ఉన్నది కేవలం కలం శక్తి మరియు ఉత్తేజపరిచే పిలుపు ఇవ్వడం. భయమంటే తెలియని మలాలా యూసూఫ్‌జాయి ధైర్య, సాహసాలకు చిరునామాగా మారింది. అమ్మాయిల చదువు మరియు మహిళల హక్కుల కోసం శాంతి స్వరూపమైన మలాలా ఉగ్రవాదుల వ్యతిరేక ధ్వని మాత్రమే కాదు, ఈమె ప్రయత్నాలు చీకటిని పారద్రోలే కిరణాలై ప్రకాశించాయి. పాకిస్తాన్‌తో పాటు పూర్తి ప్రపంచానికి తీవ్రవాదుల నుంచి పొంచి ఉన్న అపాయానికి వ్యతిరేకంగా ప్రజలు ఒక కొత్త ఒరవడిలో ఐక్యమయ్యేలా ఆమె వీరత్వం ప్రేరణనిచ్చింది.

"మలాలా" అంటే బాధలను భరించేది  అని అర్థం. కాని మలాలా తన పేరులో ఉన్న అర్థానికి వ్యతిరేకంగా బాధలను దూదిపింజలా మార్చి చూపించింది. తను తాలిబాన్ తీవ్రవాదులకు సవాల్ విసిరింది. తనలాంటి వేలమంది మలాలాలు వెంట నడవసాగారు. అమ్మాయిల చదువు కోసం, హక్కుల కోసం ప్రాణాలు  పణంగా పెట్టిన మలాలాను ఒక అజేయ శక్తిగా ప్రపంచ ప్రజలు భావిస్తున్నారు. ఈ యుద్ధంలో మలాలా ఒక్కటే లేదు... నేడు పాకిస్తాన్‌లోని ప్రతి అమ్మాయీ ఒక మలాలా కావడానికి ముందుకు వస్తోంది.

తాలిబాన్ ముష్కరుల కోటలు బీటలువారేలా వారికి వ్యతిరేకంగా బాహాటంగా ప్రచారం చేస్తూ కూడా తను ఉన్న దగ్గరే ఉండటం అందరికీ సాధ్యమయ్యేది కాదు. ఎవరో ఒక అసాధారణమైన, సాహసవంతురాలైన అమ్మాయి మాత్రమే అలా చేయగలుగుతుంది. అందుకే ప్రపంచం అంతటా  మలాలాను ధైర్యానికి చిహ్నంగా భావిస్తున్నారు. ఆమెను ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

# స్వాత్ అమ్మాయి

**ఆ**న్ ఫ్రాంక్ అనే పన్నెండేళ్ల అమ్మాయి రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో హిట్లర్ సైన్యం బెదిరింపులకు వ్యతిరేకంగా ఒక డైరీ రాస్తూండేది. అంతిమంగా ఆ అమ్మాయి పట్టుబడింది. హిట్లర్ కారాగారంలో 15 ఏళ్ల వయసు లోనే ఆమె తుదిశ్వాస విడిచింది. ఎన్నో సంవత్సరాల తర్వాత ఆ డైరీ బయటపడింది. హిట్లర్ పాలనలో ప్రజల జీవితాలు ఎలా మగ్గిపోయేవో అది కళ్లకు కట్టినట్లు వర్ణించింది. "డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్" పేరుతో ఇది నేటికీ సుప్రసిద్ధం. ఇప్పుడు మరో డైరీ ప్రజలను ఆకట్టుకుంటోంది. దాని పేరు గుల్‌మకాయి బిబిసి డైరీ. తాలిబన్ తీవ్రవాదులు అఫ్ఘనిస్తాన్ నుంచి పాకిస్తాన్‌లో ప్రవేశించారు. అందమైన స్వాత్‌లోయలో వారు పాదం మోపారు. స్వేచ్ఛగా జీవిస్తున్న స్వాత్ ప్రజలపై అధికారం చెలాయించసాగారు. ఎంతైనా వారు తాలిబాన్లు. హిట్లర్‌లాగా ప్రపంచమంతా తాము అనుకున్నట్లే ఉండాలంటూ కలలు కంటారు. అప్పటికే స్వాత్ లోయలోని అనేక ప్రాంతాలను వశపర్చుకున్నారు. పాఠశాలలపై ప్రత్యేకంగా అమ్మాయిల పాఠశాలలపై దృష్టి సారించారు. తక్షణం స్కూళ్లు మూసివేయాలని ఆజ్ఞాపించారు. 2001 నుండి 2009 మధ్య కాలంలో దాదాపు 400 పాఠశాలలు నామరూపాల్లేకుండా పోయాయి. వీటిలో 70 శాతం అమ్మాయిలవే. అమ్మాయిలు ఇంటి నుండి బయటికి రావాలంటే భయపడే వాతావరణం తాలిబాన్లు సృష్టించారు. వారిపై అనేక రకాల నిబంధనలు, నిషేధాలు విధించారు. అదే సమయంలో బి.బి.సి. ఉర్దూ శాఖ 'గుల్‌మకాయీ డైరీని ప్రారంభించింది. ప్రత్యేకంగా మహిళలు, అమ్మాయిలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు వివరిస్తూ, ఈ ప్రపంచానికి తాలిబాన్ల క్రూరత్వాన్ని గుల్‌మకాయీ డైరీ చూపించింది. ప్రత్యేకంగా మహిళలు, అమ్మాయిల జీవితాల గురించి ఉన్న డైరీ జనవరి 2001 నుండి జనవరి 2009 మధ్యలో బిబిసి ఉర్దూ శాఖ వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమైంది. స్వాత్ నుండి ప్రపంచంలోని అనేక ప్రాంతాల వరకు ఉన్న ప్రజల్లో ఈ డైరీ కలకలం సృష్టించింది. ఆ సమయంలో గుల్‌మకాయి వయసు కేవలం 11సంవత్సరాలు

మాత్రమే. "ప్రాథమిక హక్కు అయిన చదువును నా నుంచి ఎవరు దూరం చేస్తారు?" అని ఆ వయసులోనే ప్రశ్నించింది. బ్రిటన్ వార్తా ప్రసార సంస్థ ఉర్దూ శాఖకు డైరీ రాయడం మొదలుపెట్టింది. ఆ విషయాలన్నీ ఉన్నవున్నట్లు, చిన్న మాట పొల్లు పోకుండా రాత్రికి రాత్రే గొప్ప ప్రచారం పొందాయి.

గుల్‌మకాయి సాహసాలు, నిర్భయమైన ఈ సమీక్షలు తాలిబాన్లను రెచ్చగొట్టాయి. అసలు ఈ గుల్‌మకాయి అంటే ఎవరు? ఆరా తీయడం మొదలుపెట్టారు. 2009లో తాలిబాన్లు స్వాత్ నుంచి వెళ్ళిపోవాలని పోలీసు శాఖ నుంచి ఆజ్ఞలు జారీ అయ్యాయి. అది కూడా పాకిస్తాన్‌పై విదేశాల నుంచి ఒత్తిడి వచ్చినపుడు. ఆ తర్వాత 2009 డిసెంబర్‌లో గుల్‌మకాయి గుట్టురట్టయ్యింది. ఆ అమ్మాయి ఫలానా అని వెల్లడి కాగానే తాలిబాన్లు నిర్ఘాంతపోవడమే కాకుండా, స్వాత్ ప్రజలు కూడా ఆశ్చర్యచకితులయ్యారు. నిజంగా ఆశ్చర్యమే. కేవలం 11 సంవత్సరాల వయసున్న ఒక చిన్న అమ్మాయి ఆలోచనల్లో రాతల్లో ఈ ప్రపంచమంతా కలవరపడేంత, తాలిబాన్ల వంటి క్రూరమృగాలను కూడా భయాందోళనలకు గురి చేసేంత పదును ఎలా వచ్చింది?

తాలిబాన్లే కాదు, స్వాత్ లోయలోని ప్రజలంతా గుల్‌మకాయి పేరుతో డైరీ రాసేవారు ఎవరో వయసు మీరిన మహిళ అనుకునేవారు. కాని స్వాత్ ప్రాంతానికే చెందిన 11 ఏళ్ల అమ్మాయి మలాలా యూసూఫ్‌జాయి అని బహిర్గతం కావడంతో అందరూ...ఇరుగుపొరుగు, స్కూల్‌లో అందరూ, స్నేహితులు, బంధుమిత్రులు, నాయకులు మరియు ప్రపంచవ్యాప్తంగా కూడా అందరూ ఆశ్చర్యపోయారు. ఒక అమ్మాయి... తాలిబాన్లంటే భయపడనప్పుడు మనం ఎందుకు భయపడాలి? "ఎవరూ భయపడవద్దు, తాలిబాన్లను ఎదిరించండి" అంటూ ప్రపంచానికి ఆమె ఒక సందేశం అయ్యింది.

మలాలా డైరీ ఆన్ ఫ్రాంక్ లాగే అప్పటి పరిస్థితులను అందరికీ అర్థమయ్యేలా స్పష్టంగా పొందుపరచింది. అందులో ఆమె లీనమై కనిపిస్తుంది. మలాలా అద్వితీయమైన తన సాహసంతో పాటు తాలిబాన్లపై తన బహిరంగ తిరుగుబాటును ప్రకటించి చదువు తన అధికారం, ఎట్టి పరిస్థితుల్లోను విద్యనభ్యసించి తీరుతాను అనుకున్నది, నిరూపించింది. అప్పుడు తాలిబాన్లతో పాటు తన వ్యతిరేకులు, మతమౌఢ్యులు గొంతు విప్పారు. ప్రజలను భయాందోళనలకు గురిచేయడం మొదలుపెట్టారు. దీంతో జనజీవనంలో, అక్కడి వాతావరణంలో అశాంతి చెలరేగింది.

గడప దాటితే వారిపై తాలిబాన్లు ఎక్కడ దాడి చేస్తారో అనే భయంతో సాయంత్రమైతే ఇళ్ళలో నుంచి బయటికెళ్ళేవారు కాదు. అమ్మాయిలనైతే చాలా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాస్త బాగా బతకగలిగే స్తోమత ఉన్నవాళ్ళు స్వాత్ ప్రాంతం నుంచి పూర్తిగా వలస వెళ్ళి పోయారు.

మలాలా మాత్రం భయపడలేదు. స్కూల్ యూనిఫామ్ కాకుండా సాధారణ బట్టలు ధరించి రావాలని  ఉపాధ్యాయులు చెప్పినా యూనిఫామ్ తొడుక్కునే పోయేది. మలాలాపై అమ్మాయిలే తిరగబడాలని తాలిబాన్లు ఆజ్ఞాపించారు. దాంతోపాటు ఆమె వ్యవహార శైలి "సిగ్గుచేటని, పశ్చిమ దేశాల సంస్కారానికి ప్రతీక"అని ప్రకటించారు.

ఇంకా అసలు వాస్తవంలోకి తొంగి చూస్తే మలాలా యూసూఫ్‌జాయి డైరీ పాకిస్తాన్‌లోని పేరుగాంచిన తాలిబాన్లకు అనేక సమస్యలు, కష్టాలు తెచ్చిపెట్టింది. కాని తాలిబాన్ ముష్కరుల తూటాలు తన ప్రాణం తీయలేకపోవడమే గాక, వారు తన ధైర్యాన్ని కూడా చెదరగొట్టలేకపోయారు.  నేటి ప్రపంచంలోని ప్రతి సందులో, కూడలిలో మలాలా ధైర్యాన్ని గురించి చర్చిస్తున్నారు. ఇంకెంతమంది అమ్మాయిలు మలాలాలవుతారో వేచిచూడాలి.

# పోరాట బాట

*'నాకు చదువుకునే హక్కుంది*
*నాకు ఆటలు ఆడుకునే హక్కుంది*
*నాకు మాట్లాడే హక్కుంది...'*

నిత్యం ఇటువంటి కవితలు రాస్తూ, కూనిరాగాలు తీస్తూ ఉండే ఆ చిన్న అమ్మాయి తన కలలకు రెక్కలు తొడిగి పైకెగిరే స్వేచ్ఛ కావాలనుకుంది, భయం లేని జీవితం గడపాలనుకుంది, అందు కోసం ప్రాణాలైనా పణంగా పెట్టడానికి సిద్ధపడింది. తనకే కాదు ప్రతిఒక్కరికీ అటువంటి జీవితం దొరకాలని తపన చెందింది.

పిల్లల హక్కులు సాధించే కార్యకర్తగా సుప్రసిద్ధమైన మలాలా యూసుఫ్‌జాయి కలలు చాలా పెద్దవైతే కాదు. ఒక మామూలు అమ్మాయిలాగే సామాన్యమైన జీవితాన్ని గడపాలని కోరుకుంది. తను కూడా స్కూల్‌కు వెళ్ళాలని, స్నేహితులతో పాటు ఆటలు ఆడాలని, తల్లిదండ్రులు తమ్ముళ్లతో కలిసి సంతోషంగా జీవితం గడపాలని అనుకుంది. ఏం తప్పుంది ఆమె ఆలోచనలో? ఏ మాత్రం తప్పులేదు. కాని ఈ ఆలోచనలపై కూడా నిషేధాజ్ఞలు జారీ అయ్యాయి. అయినా ఆమె తన హక్కులు సాధించుకోవడానికే సిద్ధమైంది.

12 జులై, 1997న పాకిస్తాన్ స్వాత్ జిల్లాలోని ఖైబర్ ఫక్తూన్‌ఖావ్ ప్రాంతంలో జన్మించిన మలాలా స్వాత్ కొండల్లో అత్యధిక జనాభాగా ఉన్న యూసుఫ్‌జాయి తెగకు చెందినది. మలాలా పుట్టిన స్వాత్ కొండల్లోని మింగోరా ప్రాంతమే తాలిబాన్ల ముఖ్య స్థావరం. ఆ మింగోరాలో అనేక సంవత్సరాలుగా ఆదివాసీ ఆచారాల ఆధిపత్యం ఉండేది. వీరి సంస్కృతి, సంస్కారాలు ఒకేవిధంగా ఉండేవి. వారి జీవన సరళి మరియు వారి నియమావళి అర్థం చేసుకోవడానికే ఇబ్బందిగా ఉండేది. ప్రతి విషయంలో అది స్పష్టంగా కనిపించేది. మలాలా ఈ యూసుఫ్‌జాయి భావజాలం గల ఆదివాసీ సమాజంలో పుట్టి పెరిగింది. ఆమె తండ్రి జియాఉద్దీన్ యూసుఫ్‌జాయి వృత్తిపరంగా పాఠశాల

నిర్వహకుడు. సామాజిక కార్యకర్తగా కూడా పనిచేసేవారు. మలాలాను చూసి చాలా గర్వపడేవాడు. మలాలా పుట్టినప్పుడు ఆయనకు ఆ పసికందు కళ్ళలో ఒక మెరుపు కనిపించింది. అది చూసి, "నా కూతురు ఏదో ఒక రోజు ప్రపంచమంతటా మెరిసిపోతుంది" అనుకున్నాడు. జియావుద్దీన్ తన కూతురి పేరు ఆఫ్ఘనిస్తాన్‌లోని ప్రాచీన జానపద గాయనీ, తిరుగుబాటుదారూ అయిన "మలాలాయి" జ్ఞాపకంగా పెట్టాడు. మలాలాయిని అఫ్ఘనిస్తాన్ "జోన్ ఆఫ్ ఆర్క్"గా కూడా గుర్తిస్తారు. ఆమె 1880లో రెండవ బ్రిటిష్–ఆఫ్ఘాన్ యుద్ధం నాటి మేవంద్ పోరాటంలో తన ప్రతాపంతో శత్రువులను మట్టి కరిపించింది. 18 ఏళ్ళ వయసులోనే అఫ్ఘనిస్తాన్ పతాకం ఎగరేస్తూ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఉగ్రరూపం దాల్చింది. ఆమె ఆంగ్లేయులతో పోరాడే స్వతంత్ర సైన్యానికి ఆయుధాలు అందించేది. మేవంద్‌లో జరిగిన ఈ యుద్ధంలోనే మలాలాయి వీరమరణం పొందింది. కాని ఆ ఆదివాసీ సమాజం మొత్తం ఇప్పటికీ ఆ పేరునే జపిస్తుంటారు.

మలాలాను మలాలాయితో పోల్చి చూస్తే, ఆమె కూడా మలాలాయి కంటే తక్కువేమీ కాదు. కేవలం 11 ఏళ్ళ వయసులోనే ఛాందసులైన తాలిబాన్లకు వ్యతిరేకంగా నిలిచింది. ఆ తర్వాత పాకిస్తాన్ సైన్యం తలదించుకుని నిలబడాల్సి వచ్చింది. అంటే శోకసంతప్త అనే తన పేరులో ఉన్న అర్థాన్ని తిరగరాసి ఒక మెరుపును మెరిపించింది. బహుశా తన తండ్రి అనుకున్నట్లు మలాలాయి పేరులో ఉన్న అర్థమే తనకూ వర్తిస్తుందేమో. అమాయకంగా, అమితానందంగా మరియు అందంగా గులాబీ మొగ్గలా వికసించిన మలాలా కూడా తన తోటి అమ్మాయిల్లా తన బాల్యంతో ఆటపాటలతో ఆనందంగా గడుపుతుంది. సువిశాలమైన తమ ఇంటి ప్రాంగణంలో ఇద్దరు చిన్న తమ్ముళ్ళతో కాలం తెలీకుండా ఆడుకుంటుంది. మట్టితో తయారైన ప్రతి ఆటబొమ్మలో పాఠశాలా ఇంకా అందులో చదువుకునే పిల్లల రూపాలే ఆమెకు గోచరిస్తాయి. తోటలోని ఏదో ఒక చోట పుస్తకాల కుప్పల మధ్య చిన్న మలాలా అలా ఆడుతూనే చదువుకుంటూ కనిపిస్తుంది. చదువు నుంచి మళ్ళించడానికి తమ్ముళ్ళు ఆ పుస్తకాలను లాక్కొనిపోతే వెంట పరుగెడుతుంది. పుస్తకాలను చాలా జాగ్రత్తగా పెట్టుకుంటుంది. కాగితాలపై ముద్రించిన నల్లని అక్షరాలు చదువుతూ ఏమేమో కావాలని, ఏదో చేయాలని ఎన్నెన్నో కలలుగంటుంది. తన మంచం పక్కన కొయ్యకు తన ముదురు నీలం స్కూలు యూనిఫామ్ తగిలిస్తుంది. తన కలలన్నీ దాంట్లోనే దాగి ఉన్నట్లు దాన్ని సుతిమెత్తగా తాకి సంబరపడుతుంది. నీలాకాశంలో తారాజువ్వలు వెదజల్లిన రంగుల కలలు కంటుంది. వాటన్నిటిలోనూ బాగా చదువుకోవాలన్న ఆమె కోరిక ప్రతిఫలిస్తుంటుంది.

జియాఉద్దీన్ యూసుఫ్‌జాయీ పాఠశాల పేరు ఖుషాల్ పబ్లిక్ స్కూల్. 17వ శతాబ్దంలో అభ్యుదయ రచనలు, కవితలు రాసి మొగలాయిలకు విరుద్ధంగా పోరాడిన 'ఖుశాల్ ఖాన్ కట్టక్'కి స్మారకంగా ఆ పేరు పెట్టారు. ఆయన జాతీయ కవి బిరుదాంకితుడు.

జియావుద్దీన్ "కౌమీ జిగ్రా" పత్రికలో పని చేశాడు. మరియు సైన్యం అలాగే స్థానిక అధికారులతో కలిసి నగరంలోని కష్టకాల పరిస్థితులు, విద్యుత్ సరఫరాలో తగ్గింపులు, మురికి నీళ్ళు. పారిశుధ్యం, నిరంతర విద్యా సౌకర్యాలు వంటి సమస్యలపై నిత్యం ఆందోళనలు చేస్తుండేవాడు.

యవ్వనావస్థలో అడుగిడుతున్న జియావుద్దీన్ స్వాత్‌లో వచ్చిన పరివర్తనలకు సాక్ష్యంగా నిలిచాడు. తన జీవితమంతా పిల్లల కోసం, ప్రత్యేకంగా అమ్మాయిల కోసం పాఠశాలలు అభివృద్ధి చేయడానికే గడపాలని దృఢంగా నిర్ణయించుకున్నాడు. జియావుద్దీన్ భావాల ప్రభావం ఆయన దృఢమైన నిర్ణయం ప్రభావం మలాలాపై బాల్యావస్థ నుండే ఉంది. ఎవరూ చేయలేని పని ఏదైనా చేయాలనే కోరిక కూడా ఆమె మనస్సులో బలంగా నాటుకుంది. ఇంటి పరిసరాల ప్రభావం పిల్లలపై పడటం సహజమే. మలాలా కూడా తన తండ్రి అభిప్రాయాలు, సామాజిక కార్యక్రమాలు, కవితల నుండి దూరం కాలేదు.

మలాలా తల్లి ఒక సాధారణ సాంప్రదాయబద్ధమైన మహిళలాగే ఉండేది. ఇంకా పరదా వెనకే ఉండేది. అయినప్పటికి తను మలాలాకు మాత్రం పూర్తి స్వేచ్ఛనిచ్చేది. తన కూతురు బాగా చదువుకోవాలి అనుకునేది. తల్లిదండ్రులిద్దరూ తమ ముద్దుల కూతురికి పూర్తి ప్రోత్సాహాన్నిచ్చేవారు. "నువ్వు మనస్ఫూర్తిగా చెప్పు, ఏం చదువుకోవాలనిపిస్తే అది చదువుకో" అనేవారు. బాల్యావస్థ నుండే మలాలా విభిన్న విషయాలపై పెద్ద పెద్ద వ్యాసాలు సునాయాసంగా రాస్తూండేది.

మలాలా తన ప్రారంభ సంవత్సరాల్లో ఖుషాల్ పబ్లిక్ స్కూల్లో ఉన్న రెండు గదులలో తానొక గదిలో కూర్చునేది. మలాలా పేరు వినగానే ప్రిన్సిపాల్ మరియం ఖాలికీ ముఖంలో గౌరవభావం కమ్ముకునేది. మలాలాకు రెండు సంవత్సరాల వయస్సున్నప్పుడు పాఠశాల తరగతులన్నీ పరుగెడుతుండేదని చెబుతుండేది. మూడేళ్ళ వయస్సులోనే క్లాసులో కూర్చుండేది. టీచర్లు బోధించే ప్రతీ మాటను శ్రద్ధగా వినేది. అప్పుడే తన కళ్ళల్లో మెరుపు కనిపించేది. పెద్ద పిల్లల పాఠాలు కూడా చాలా సులువుగా

అర్థం చేసుకునేది. 5వ తరగతిలోకి రాగానే వక్తృత్వ పోటీల్లో పాల్గొనేది. ఉర్దూ కవితల పాఠాలన్నీ చదివేది. విప్లవ కవి, "పాకిస్తాన్ టైమ్స్" మాజీ సంపాదకుడు అయిన ఫైజ్ అహ్మద్ 'ఫైజ్' తనకు నచ్చిన శాయర్. ఇంత చిన్న వయస్సులోనే కవితలు రాయడం, ఏ విషయాన్నైనా చాలా సులువుగా అర్థం చేసుకోవడం వాస్తవానికి చాలా అరుదైన విషయం. ఆమెను చూస్తే ఏదో జ్వాల నిత్యం లోలోపల ప్రజ్వరిల్లుతూ ఉంటున్నట్లు అనిపిస్తుంది. ఏదో ఒక రోజు తనను తాను గొప్పగా నిరూపించుకుంటుంది.

మలాలా ఒక సాధారణ అమ్మాయి. అయినప్పటికీ అమాయకంగా ఉంటూనే అందరిలా కాకుండా ప్రత్యేకతను కనబరుస్తుంది. తను స్నేహితులతో, తమ్ముళ్ళతో దాగుడుమూతలు, చిల్లపెంకులు ఆడుకునేది. కాని ఆటలాడుతూనో లేదా పెళ్లి చేసుకుని సంసారంలో పడటమో ఆమె ఆశయం కాదు. తన లక్ష్యాలు, ఆశయాలు ఇంకో విధంగా ఉండేవి. తను ఈ సమాజం కోసం ఏమైనా చేయాలనుకునేది. ఎందుకంటే తమ కోసం తాము ఎవరైన బ్రతకగలరు. అందులో కొత్తదనమేముంది? అందుకే ఆమె సాహస, పోరాట బాట ఎంచుకుంది. బాల్యంలోనే రకరకాల అవరోధాలను చూసి తన లక్ష్యాన్ని చేరుకోవాలంటే అడుగడుగునా కష్టాలను ఎదుర్కొనక తప్పదని అర్థం చేసుకుంది. తనెంచుకున్న సంకల్పాన్ని దృఢపరుచుకుంది.

పావులో క్వోయలో రాసిన ఆల్‌కెమిస్ట్ చదవడం మరియు స్టార్ ప్లస్ టివీలో తనకు నచ్చిన షో "మై డ్రీమ్ బాయ్ విల్ కమ్ మ్యారీ మీ" చూడటం ఇంకా తన తండ్రి ద్వారా రోమ్ కవితలు వినడం ఎంతో ఇష్టపడే మలాలా 11 ఏళ్ల వయసులోనే నిజమైన జీవితాన్ని, తీవ్రవాదుల క్రూరత్వాన్ని తెలుసుకుంది. అందుకే ఆమె పోరాటంలో తూర్పు-పడమటి పాకిస్తాన్‌లోని స్వాత్ లోయ నుండి తాలిబాన్లు వెళ్ళిపోయిన తర్వాత కూడా 14ఏళ్ల ఒక అమ్మాయి జీవితం ఎంత భయంకరంగా కష్టాలతో నిండివుందో చూడొచ్చు.

2009 నాటి మాట. స్వాత్‌లోయలో ఒక్కసారిగా అల్లర్లు చెలరేగాయి. తాలిబాన్లు అక్కడ ఇస్లాం మతాన్ని అనుసరించి షరియత్ చట్టం అమలు పరచి అమ్మాయిలను పాఠశాలకి వెళ్ళడాన్ని నిషేధించారు. అప్పుడు మలాలా 7వ తరగతి చదువుతోంది. ఒక్కసారిగా ఎవరో తన రెక్కలు విరగ్గొట్టినట్లనిపించింది. తన కలలన్నీ పొగబారినట్లని పించాయి.

"అయితే ఇక నేను చదువుకోలేనా?" అంటూ నిత్యం తన తండ్రిని ప్రశ్నించేది. తమ చుట్టూ ఉన్న ఊపిరాడనీయని పరిస్థితులను చూసి! "కాని, ఇది చాలా తప్పు కదా!

నాన్నా, మనమే ఏదైనా చేయాలి” అంటూ తన తండ్రిని ప్రశ్నిస్తుంటే – తండ్రితో పాటు చుట్టుపక్కల మిత్రులు ఆశ్చర్యపోయేవారు. మలాలా అయితే అటువంటి అన్యాయాన్ని సహించే వారితో , తాలిబాన్లు పెట్టిన నిబంధనలు విని నోరు మెదపకుండా బెదిరిపోయి మూలన కూర్చునేవారితో సమానురాలు కాదు. తన లోపల ఉన్న ఒక లావా ఉండి ఉండి ఉబికి వచ్చేది. ఈ పరిస్థితుల్లో హృదయాన్ని హత్తుకొనే కవిత ఒకటి రాసింది. దీన్ని రావల్పిండిలోని ఒక పత్రికలో ముద్రించారు.

శవాలతో వ్యాపారం చేసేవారు

ధర్మాన్ని రక్షించే వారెలా అవుతారు?

వీరిని మానవులుగా భావించడమే అన్యాయం.

# తిరుగుబాటు

**పి**న్నవయసులోనే మానవ హక్కుల కోసం తిరుగుబాటుకు సాహసించి, "మోసం" పేరుతో బిబిసి ఉర్దూ ప్రసారం కోసం డైరీ రాయడం ఆరంభించిన మలాలా తాలిబాన్లను, వారి షరియత్ (ధార్మిక) చట్టాన్ని సవాలు చేసింది. ఎప్పుడైతే స్వాత్ లోయలో తాలిబాన్ల ఆగడాలు మొదలయ్యాయో అప్పటి నుంచే మలాలా విశ్రాంతి కోల్పోయింది.

"తహెరీక్–ఎ–తాలిబాన్" దీన్ని టి.టి.పి. లేదా పాకిస్తాన్ తాలిబాన్ అని కూడా అంటారు. పాకిస్తాన్–అఫ్ఘనిస్తాన్ మధ్య ప్రాంతంలో ప్రజాపాలన పేరుతో అరాచకాలు సృష్టిస్తున్న ఉగ్రవాద ముఠాల సంస్థ ఒకటుంది. ఇది ఆఫ్ఘనిస్తాన్ తాలిబాన్లతో వేరుపడింది. అయినప్పటికి వారంతా ఏకాభిప్రాయంతోనే ఉంటారు. వీరి ధ్యేయం పాకిస్తాన్‌లోని షరియత్ చట్టాలపై ఆధారపడిన ఛాందసవాద ఇస్లామీ సంస్థను ఏర్పాటు చేయాలనుకున్నారు. దీన్ని 2007 డిసెంబర్‌లో ఏర్పాటు చేసుకున్నారు. జైతుల్లాహ్ మసూర్ నాయకత్వంలో 13 ముఠాలు కలిసి ఒక దాడికి సిద్ధమయ్యారు.

పాకిస్తాన్ నిర్మాత మహ్మద్ ఆలీ జిన్నా మృతి చెందే ముందు "మతంపై ఆధారపడి ఏర్పడ్డ పాకిస్తాన్ ఎక్కువ కాలం నిలవదని నేను ఈ ప్రపంచాన్ని వదిలి పెట్టి వెళ్ళిపోతున్న సమయంలో అసలు యదార్థాన్ని గమనించాను. మనం ఏ ఉత్సాహంతో పాకిస్తాన్ నిర్మించుకున్నామో ఆ ఉత్సాహం మన ముందు గడిచిన 24 సం॥లలోనే నీరుగారిపోయింది" అన్నాడు.

పాకిస్తాన్ ప్రభుత్వం తాలిబాన్ల ముందు మోకరిల్లి స్వాత్‌ను వారికి వశపరిచింది. ఆ సమయంలో ఒకవేళ జిన్నా ఇంకా తన ముస్లిం లీగ్ నాయకత్వంలో ఉంటే "పాకిస్తాన్ ఏర్పాటు చేయడం తన జీవితంలో చేసిన అన్నింటికంటే పెద్ద తప్పిదం ఇదే" అనుకునేవారు. కాని తాలిబాన్లు కూడా అప్పటికప్పుడు ఎక్కడి నుంచో ఊడిపడ్డవారు కాదని కూడా గమనించాలి.

జమాత్–ఎ–ఇస్లామి, ఇంకా తమను తాము గొప్పవారమనుకునే ఛాందసులు పాకిస్తాన్‌ను తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. వారు పాకిస్తాన్‌ను ఇస్లామిక్ ధార్మిక దేశంగా మార్చడానికి కట్టుబడి ఉన్నారు. స్వాత్ ఇంకా దాని చుట్టుపక్కల ఏం జరుగుతుందో తెలుసుకోడానికి ఒక ఉదాహరణ : ఆ కొండల్లోని పెద్ద నగరమైన మింగోరాలో ప్రతిరోజూ కనిపించే దృశ్యం తాలిబాన్ల కిరాతకాలకు అద్దం పడుతుంది. అక్కడి ప్రధాన కూడలిలో ప్రతీ ఉదయం తల నరికిన ఒక మొండెం కాళ్ళు పైకి వేలాడదీసి దర్శనమిస్తుంది. ఆ రెండు కాళ్ల నడుమ తల వేలాడుతుంటుంది. ఇది తాలిబాన్లు కేవలం జనాన్ని భయభ్రాంతులకు గురిచేయడానికి, గొడవలు రేపడానికి  మనుషులను ఎత్తుకొచ్చి చేసిన పని. స్వాత్ లోయలో ఒకప్పుడు 15 లక్షల జనాభా ఉండేది. ఇప్పుడు కేవలం 5 లక్షల మంది మిగిలారు.

తాలిబాన్ల డిక్షనరీలో "దయ" అనే మాటే లేదు. ఇంకా విచిత్రమేంటంటే నాలుగు పెళ్ళిళ్ళయినా చేసుకోవాలనుకునే ఈ తాలిబాన్లు అత్యధికంగా మహిళలనే హత్య చేస్తారు. ఈ కారణంగానే తాలిబాన్లను పాకిస్తాన్ అమ్మాయిలు, మహిళలు అవమానంగా భావించి తలదించుకుంటారు. తాలిబాన్లదీ ఇదే పరిస్థితి. వారికి స్త్రీ జాతి అంటేనే ద్వేషం. వారు గురిపెట్టారు. వారు వీరి హక్కులను కాలరాస్తున్నారు. ఆఖరికి ఆడవారు ఇస్లామ్ నుంచి పొందిన హక్కులను సైతం విచ్ఛిన్నం చేస్తున్నారు. వారి మౌలిక హక్కులను లాక్కుంటున్నారు. ఆడపిల్ల పుట్టడమే ఆలస్యం... నరకం చూపించడానికి  ఎదురు చూస్తుంటారు.

పాకిస్తాన్‌లో మహిళలను నేటికీ బానిసలుగా భావిస్తారు, వాస్తవానికి ముసల్మానులకు అమ్మాయిలు పుట్టడమే పాపం అన్నట్లు.

ఇస్లామ్ పక్షపాతులమని చెప్పుకునే తాలిబాన్లు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి "ధార్మిక చట్టం" అమలు పర్చారు. ఒకవేళ ఎవరైనా దీనికి వ్యతిరేకంగా మాట్లాడితే వారిని శిక్షించారు. తాలిబాన్లు మహిళలు సంతకెళ్లి కొనుగోలు చేయ్యొద్దని నిషేధిస్తూ ఆజ్ఞలు జారీ చేశారు. పరిస్థితులు ఎంత ఇబ్బంది కలిగిస్తున్నాయంటే ప్రత్యేకంగా మహిళల కోసం ఏర్పాటు చేసిన దుకాణాలు మూసేయలేరు. తెరిచి ఉంచితే  మహిళలకు సరుకులు అమ్మకూడదని దుకాణదారులకు  బెదిరింపులు వస్తాయి. ఈ నిబంధనల గోడ పత్రికలు స్వాత్ ప్రాంతంలో నేటికీ దర్శనమిస్తాయి. వీటిలో మహిళలు సంతకెళ్ళడం ఇస్లామ్‌కు వ్యతిరేకం అని స్పష్టంగా ఉంది.

తాలిబాన్లు ఎక్కడినుంచో ఆకస్మాత్తుగా ఊడిపడలేదు. వారికి రష్యా నుంచో లేదా భారత్ నుంచో నిధులు అందడం లేదు. 90వ దశకంలో ఆఫ్ఘాన్లు ఈశాన్య తాలిబాన్లతో

కలిసి పోరాడేవారు. ఆ సమయంలో పాకిస్తాన్‌లోని కబాయిలీ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో ఆదివాసీ సంచార జాతులు తాలిబాన్లకు మద్దతుగా ఆఫ్ఘనిస్తాన్ చేరుకున్నారు. పాకిస్తాన్ అధికారులు మరియు అమెరికా వీరిద్దరు మాత్రమే నేడున్న వాయవ్య మధ్య ప్రాంతంలో గొడవలు సృష్టిస్తున్నారని ప్రచారం ఉంది. బహుశా ఇందుకోసమే పాకిస్తాన్‌లో తయారైన తాలిబాన్లు వాయవ్య సరిహద్దుల్లో నుంచే పెద్ద సంఖ్యలో సంచరిస్తుంటారు. మలాలా యూసుఫ్‌జాయిని తాలిబాన్ వర్గీయుల ద్వారా కాల్పులు జరిపించి హత్య చేసే ప్రయత్నం చేసిన స్వాత్ కొండ కూడా ఈ దారిలోనే ఉంది.

ఆఫ్ఘనిస్తాన్‌లో పోరాడటానికి సిద్ధం చేసిన తాలిబాన్లు సింద్ లేదా పంజాబ్‌కి చెందినవారు కాదు. స్వయంగా పాకిస్తాన్ పరిపాలకులకు తలనొప్పిగా మారిన పాకిస్తానీయులే వీరు. ఒకవేళ ఎవరైన ఒక ప్రత్యేక గుర్తింపు పొందిన తలపాగా, బిగుతుగా ఉండే చొక్కా–ప్యాంటు, ఇంకా కండువా ధరించి ఉంటే వెంటనే వారిని తాలిబాన్ వేషధారణ అని గుర్తించవచ్చు. ఈ వేషధారణ ఇప్పుడు తాలిబాన్ల స్థావరంగా మారిన వాయవ్య సరిహద్దుల్లోని ఆదివాసీ ప్రజలది.

2001లో తాలిబాన్ల ఆఫ్ఘన్ స్వర్గధామం విధ్వంసమైనప్పుడు అక్కడి ఆందోళనాకారులు పక్కనే ఉన్న పాకిస్తాన్ పరిసర ప్రాంతాలకు వలస వచ్చారు. కొంతకాలం తర్వాత తిరిగి స్వాత్ కొండ ప్రాంతానికి వెళ్ళి స్థిరపడ్డారు. ఆ సమయంలో పాకిస్తాన్ తాలిబాన్లు బలహీనంగా ఉన్నారు. అప్పుడు ఆఫ్ఘనిస్తాన్ నుండి వచ్చిన తాలిబాన్లను ఆదుకున్నారు. వీరి అండతో బాగా డబ్బులు సంపాదించుకున్నారు. కఠినమైన ధార్మిక చట్టాల ద్వారా స్వాత్ లోయలో అధికారం నడుస్తుంది అని సందేశమిచ్చారు. ఆఫ్ఘనిస్తాన్‌లో విఫలమైన వారి తీవ్రవాదం మళ్లీ ప్రాణం పోసుకుంది. కొత్త స్వర్గధామమైన స్వాత్‌లో ధార్మిక చట్టాల ద్వారా తాలిబాన్ రాజ్యం నెలకొల్పాలని కలలు కన్నారు. ఇక 2001–2004 కాలంలో పాకిస్తానీ తాలిబాన్ల సంఖ్య ఎన్నో రెట్లు పెరిగింది. ఆ పరిస్థితుల్లో ఒక ప్రత్యేక రాజ్యం ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచన వారికి వచ్చింది. ఆ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

తాలిబాన్ల నేత మౌలానా ఫజిల్ ఉల్లాహ్ మౌలానా రేడియో ద్వారా సందేశం ఇవ్వడం ప్రారంభించారు. అప్పటి నుంచి పాకిస్తాన్ ప్రభుత్వం స్వయంగా ఇక్కడి స్థానిక ఆందోళనకారులతో ఎదురు పోరాటం ప్రారంభించింది. ఇంకా అమెరికా డ్రోన్ దాడులు కూడా తోడయ్యాయి. దాని ముఖ్య స్థావరం ఈ స్వాత్ కొండ ప్రాంతమే. కాని సంవత్సరాలు గడిచిపోయినా, పాకిస్తాన్ ప్రభుత్వం కాని మరియు సైన్యం కాని తాలిబాన్లకు ఏమాత్రం

నష్టం చేకూర్చలేక పోయాయి. తాలిబాన్లకు చెందిన ప్రముఖ నాయకులందరూ పాకిస్తాన్‌లోనే ఉన్నారు. పాకిస్తాన్ ప్రభుత్వం పునాదులు పీకేయడానికి పూనుకున్నారు. తాలిబాన్ల ఈ యుద్ధంలో కాశ్మీర్ నుంచి లష్కర్–ఎ–తోయబా, హర్కత్– ఉల్–ముజాహిదీన్ సంస్థలు కూడా కలిసిపోయాయి.

పాకిస్తానీ సైన్యంతో పాటు నాటో దేశాల దళాల కోసం ఉద్దేశించిన సరఫరాల మార్గం మీద దాడి చేసి తాలిబాన్లు తమ ఉనికి చాటుకున్నారు. వారు 2001 నుండి 2009 మధ్య నీచమైన హత్యాకాండలకు పాల్పడ్డారు. అదే పరిస్థితుల్లో తమవైన ఇస్లామిక్ పద్ధతులను కూడా అమలు పరిచే ప్రయత్నం చేశారు. ప్రత్యేకంగా మహిళల విద్యా వ్యవస్థను తీసుకుని పోరాడాలనేది తాలిబాన్ల ఆలోచన. స్వాత్ కొండల్లో వారు ఆ ఆలోచనను సాకారం చేయడంకోసం ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఎవరైనా అడ్డుతగిలితే వారి తలను మొండెం నుంచి వేరు చేసేవారు. అయితే పాకిస్తాన్ సైన్యం ఆ ప్రాంతంలో ఉన్న తాలిబాన్లతో కలిసి తిరిగి పోరాడింది. కాని నార్త్–వెస్ట్ సరిహద్దుల్లోని అపారమైన ఖనిజ సంపదను అధికార సైన్యం నుంచి కొనుగోలు చేయడానికి ప్రస్తుతం రాజ్యమేలుతున్న తాలిబాన్ కమాండర్‌కు చాలా సులువైన పని.

ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబాన్ల ఆ పెత్తనం నాశనమైన తర్వాత కేవలం తాలిబాన్ తీవ్రవాదులు మాత్రమే పాకిస్తాన్‌లోని ఈ ప్రాంతానికి రాలేదు. అమెరికన్లు, ఇంకా పశ్చిమం నుండి అనేక మంది రచయితలు, పాత్రికేయులు, ప్రసారమాధ్యమ సిబ్బంది ఈ ప్రాంతానికి ఎగిరొచ్చారు. ఎందుకంటే ఇప్పుడు అమెరికాకు మొదటి శత్రువైన ఒసామా బిన్‌లాడెన్‌ను అంతం చేయాల్సిన సమయం వచ్చింది. కారణంగా పశ్చిమ ప్రాంత ప్రసార మాధ్యమాల దృష్టి ఇప్పుడు పాకిస్తాన్‌లోని తాలిబాన్లపై పడింది. పాకిస్తాన్‌లోని ఈ ప్రాంతంలో సుదీర్ఘకాలం పాటు అమెరికా పాత్రికేయులు ఇంకా మేధావులు పరిశోధన మరియు విచారణ నిమిత్తం సంచరిస్తూ వార్తలు వ్యాసాలు రాయడం మొదలుపెట్టారు. ఒసామా బిన్‌లాడెన్ హత్య తర్వాత మేధావులు, రచయితలు దాదాపు అందరూ ఈ ప్రాంతం విడిచిపోయారు. కాని స్వాత్ కొండల్లో నుంచి వెళ్ళిపోయే ముందు బ్రిటన్ ప్రసారమాధ్యమం అయిన బి.బి.సి. దృష్టిలోకి మలాలా యూసుఫ్‌జాయి వచ్చింది. బి.బి.సి. ఉర్దూ బ్లాగులో డైరీ రాసి ఆమె తాలిబాన్ల దృష్టిలో పడింది.

మలాలా తండ్రి జియావుద్దీన్ యూసుఫ్‌జాయి ధార్మిక చట్టాల పేరుతో తాలిబాన్ల ప్రదర్శిస్తున్న ఉన్మాదాన్ని వ్యవతిరేకించే వాడు. తండ్రి అభిప్రాయాన్ని మలాలా వెంటనే

గ్రహించింది. 2009లో ధార్మిక చట్టాలను అనుసరించి అమ్మాయిలు పాఠశాలలకు వెళ్ళకూడదనే తీర్పు వెలువడింది. తర్వాత తాలిబాన్లు డజన్ల కొద్ది అమ్మాయిల పాఠశాలలు బాంబులతో పేల్చేశారు. అయితే మలాలా తన తండ్రితో "అసలు మేం పాఠశాలకు వెళ్ళడం వారెలా ఆపగలరు? "చదువు మా హక్కు" కదా! అంది. కాని మిగతా పిల్లల అభిప్రాయం మేరకు ఆ సమయంలో జియాఉద్దీన్ కూడా మలాలాను పాఠశాలకు పంపడానికి నిరాకరించాడు. అప్పుడు 7వ తరగతి చదువుతున్న మలాలా ఉర్దూలో ఒక న్యాయసమ్మతమైన కవిత రాసింది. అది రావల్పిండిలోని ఒక పత్రిక ముద్రించింది కూడా.

మలాలా ఇచ్చిన నినాదం ప్రపంచం అంతా నాలుగు గోడల మధ్య నలిగిపోతున్న అమ్మాయిలకు అధికారం కోసం పోరాడే శక్తినిచ్చింది. అమ్మాయిల చదువు ఆగకూడదని తాలిబాన్ల క్రూరత్వాన్ని తాను అనుభవించింది. ఆమె పోరాటం వృధా కాదు. నేడు పాకిస్తాన్‌లోని ప్రతి అమ్మాయి మనస్సులో ఒక మలాలా గోచరిస్తుంది. పేదరికంతో పాటు తీవ్రవాదాన్ని కూడా సహిస్తూ పాకిస్తాన్ అమ్మాయిలంతా చదువుకోవడానికి సిద్ధమవుతున్నారు.

మలాలా చదువుతున్న పాఠశాలలో చదువుకుంటున్న సబా రియాజ్ కూడా ఆమె లాగా తయారవ్వాలని ఆకాంక్షిస్తోంది. తన కళ్ళలో ఒక విశ్వాసం కనిపిస్తుంది. తన మాటల్లో ఆవేశం ఉట్టిపడుతుంది. "మా పాఠశాలలను తాలిబాన్లు కూల్చేయడం బాధాకరం కాని, మలాలా మా అందరికి చదువు కోసం పోరాడే శక్తినిచ్చింది. ఇటువంటి దాడులతో మేము భయపడం. మేము మా చదువులు కొనసాగిస్తాం. మలాలా మాలో వెలిగించిన జ్వాలను ఎప్పుడూ ఆరిపోనీయం" అంటుంది.

# స్వాత్ నాది

ఇస్లామాబాద్ నుండి కేవలం 160 కి.మీ. దూరంలో ఉంటుంది... అత్యంత సుందరమైన స్వాత్ వ్యాలీ. దీన్ని "పాకిస్తాన్ స్విట్జర్లాండ్" అని కూడా అంటారు. ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని కాశ్మీర్‌తో పోలుస్తుంటారు. ఇది కేవలం 400 చదరపు మైళ్ళ పరిధిలో విస్తరించి ఉంటుంది. మంచుతో ముంచెత్తే పెద్ద పెద్ద కొండలు, గుట్టలు, పచ్చదనంతో నిండిన విశాలమైన భూభాగాలతో అలరారే స్వాత్ లోయకు జీవనాధారం స్వాత్ నది. దీని ప్రస్తావన ఋగ్వేదంలో కూడా చూడొచ్చు. ఇక్కడి సహజ సౌందర్యం, ప్రశాంతత, సుందరమైన వాతావరణం రాజుల నుండి భిక్షువులు వరకు అందరినీ సమంగా ఆకర్షించింది. బౌద్ధాన్ని ఆదరించిన సామ్రాట్ కనిష్క ఈ ప్రశాంతతను ఆహ్లాదకర వాతావరణాన్ని చూసి ముగ్ధుడై తన రాజధానిని పెషావర్ నుంచి స్వాత్‌కు మార్చుకున్నాడు.

స్వాత్ లోయలోని బౌద్ధచరిత్ర సమృద్ధమైనది. 10వ శతాబ్దం వరకు స్వాత్ కొండల్లో అత్యధిక జనాభా బౌద్ధ ధర్మాన్ని పాటించేవారు. అలాగే ఇక్కడి ప్రజలు అత్యంత శాంతి ప్రియులు. ఈ కొండ బౌద్ధ శిక్షణకు, సాధనకు ప్రముఖ కేంద్రంగా ఆవిర్భవించింది. బుద్ధ 'భగవానుడు' స్వయంగా ఇక్కడ సంచరించి స్వాత్ నివాసులకు తన ఉపదేశాలతో మేలు చేశాడని ఇక్కడి ప్రజలు నమ్ముతారు. బుద్ధుడి పాదముద్రలు నేడు కూడా స్వాత్ గ్రంథాలయంలో భద్రపరచి ఉన్నాయి. క్రీ.పూ. 326లో 'అలెగ్జాండర్ ద గ్రేట్' తన ప్రపంచ జైత్రయాత్రలో భాగంగా స్వాత్‌ను ఆక్రమించుకున్నాడు. ఆ తర్వాత సామ్రాట్ చంద్రగుప్త మౌర్య దీన్ని తన మౌర్య సామ్రాజ్యంలో కలుపుకున్నాడు.

స్వాత్ కొండ ప్రాచీన గాంధార సంస్కృతిలో ఒక భాగం. ఇక్కడి కళలు విశ్వవిఖ్యాతమైనవి. ప్రత్యేకంగా ఇక్కడి విగ్రహ సౌందర్యం సుదూర ప్రాంతాలలో ప్రసిద్ధి చెందింది. ఒకానొక సమయంలో ఈ కొండల్లో దాదాపు 1500 స్తూపాలు, బౌద్ధ ఆరామాలు స్థాపించబడ్డాయి. 1023లో మహ్మద్ ఘజనీ దాడిచేసి స్వాత్‌లోయ ఆఖరి బౌద్ధ రాజును

అంతమొందించాడు. మీర్ ఉవైస్ జయంగీర్ స్వాత్ కొండ చివరి రాజు. ఇతని రాజ్యం జలాలాబాద్ నుంచి జేలం వరకు విస్తరించి ఉంది. ఆ తర్వాత అక్కడి ఆఫ్ఘనీయులు విభిన్న వ్యక్తులు వంతుల వారీగా అధికారం నడిపించారు.

మొగలాయిలు తిరిగి ఇంకోసారి ఆక్రమించే ప్రయత్నం చేశారు. కాని వారి వశం కాలేదు. ఆ తర్వాత ఇక్కడ ఆంగ్లేయుల పాలన మొదలయ్యింది. 1940వ దశకంలో సూఫీ సాధువు అబ్దుల్ గఫూర్ నాయకత్వాన స్వాత్ స్థావరాలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఏకమయ్యాయి. కాని అంతిమంగా ఆంగ్లేయులు వారిని ఓడించారు. అయినప్పటికీ 16వ శతాబ్దంలో యూసుఫ్‌జాయీ వంశీయులు మాలాఖండ్ – స్వాత్ కొండలు ఆక్రమణ చేశారు. యూసుఫ్‌జాయీ వంశీయులు వేరు వేరు ప్రాంతాలను తమ ఆధీనంలోకి తెచ్చుకోసాగారు. కాని కేంద్రీకృత అధికారాన్ని ఏర్పాటు చేయలేకపోయారు. ఒకవేళ స్థావరాల్లో గొడవలైతే అక్కడికక్కడే పరిష్కరించుకునేవారు. కాని బయటి నుంచి ఎదురయ్యే దాడులను ఎదుర్కోవడానికి స్థావరాలన్నీ ఒకటయ్యేవి. ఈ పద్ధతి 1915 వరకు అమలైంది. అప్పుడు స్థావరాలన్నీ కలిపి ఒక కేంద్రీకృత అధికార ప్రణాళికను ఏర్పాటు చేసుకుని స్వాత్ ప్రాంతాన్ని ఒక 'దేశం'గా రూపొందించుకున్నాయి. వారు అబ్దుల్ జాబర్‌ఖాన్‌ను తమ కేంద్రీయ నాయకుడుగా ఎన్నుకున్నారు. అతను రెండు సంవత్సరాలు మాత్రమే అధికారంలో ఉన్నాడు. ఆ తర్వాత మియాగుల్ అబ్దుల్ వదుల్ కేంద్ర నాయకుడయ్యాడు.

మియాగుల్ అబ్దుల్ ఆంగ్లేయులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో బ్రిటిష్ పాలకులు 1926 సం॥లో "వలీ–ఎ–స్వాత్" (స్వాత్ రాజు) బిరుదు ఇచ్చారు. స్వాత్ రాజు తన రాజ్య పరిపాలనా వ్యవస్థ అలాగే న్యాయ సంబద్ధ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాడు. తన రెండు విధాల న్యాయశాఖలను స్థాపించాడు. వాటికి వేరు వేరు కార్యాలయాలు ఏర్పాటు చేశాడు. అవి ధార్మిక విద్వాంసుల సమక్షంలో జరిగే "కాజీ అదాలత్" న్యాయాలయం (ధార్మిక న్యాయస్థానం), ప్రాంతీయ తహశీల్దారుల సమక్షంలో జరిగే న్యాయస్థానం (న్యాయనిర్ణేతల కార్యాలయం). 1947లో స్వాత్ పాకిస్తాన్‌లో భాగమైంది. కాని దీన్ని గుల్‌వహుద్ నాయకత్వంలో స్వపరిపాలన రాజ్యంగా చేశారు. స్వాత్ రాజ్యపరిపాలన విధానం ఏ విధంగానూ ధార్మిక పద్ధతుల ప్రకారం నడవలేదు. ఈ కారణంగా 1949లో కొంతమంది ముస్లిం నాయకులు ఇస్లామిక్ చట్టాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. కాని దాన్ని నిరాకరించారు.

స్వాత్ రాజ్యంలో ఉన్న డీర్, మాలాఖండ్ ఇంకా బాజోర్ ప్రాంతాలు 1960లో పాకిస్తాన్‌లో విలీనమయ్యాయి. అప్పటి స్వాత్ 1969లో నాశనం అయిన వెంటనే గుల్‌వహూద్ స్వయం పాలనలోని రాజ్య స్వరూపంలో ఉన్నా పాలన వ్యవస్థను పూర్తిగా మార్చేశారు.

బ్రిటిష్ పాలన అంతరించిన తర్వాత కూడా విడిగా ఉన్న ఈ మూడు ప్రాంతాలు డీర్, మాలాకండ్ ఇంకా బాజోరలలో స్థానికంగా "పాటా" కేంద్రంగా జిల్లా హోదాను ప్రకటించారు. పాకిస్తాన్‌లో పోలీసు రాజ్యాన్ని అమలుపరచి అక్కడి జిల్లా న్యాయస్థానాన్ని ఏర్పాటు చేశారు. కాని న్యాయపరమైన ప్రణాళికలు "జిర్గా" (సైనిక) పద్ధతిలోనే అమలు పరిచారు. 1992లో పాకిస్తాన్ న్యాయవాదులు ఒక నివేదిక తయారు చేసి సమర్పిస్తూ "జిర్గా ప్రణాళికను మేము అంగీకరిస్తున్నాము. దీంతో ఇస్లామిక్ చట్టాలను అమలుపరచాలి, న్యాయవాదులకు ఉపయోగంగా తోడ్పడాలి" అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తర్వాత "పాటా"లో ఉన్న చట్టాలు రద్దు చేయబడ్డాయి. కాని వీరనుకున్న చట్టాలను కూడా సరిగా అమలు చేయలేదు. దీంతో న్యాయవ్యవస్థ నిర్వీర్యమైంది. దీంతో ప్రజలు నిరాశ చెందారు. ఈ పరిస్థితికి వ్యతిరేకంగా మౌలానా సూఫీ మొహ్మద్ "తహెరీక్–ఎ–నిఫాజ్–షరియత్–ఎ–మొహ్మద్" (టి.ఎన్.ఎస్.ఎమ్) అనే సంస్థను స్థాపించాడు. సూఫీ మొహ్మద్ నవంబర్ 1994లో టి.ఎస్.ఎన్.ఎం. స్థాపించిన సమయంలోనే తాలిబాన్లు "కంధార్" ను ఆక్రమించుకున్నారు. కంధాఉమర్ మదర్సాలో ఉండే 50 మంది విద్యార్థులను తోడు తీసుకొని తాలిబాన్ ఆందోళనలు మొదలు పెట్టింది. కంధార్‌ను తాలిబాన్లు ఆక్రమించగానే పాకిస్తాన్ మదర్సాల్లో చదువుకుంటున్న వేల మంది విద్యార్థులు అఫ్ఘనిస్తాన్ వైపు తరలిపోయారు. తర్వాత కేవలం ఒక నెల లోపలే డిసెంబర్ 1994లో తాలిబాన్ ఆందోళనకారులు పన్నెండువేల మందితో సైన్యాలు పెరిగాయి.

దీని ప్రభావం పాకిస్తాన్‌లోని స్వాత్ కొండలపై పడింది. అక్కడ సూఫీ మొహ్మద్ అనుచరులైన టి.ఎన్.ఎస్.ఎం.లు ఆరు జిల్లాలను ఆక్రమించుకున్నారు. 1994లో ఉన్న అటువంటి పరిస్థితులను తమ గుప్పెట్లో వశపరుకోవడానికి స్వాత్‌తో సహా మాల్‌ఖండ్ డివిజన్ ఇంకా పాకిస్తాన్‌లో కాహిస్తాన్‌లో కూడా నిజామ్–ఎ–షరియత్ (నిజామియా చట్టాలు) అమలుకు తీసుకొచ్చారు. ఇవి దాదాపు 1992 ప్రాంతంలో ఉన్న చట్టాల్లాగే ఉన్నాయి. కాని కాజీ కోర్టులలో పేరుకు పోయిన అవినీతి కారణంగా పాకిస్తానీ ప్రభుత్వానికి వ్యతిరేకమైన ప్రజల ఆగ్రహం చల్లార లేదు. దాంతో టి.ఎన్.ఎస్.ఎం. ద్వారా ప్రస్తుత

చట్టాలను మార్చాలని ఇస్లామిక్ చట్టాలను అమలు చేయాలని ఆందోళనలు ఇంకా ఉధృతం చేశారు.

పెద్ద మనుషుల న్యాయాలయాల్లో పెరిగిపోతున్న దుర్మార్గాల వల్ల పాకిస్తాన్ ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం తగ్గలేదు.

ఈ మధ్యకాలంలోనే అమెరికాపై ఒసామా బిన్‌లాడెన్ చేసిన దాడులు పరిస్థితులను ఒక కొత్త మలుపు తిప్పాయి. అమెరికా వైపునుంచి ఆఫ్ఘనిస్తాన్‌పై దాడులు జరపడాన్ని పాకిస్తాన్ ప్రభుత్వం అనుమతించడంతో పర్వేజ్ ముషారఫ్‌కు వ్యతిరేకంగా జనాగ్రహం వ్యక్తమైంది. మౌలానా సూఫీ మొహ్మద్ వేలమంది యువకులను కలుపుకొని కాబూల్‌వైపు వెళ్ళిపోయాడు. ఆఫ్ఘనిస్తాన్ నుంచి తిరిగి వెళ్ళిపోతున్నపుడు పాకిస్తాన్ ప్రభుత్వం అరెస్టు చేసింది. మౌలానా అరెస్టు తర్వాత తన అల్లుడు మౌలవీ ఫజల్ ఉల్లాహ్ ఖాన్ ఆ బాధ్యతలు తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆయన మామ కంటే చాలా క్రూరులైన తీవ్రవాదులను “మౌలానా రేడియో” పేరుతో గుర్తిస్తారు. ఎందుకంటే తమ ఇస్లామిక్ అభివృద్ధి కోసం పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేడియో ద్వారా ప్రచారం చేయడం ఆరంభించారు. మౌలానా ఫజల్ ఉల్లాహ్ ఒత్తిడి అనునిత్యం పెరిగిపోతూ ఉండటంతో పాకిస్తానీ సైన్యం రాబోయే రోజుల్లో ఫజలుల్లాహ్ ముఠా సభ్యుల దాడులను ఎదుర్కోవాల్సి వచ్చింది.

తన జన్మభూమిని ప్రేమతో “నా స్వాత్” అని చెప్పుకునే మలాలా యూసుఫ్‌జాయి స్వాత్ గత కొన్ని సంవత్సరాలుగా భయం నీడలో బతుకుతోంది. పాకిస్తాన్ జాతీయ జెండా స్వాత్‌లో బాగానే రెపరెపలాడుతోంది. కాని అధికారం మాత్రం అక్కడ తాలిబాన్లది నడుస్తోంది. ఆదివాసి తీవ్రవాదులతో ప్రభావితమైన ఆ కొండల్లో జన జీవనం మాత్రం పైకి సర్వసామాన్యంగా కనిపిస్తుంది. కాని ఎప్పుడూ ఏదో దిగులు ఆవరించి ఉంటుంది.

2010లో ఖైబర్ ఫఖ్‌తూన్ ఖ్వాహ్ ప్రాంతంలోని మూడు జిల్లాల్లో స్వాత్ శాంగ్లా ఇంకా బురెన్‌లో పాకిస్తాన్ సైన్యం తాలిబాన్ విద్రోహులకు వ్యతిరేకంగా విస్తారమైన ప్రచారం చేసి తమ పరం చేసుకున్నారు.

కాని స్వాత్ కొండల్లో సైన్యాలుండటంతో అక్కడ ప్రశాంతత కోల్పోయిన వాతావరణం ఆవరించింది. ఎందుకంటే తాలిబాన్లే కాకుండా పట్టణ ప్రజలు కూడా నిత్యం సైన్యాల అధికార నిర్వాకంతో బలవుతున్నారు. తాలిబాన్ విద్రోహులైనా లేదా పాకిస్తాన్ సైన్యం అయినా తమ అధికారం నిలబెట్టుకోవడానికి ప్రజల్లో భయం రేకెత్తిన్నారు.

ఒకానొక సమయంలో ఆ ప్రాంతమంతా ప్రశాంతతతో పాటు పాకిస్తాన్ కంటే ఎన్నో రెట్లు అభివృద్ధి చెందింది. విద్యా, వైద్యం, రవాణా వ్యవస్థ, పర్యావరణం, న్యాయవ్యవస్థ వంటి అవసరాలపై ప్రత్యేకమైన శ్రద్ధ చూపించేవారు. పాకిస్తాన్ ప్రభుత్వం కల్పించుకోవడంతో ఆ వ్యవస్థ అంతా ఛిన్నాభిన్నమైపోయింది. ఇప్పుడు ఇక్కడి రోడ్లు, పాఠశాలలు, వైద్యాలయాలు భవనాలన్నీ కూలిపోయే స్థితికి వచ్చాయి.

మలాలా తాలిబాన్ల క్రూరత్వాన్ని ఎత్తి చూపుతూ తన డైరీలో రాసిన భావాలను బహిర్గతం చేసి ప్రశంసించదగిన పనిచేసింది. అయినప్పటికి ప్రపంచంలో గుర్తింపు వచ్చే విధంగా తన డైరీ ద్వారా చేసిన డిమాండ్... విద్య అందరికీ అందుబాటులోకి తేవాలన్నది.

అక్కడి మహిళల జీవనస్థితి సర్వసామాన్యంగా ఉంది. అందరిలాగే వారు కూడా వారి శరీరం పూర్తిగా కప్పి ఉండే విధంగా సల్వార్ కమీజ్, బుర్ఖా ధరిస్తారు. ఆహార పానియాల్లో వారు మొదటిగా మాంసాహారులుగాను, ధర్మాన్ని కాపాడటంలో పూర్తి విశ్వసనీయంగాను ఉంటారు. రంజాన్‌లోని రోజాకాని, మొహర్రం వంటి వేడుకలు కాని, ఇటువంటి వాటిపై నమ్మకం, విశ్వసనీయత అపారంగా ఉంటుంది. వారు పరపురుషుల ముందుకు రావడానికి, మాట్లాడటానికి నిరాకరిస్తారు. కాని జీవితంలోని ఎటువంటి సంఘటనలైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంటారు. మలాలా తల్లిదండ్రులు కూడా ధార్మిక విశ్వాసాలను గౌరవిస్తూ తమ కూతురు మలాలా బాగా చదువుకుని తమ సమాజాన్ని అభివృద్ధి చేసే యోగ్యతను పొందాలని ఆశిస్తారు.

# షైనింగ్ గర్ల్

**పా**కిస్తాన్ ప్రజలకు మలాలా అంటే సాహసానికి మారుపేరు. దాంతోపాటు తీవ్రవాదుల సమస్యను పరిష్కరించే విధంగా తాను చేసిన ఆందోళన ఫలించింది. ఇప్పుడు ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టాలి, అందుకు ఒక గొప్ప సంకల్పం అవసరం. జనం ఆందోళనను తిప్పికొట్టే ప్రయత్నంలో తాలిబాన్ తీవ్రవాదులు విఫలమయ్యారు. దాంతో ప్రజల ఆశలు ఫలించాయి. మలాలా తన పాఠశాల యూనిఫామ్‌పై ఉన్న నెత్తుటి మరకలను చూసి భయపడలేదు. అలాగే తాను ఆ యూనిఫామ్‌ను జాగ్రత్తగా పెట్టుకుంది. అయితే తనపై జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఆ గుర్తులు అలాగే శాశ్వతంగా ఉండాలని అనుకుంది.

తన యూనిఫామ్‌కి అంటుకున్న రక్తపుమరకలు, తన శ్వాస, ఆశ ఎప్పటి వరకు ఉంటాయో అప్పటి వరకు పోరాటం నడుస్తూనే ఉంటుంది. సంవత్సరాల నుంచి నిర్జీవంగా పడి ఉన్న పోరాటం మలాలా ఆకాంక్షల గుబాళింపుతో ఒక్కసారిగా జాగృతమైంది.

స్వాత్ కొండల నుంచి వాయవ్యంగా ఉన్న ప్రాంతం మధ్యన మూడు గంటల దూరంలో పర్వత భాగాన ఉన్న జిల్లా మింగోరా. ఆ సమయంలో అది సైన్యం ఆధీనంలో ఉంది. సైన్యం ఊరికి నలువైపుల పహారా కాస్తూ ఉండేది. అలాగే సైనికులు ప్రజల జీవితాలను నియంత్రిస్తూ ఉండేవారు.

2007 నవంబర్‌లో సంగతి ఇది. పాకిస్తాన్‌లోని పెషావర్ డాన్ టెలివిజన్ కార్యాలయంలోని ఎడిటింగ్ ప్యానెల్ కంప్యూటర్ స్క్రీన్‌పై ఒక అమ్మాయి మెరిసే కన్నులతో కనిపించింది. బ్యూరో చీఫ్ పక్కగా వెళుతున్న ఒక రిపోర్టర్ సయ్యద్ ఇర్ఫాన్ అష్రఫ్ ఆ సన్నివేశాన్ని చూడటానికి ఆగిపోయాడు. దీన్ని రాత్రి ప్రసారం చేసే ఉర్దూ వార్తల కోసం ఆంగ్లం నుండి అనువదించారు. అప్పుడే ఒక అమ్మాయి పెద్దగా మాట్లాడటం వినిపించింది. “నాకు చాలా భయంగా ఉంది” ఆమె వణుకుతున్న గొంతుతో అన్నది. “గతంలో స్వాత్ కొండల్లో చాలా శాంతియుతమైన పరిస్థితి ఉండేది. కాని ఇప్పుడు చాలా మార్పులు

జరిగాయి. ఈనాడు నా స్వాత్‌లో బాంబు దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. మాకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. మా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు, మిత్రులు అందరూ భయాందోళనకు గురవుతున్నారు. మేము పాఠశాలలకు వెళ్ళలేక పోతున్నాము" అంటూ ఉర్దూలో చెబుతుంది. ఆ మాటలు ఒక గ్రామీణ అమ్మాయి మాటల వలే ఉన్నాయి.

"ఈ అమ్మాయి ఎవరు? అష్రఫ్ బ్యూరో చీఫ్‌ను అడిగాడు. పస్తో అనే స్థానిక వాడుక భాషలో అతను జవాబు చెప్పాడు. "తాక్రా జనాయి" అంటే ఒక అందమైన బాలిక – ఏ షైనింగ్ యంగ్ గర్ల్. ఇది విన్న అష్రఫ్ ఆశ్చర్యంగా ఆమెను చూస్తూ "బహుశా ఈమె నాకు తెలిసి మలాలా కావచ్చు" అనుకున్నాడు.

వాస్తవానికి ఆ రోజు ఉదయాన్నే ఈ బ్యూరో చీఫ్ మింగోరాలో ఉన్న ఖుషాల్ పబ్లిక్ స్కూల్‌కి వెళ్ళాడు. దారిలో నల్ల రుమాలు ధరించిన తాలిబాన్ సైనికులు రోడ్డున పోయే కార్లను ఆపి డ్రైవర్‌లను బయటకు లాగి పడేస్తున్నారు. కార్లలో ధార్మిక చట్టాలకు వ్యతిరేకమైన డివిడి, మత్తుపదార్థాలేమైనా ఉంటాయేమోననే అనుమానంతో సోదా చేస్తున్నారు. హాజిబాబా రోడ్డుపైనున్న రెండంతస్తుల పాఠశాల భవనం అంత దూరం నుండే కనిపిస్తుంది. సిమెంట్‌తో నిర్మించిన గోడపై ఒక మూలలో "కుషాల్ పబ్లిక్ స్కూల్" అన్న ఎరుపు రంగు గుర్తు కూడా కనిపిస్తుంది. అక్కడ పాఠశాల పేరు యొక్క భావం అరబ్బీ భాషలో వ్రాసి ఉంది. "ఓ అల్లా నాకు మంచి జ్ఞానాన్ని ప్రసాదించు" అని. స్కూల్లో ఉన్న సర్ ఇజాక్ న్యూటన్ విగ్రహం కింద అమ్మాయిలు తమ స్కార్ఫ్‌లను తీసి బెంచీలపైన ఉంచుతున్నారు. ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ, గెంతుతూ ఉన్న ఆ అమ్మాయిల కిలకిలలతో పాఠశాల అంతా సందడిగా ఉంది.

కుషాల్ పబ్లిక్ స్కూల్ ఇంగ్లీష్ మీడియం అయినా కూడా స్థానిక భాషా, ఉర్దూ, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, గణితం మరియు ఇస్లామిక్ నేర్పిస్తారు.

బ్యూరో చీఫ్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న అమ్మాయిలను కలిశాడు. అతను అమ్మాయిలను ప్రశ్నిస్తూ "పాఠశాలలను నాశనం చేస్తున్న తాలిబాన్ల గురించి ఎవరైన అమ్మాయి టి.వి.లో ఇంటర్వ్యూ ఇవ్వాలనుకుంటుందా?" అప్పుడు తను అనుకున్న దానికంటే ఎన్నో ఎక్కువ చేతులు పైకి లేచాయి. బ్యూరో చీఫ్ ఇది చూసి ఆశ్చర్యపోయాడు. అమ్మాయిల ఆ ధైర్యం, ఉత్సాహం చూసి ఆయన నిశ్చేస్టుడైపోయాడు. ప్రజల ముందు లేదా బహిరంగంగా అమ్మాయిలు అలా చెప్పడం అంత సామాన్యమైనది కాదు. అందుకని అతని ఆశ్చర్యం సాధారణమే. వారిలో ఏ అమ్మాయితో మాట్లాడాలో బ్యూరో చీఫ్‌కు అర్థం కాలేదు. కాని ఆ అమ్మాయిలు అందరూ, అలాగే స్కూల్ ప్రిన్సిపాల్ కూడా ఆయన పని సులభతరం చేశారు. తెల్లని మెరిసే కన్నుల అమ్మాయితో అప్పుడు చేసిన ఆ ఇంటర్వ్యూ ఆ రాత్రి టివిలో వార్తగా మారింది.

ఆ తర్వాత రోజు బ్యూరో చీఫ్ పాఠశాల యజమాని జియావుద్దీన్ యూసుఫ్‌జాయిని కలిశాడు. ఆ అమ్మాయి గురించి మాట్లాడుతూ ఆమె నిర్భయాన్ని మనస్ఫూర్తిగా మెచ్చుకున్నాడు. అది చూసిన జియావుద్దీన్ చిరునవ్వు నవ్వాడు.

బ్యూరో చీఫ్ ఆయన చిరునవ్వు చూసి దానికి కారణం అడిగినపుడు ఆయన గర్విస్తూ "ఆమె నా కూతురు మలాలా" అని చెప్పాడు. ఇది విన్న చీఫ్ బ్యూరో కూడా చిరునవ్వు నవ్వాడు. విద్యావంతుడైన జియావుద్దీన్ పాకిస్తాన్‌లో ఉన్న ఛాందసులైన గ్రామీణ సమాజంలో భాగమైన వారిని, కరాచీ లాహోర్‌లకి సంబంధించిన ఉప కులాలని భావించటానికి సిద్ధంగా లేదు. అందుకని వారి కుటుంబాల గురించి జాతీయ ఛానల్లో ఒక్క క్షణం చూపించడం, అందులో తన కూతురు ఉండటం చాలా గొప్ప విషయం అని అతనికి తెలుసు.

రిపోర్టర్ సయ్యద్ ఇర్ఫాన్ అష్రఫ్ చాలా రోజుల వరకు టి.వి. స్క్రీన్ మీద చూపించిన మలాలా రూపాన్ని మరవలేకపోయాడు. అతను బ్యూరోచీఫ్‌తో "ఆమె ఒక సాధారణమైన అమ్మాయి, కాని స్క్రీన్ మీద అసాధారణమైన అమ్మాయిలా కనిపిస్తుంది" అన్నాడు.

కేవలం స్క్రీన్ మీదనే కాదు మలాలా వాస్తవ జీవితంలో కూడా అసాధారణమైన అమ్మాయి అని నిరూపించింది. అందుకే నేడు ఈ గొప్ప అమ్మాయి ప్రపంచమంతా పరిచయమయ్యింది. ఆమె తన గురించి ఇంకా తన వంటి అమ్మాయిల హక్కుల కోసం తన ప్రాణాలు అర్పించడానికైన లెక్కచేయలేదు.

టి.వి. స్క్రీన్ పైన కనిపించిన తరువాత మలాలా తన పాఠశాలలోను, నివాస ప్రాంతంలోను అందరికి మరింత దగ్గరయ్యింది. దాంతో పాటు ఒక విశిష్ట వ్యక్తిగా ఆమెను పరిగణిస్తున్నారు. వాస్తవానికి ఒక అమ్మాయి టి.వి.లో రావడమే గొప్ప విషయం. కాని మలాలా భావాలలో ఈ ప్రత్యేక గుర్తింపు ఎటువంటి గర్వాన్ని తీసుకురాలేదు. కాని ఆమె తన వంటి అమ్మాయిల హక్కుల కోసం గట్టి ప్రయత్నంలో లీనమయ్యింది. తన ప్రయత్నానికి మద్దతు కోసం ఎదురు చూస్తుంది. స్వాత్ కొండల్లో రాబోయే కాలంలో జరగబోయే హింసలో గాయపడిన వారిని, చనిపోయిన వారిని చూస్తే ఎలా ఉంటుందో మలాలా ఈ చిన్న వయసులోనే గ్రహించింది. అందుకే ఇటువంటి పరిస్థితులను ఎలా మార్చాలి, తన తండ్రి కోరుతున్నట్లు స్వాత్ కొండల్లో మార్పు తీసుకురావటం తన జీవితంలో ఒక లక్ష్యంగా పెట్టుకుంది.

# భయం గుప్పిట

**చా**లా భయంకరమైన రోజులవి. డిసెంబర్ నెల నలువైపుల నుంచి కొరికేసే చలిలో పొగ కమ్మి ఉండేది. జనం ఇండ్లల్లో ముడుచుకొని ఉండేవారు. అది 2008వ సంవత్సరం. వేకువ సమయం. జనం రోజువారీ పనులతో ఇళ్లనుంచి బయటకు వచ్చారు. అంతటా ఒక్కసారిగా కోలాహలం వ్యాపించింది. ఏదో గలాటా కావచ్చు. అనుకోకుండా స్కైలాబ్ విరిగిపడినట్లైంది. నలువైపుల అరుపులు, హాహాకారాలు వ్యాపించాయి. ఏమీ అర్థం కాకుండా జనం ఎటుబడితే అటు పరుగులు తీస్తున్నారు. ఆకాశంలో తిరుగుతున్న హెలికాప్టర్లో శక్తివంతమైన ఉరుములు ఉరుముతున్నాయి.భూమిపై ట్యాంకుల వల పరచినట్లయింది.

హెలికాప్టర్, ట్యాంకులు మింగోరాను చుట్టుముట్టాయి. సైన్యం సర్వశక్తులతో తీవ్రవాదులను వెళ్ళగొట్టడానికి సిద్ధమైంది. అయినా విఫలమైంది. నలుదిక్కులా హాహాకారాలు నిండిపోయాయి. ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నంలో నగరమంతా నిర్జనమైంది. మలాలా ఈ సన్నివేశం అంతా స్వయంగా తన కళ్ళతో చూసింది. అప్పుడు ఆమె వయసు కేవలం 12 సంవత్సరాలు. కొండపై కమ్ముకున్న భయంకరమైన కష్టాలు ఆమెకు కొత్తగా ఏమీ అనిపించలేదు. ఎందుకంటే తాలిబాన్ల క్రూరత్వ దృశ్యాలు ఆమె చాలాసార్లు చూసింది.

జనం స్వాత్ విడిచి పోతున్నారు. అప్పటికే చాలామంది వెళ్ళిపోయారు కూడా.

మలాలా మనసులో ఎన్నో ఆలోచనలు సంఘర్షిస్తున్నాయి. అసలు తన స్వాత్‌లో ఇలా ఎందుకు జరుగుతోంది? అనుకుంటుంది.

తర్వాత ఆమె ఈ పరిస్థితుల గురించి రాస్తూ "ధనవంతులైతే స్వాత్ విడిచి వెళ్ళిపోయారు. కాని పేదలు అక్కడే ఉండాలి తప్ప ఇంకే అవకాశం లేదు. తనకు

శుక్రవారం అంటే భయమయ్యేది. ఎందుకుంటే ఆ రోజు ప్రాణాలు తీసుకుంటే గొప్ప ప్రాముఖ్యత ఉంటుందనే మూఢ విశ్వాసంతో ఆత్మాహుతి దళాలు దాడులు చేసేవారు.”

కాలం గడుస్తున్న కొద్దీ భయం పెరిగిపోతూ ఉంది. కొత్త సంవత్సరం తలుపులు తడుతూ ఉంది. కాని తనతోపాటు సుఖసంతోషాల శుభవార్త తీసుకురావడంలో నిరర్ధకమైంది. శబానా అనే నర్తకిని తీవ్రవాదులు హత్యచేసి ఆమె శరీరాన్ని గ్రీన్‌స్క్వేర్ రోడ్డుపై పడేశారు. వారిని ఆజ్ఞ ఉల్లంఘిస్తే ఏ గతి పడుతుందో చూపించారు. భయం ఎల్లలు దాటిపోయింది. మింగోరాలో గ్రీన్‌స్క్వేర్‌కి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ అనేకమైన దుకాణాలు, సంత ఉంటుంది. జనసందోహంగా ఉండే ఈ ప్రాంతంలోనే తాలిబాన్లు శవాలను వేలాడదీస్తారు. దాంతో ఇదిప్పుడు “ఖూనీ చౌక్”గా ప్రత్యేకత పొందింది.

మలాలా ఇదంతా స్వయంగా తన కళ్ళతో చూసింది. కాని భయపడలేదు. “వారు నన్ను ఆపలేరు. నేను నా ప్రాథమిక విద్య పూర్తి చేసి తీరతాను. ఇంట్లో అయినా, పాఠశాలలో అయినా లేదా ఇంకెక్కడైనా సరే నా చదువు నేనెందుకు చదవకూడదు? మా పాఠశాలలను కాపాడాలని నేను అన్ని దేశాలకు విజ్ఞప్తి చేస్తున్నాను. తాలిబానీ దాడులతో 150 కంటే ఎక్కువ పాఠశాలలు నాశనం అయ్యాయి. మా సమాజాన్ని రక్షించండి. మా పాకిస్తాన్‌ను రక్షించండి. మా స్వాత్‌ను రక్షించండి... అంటూ మలాలా పాకిస్తాన్ టివిలో నినదించింది.

ఒకరోజు పాఠశాలలో కూడా అమ్మాయిల మధ్య మలాలా చాలా ఉద్వేగభరితమైన ఉపన్యాసం చేసింది. ఆమె “ మేమంతా ప్రాణాలైనా అర్పిస్తాం కాని చదువులు మానేయం” అంటూ అమ్మాయిలందరితో ప్రమాణం చేయించింది.

స్వాత్‌లో నిత్యం బాంబు పేలుళ్ళ ధ్వని వినిపిస్తుంటుంది. రోజుల తరబడి ఇళ్లకు విద్యుత్తు నిలిపేస్తారు. ఆ తర్వాత మెల్లమెల్లగా తాలిబాన్ల ఉనికి స్పష్టమవుతోంది. వారు విస్తరిస్తున్నట్లు అర్థమవుతోంది. అంతిమంగా మింగోరాతో సహా స్వాత్ కొండలన్నీ వారు ఆక్రమించుకున్నారు.

ఇస్లామాబాద్‌లోని లాల్‌మజీద్ ఖండ్‌హెూర్‌కి తరలించారు. అప్పుడు ప్రభుత్వం సైన్యాన్ని పంపిస్తే తాలిబాన్ల నాయకుడు ఫజలుల్లాహ్ స్వాత్‌లో యుద్ధానికి పిలుపునిచ్చాడు. రాత్రి పూట ఎవరూ లేని సమయంలో పాఠశాలల్లో బాంబులు పేల్చేవారు.

జనవరి 15, 2009న స్వాత్‌లోని అమ్మాయిల పాఠశాలలన్నీ మూసివేయాలని తాలిబాన్లు ఆదేశాలు జారీచేశారు. మలాలా పాఠశాల మూతపడింది. అప్పుడు ఆమె "తాలిబాన్లు చదువుకోవడాన్ని ఎలా ఆపగలరు?" అనుకుంది.

కాని తాలిబాన్లు మాత్రం మహిళలు చదువుకోవడానికి వ్యతిరేకంగా "జిహాద్" (ధార్మిక యుద్ధం)ను రెచ్చగొట్టారు. పాఠశాలలకు నష్టం చేకూర్చడంతోపాటు వారు అనేక మంది ఉపాధ్యాయులను కూడా శాశ్వత నిద్రలోకి పంపించారు. బాలికా విద్యాలయాల్లో వారు హెచ్చరికల కరపత్రాలు పంపిణీ చేశారు. ముఖ్యమైన జనసందోహాల్లో, సంతలలో "అమ్మాయి చదువుకోవడానికి వెళ్ళొద్దు. వెళితే తీవ్ర పరిణామాలకు గురవుతారు" అంటూ ప్రకటనలు జారీ చేశారు.

పెషావర్‌కి దగ్గరలో ఉన్న డేరా ఆదమ్‌ఖోర్ బాలికా విద్యాలయంలోని నోటీస్ బోర్డుపై 'బాంబులు పేలుస్తామని' ప్రకటన అంటించారు. అమ్మాయిలు ఫ్యాషన్‌కి దూరంగా ఉండాలి. ధగ ధగ మెరిసే బట్టలు ధరించకుండా సాధారణమైన వస్త్రాలు, పై నుంచి బుర్ఖా తప్పకుండా ధరించాలి. శరీరమంతా కనిపించకుండా పూర్తిగా కప్పి ఉండాలి అని ఆ ప్రకటనలో ఆదేశించారు.

ఆఫ్ఘనిస్తాన్ పరిసర ప్రాంతాల్లో తెరిచి ఉన్న బాలికా విద్యాలయాలు, 180 కమ్యూనిటీ పాఠశాలలను తీవ్రవాదులు పూర్తిగా మూసివేయించారు. ఆంగ్ల మాధ్యమం ఉన్న అనేక ప్రభుత్వ పాఠశాలలు, పబ్లిక్ స్కూళ్ళు కూడా 'అవి పశ్చిమ దేశాల సభ్యత నూరిపోస్తాయి' అనే సాకుతో మూసివేయించారు.

నూతన సంవత్సరం వచ్చేసింది. దాంతో పాటే జనం స్వాత్ విడిచి వెళ్ళిపోవడం కూడా మొదలయ్యింది. జియావుద్దీన్‌కి స్వాత్‌ను వదిలిపెట్టాలనే కాంక్షలేదు. అయితే బంధు మిత్రులు చుట్టుప్రక్కల వారు నచ్చజెప్పే ప్రయత్నంలో 'ఇప్పుడు పట్టుదల లేదా వ్యతిరేకత చూపించే సమయంకాదు. బ్రతికి ఉంటే తీవ్రవాదులకు వ్యతిరేకంగా పోరాడవచ్చు' అని నచ్చజెప్పడంతో మలాలా తన తల్లిదండ్రి, ఇద్దరు సోదరులతో ఇస్లామాబాద్ వెళ్ళిపోయింది. కాని 'నా స్వాత్' అంటుండే మలాలా స్వాత్ కొండల్లోని ఎగుడు దిగుడుగా ఉన్న దారిని, నిత్యం చల్లదనంతో పచ్చపచ్చగా ఉండే స్వాత్‌ని మరవలేకపోయింది.

ఇస్లామాబాద్ గురించి ఆమె మాట్లాడుతూ..

'నేను మొదటిసారిగా ఈ నగరానికి వచ్చాను. ఇది చాలా అందంగా ఉంది. ఇక్కడ పెద్ద పెద్ద భవనాలు ఉన్నాయి. వెడల్పాటి రోడ్లున్నాయి. కాని స్వాత్ కొండలతో పోలిస్తే అక్కడి ప్రాకృతిక సౌందర్యం లేదు' అంది.

కొన్ని రోజులు ఇస్లామాబాద్‌లో గడిపిన తర్వాత వారు తమ బంధువుల దగ్గరకు పెషావర్‌కు వెళ్ళారు. ఒకరోజు మలాలా తన ఐదు సంవత్సరాల తమ్ముడు తోటలో ఆడుకుంటూ మట్టి తవ్వడం గమనించింది. తన బట్టలన్నీ మాసిపోయాయి. అసలు తన తమ్ముడు మట్టి ఎందుకు తవ్వుతున్నాడోనని అనుమానించింది. ఆమె దగ్గరకెళ్ళి తమ్ముడు మట్టి తవ్వుతున్న కారణం తెలుసుకోవాలనుకుంది. అయితే అప్పుడే తమ తండ్రి వచ్చాడు. ఇంకా మందలిస్తూ 'మీరిక్కడేం చేస్తున్నారు'? అనడిగాడు.

అప్పుడు మలాలా తమ్ముడు అమాయకంగా 'నేను గొయ్యి తవ్వుతున్నాను ఇందులో తాలిబాన్ తీవ్రవాదులను పూడ్చేస్తాను' అన్నాడు. ఇది విన్న జియావుద్దీన్ మలాలా ఇద్దరూ కోప్పడ్డారు. మలాలాకు అమాయకంగా ఉండే తన చిన్న తమ్ముళ్ళపై యుద్ధం ఎంతటి తీవ్ర ప్రభావం చూపించిందో అర్థమైంది.

మార్చి 2009 నాటికి మింగోరా ఏదో పాడుబడ్డ నగరంగా మారిపోయింది. తాలిబాన్లు రాజధాని నుండి 100 కి.మీ. దూరంలో ఉన్న బునేర్ వరకు విస్తరించారు. పాకిస్తాన్ ప్రభుత్వం తన సైన్యాన్ని, పోలీసులను పంపి తాలిబాన్లను వెళ్ళగొట్టాలనుకుంది. కాని తాలిబాన్లు నీరుగారిపోవడానికి బదులు రోజు రోజుకి ఇంకా బలపడ్డారు.

అప్పటికే తాలిబాన్లు ఆఫ్ఘనిస్తాన్ మరియు వజీరిస్తాన్ ప్రాంతాల్లోని వందల కొలది పాఠశాలలు, విద్యాసంస్థలను సంపూర్ణంగా నాశనం చేసేశారు. సాయుధులైన ఆ దుండగులు పాఠశాల విద్యా ఇస్లామేతరులది అని భావించేవారు.

14 ఏప్రిల్, 2009న పాకిస్తాన్ అధ్యక్ష పదవిలో అసిఫ్ అలీ జర్దారీ ఉన్నాడు. తాలిబాన్లు స్వాత్ ఒప్పందాన్ని నీరుగార్చారు. ఇది ఇస్లామీయులకు వ్యతిరేకం అని పాకిస్తాన్ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. అప్పుడు భారత్ ఇంకా అమెరికాతో సహా ప్రపంచంలోని అనేక దేశాలు వారి ఆగడాలను వ్యతిరేకించాయి.

ఎన్నో రోజులు జియావుద్దీన్ స్వాత్ కొండల్ని విడిచి ఉండలేదు. తిరిగి స్వాత్‌కి వచ్చేశాడు. మలాలా చాలా సంతోషపడింది. కాని స్వాత్ పరిస్థితి చూసి

అవాక్కయిపోయింది. తన తండ్రితో మాట్లాడుతూ "నా స్వాత్‌కి ఎవరి దిష్టి తగిలిందో? ఇది ఎంత నిర్జీవంగా వెలితిగా మారిపోయింది! ప్రజల ముఖాల్లో భయం కనబడుతోంది. వారి చిరునవ్వులు ఎక్కడకు ఎగిరిపోయాయి నాన్నా? తాలిబాన్లు నా స్వాత్ ప్రజల నవ్వులు దోచుకున్నారు. నాన్నా చెప్పండి నాన్నా, వారి ముఖాల్లో మళ్లీ నవ్వులు కనిపడాలంటే మనం ఏం చేయాలి, నాన్నా? " అన్నది.

మలాలా ప్రశ్నలకు అతని వద్ద సమాధానం లేదు. అయినా జియావుద్దీన్ ఏం చెప్తాడు? అతడి రక్తం కూడా మసలుతోంది. అమ్మాయిల పాఠశాలలు ఇప్పటికీ మూతపడే ఉన్నాయి. రోడ్లు ఉద్రిక్తంగా మారాయి. ప్రతిదీ ఏదో తెలియని భయానకం ఆవరించి ఉండేది. మలాలా, ఆమె సోదరులు రోజంతా ఇంట్లోనే ఆడుకునేవారు. లేదా చదువుకునేవారు. 'మేము బాగా ఆడుకునేవాళ్ళం. ఇంకా మా మధ్య గొడవలు కొట్లాటలు కూడా అయ్యేవి. కాని వెంటనే అందరం కలిసిపోయేవాళ్ళం. ఆ తర్వాత కంప్యూటర్ గేమ్స్ బాగా ఆడుకునేవాళ్ళం. ఇప్పుడా సంతోషాలు ఆమడ దూరం వెళ్ళాయి' అని చెప్పుకొంటూ వాపోతుంది మలాలా.

మలాలా తన తమ్ముళ్ళతో ఆడుకుంటూ ఎలాగైనా తన మనసును కుదుట పర్చాలని ప్రయత్నం చేస్తుంది. కాని తనలో ఉన్న జ్వాల మాత్రం ఎప్పుడూ భగభగ మండుతూనే ఉంది. పుస్తకాలు చేతుల్లో పట్టుకున్నప్పుడల్లా వాటిలో రాసి ఉన్న అక్షరాలను చదువుతున్న ప్రతి క్షణం తనకు ఒకటే గుర్తుకొస్తుంది. చదువుకోవడం తన హక్కు. అసలు తాలిబాన్లు దాన్ని ఎలా లాక్కుంటారు? నిత్యం తన తండ్రిని ప్రశ్నిస్తూంటుంది. 'మాకు ఎవరూ మద్దతు ఇవ్వలేక పోతున్నారెందుకు? మేము చదువుకోవడం ఎందుకు ఆపేస్తున్నారు' అనుకునేది.

# డైరీలో రాసిన నిజాలు

**త**న మనసులో ఎప్పుడు ప్రశాంతత నెలకొంటుందా అని మలాలా ఎదురు చూస్తున్నప్పుడు తమకు మద్దతిచ్చేవారు ఎవరూ కనిపించలేదు. తర్వాత ఆమె స్వయంగా ప్రయత్నం చేయడం ఆరంభించింది. చదువు కొనసాగించాల్సిందిగా ఆమె సాటి అమ్మాయిలకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ అమ్మాయిలను కలిసి తమ హక్కుల విషయంలో వారిలో చైతన్యం కలిగించడానికి ప్రయత్నించింది. మెల్లగా అందరిలో చర్చ మొదలైంది.

బి.బి.సి. సంపాదకులు ఎవరైనా ఒక విద్యార్థిని తాలిబాన్ల రాజ్యం, తీవ్రవాదం గురించి రాస్తుందేమోనని, అలాగే కొండలపై ఉన్న పరిస్థితులను ప్రపంచం ముందుపెడుతుందేమోనని సుదీర్ఘకాలంగా వెతుకుతున్నారు. ఎంతోమంది అమ్మాయిలు రాయటానికి సిద్ధమయ్యారు. కాని ప్రాణాలతో వ్యాపారం చేసే తాలిబాన్ల హెచ్చరికలకు భయపడి వారు వెనక్కి తగ్గారు. అందుకు వారు వారి నోటిని కట్టిపెట్టుకోవడం అనివార్యమైనది.

ప్రపంచంపై ఉన్న ప్రేమ మరియు తాలిబాన్లపై ఉన్న వ్యతిరేకత నిండిన ప్రకటనలు ఇస్తున్న మలాలా ఆచూకి తెలుసుకున్న బీబీసీ ఉర్దూ శాఖను జియావుద్దీన్ యూసుఫ్‌జాయి సంప్రదించాడు. బి.బి.సి. సంపాదకుడితో మాట్లాడుతూ 'మీరు మా అమ్మాయితో బ్లాగ్ రాయిస్తారా? ఆమె చిన్నపిల్ల అయినా బ్లాగ్ రాయగలుగుతుంది' అన్నాడు.

మలాలా జీవితంలో ఒక కొత్త అధ్యాయం తిరిగి మొదలయ్యింది. ఒక కొత్త గుర్తింపు వచ్చింది. తన నిజమైన గుర్తింపును దాచిపెట్టుకోవటానికి "గుల్‌మకాయి" (మొక్కజొన్న పువ్వు) అనే పేరు ఉపయోగించుకుంది.

మలాలాకి గుల్‌మకాయి అనే మారుపేరు బి.బి.సి. ఉర్దూ సర్వీస్ మాజీ పాత్రికేయుడు అబ్దుల్ హెూయీకక్కడ్ ఇచ్చాడు. అతడు స్వాత్‌లోని అసాధారణ

పరిస్థితులను ప్రపంచానికి వెల్లడించాలనుకున్నాడు. దాంతో జనం మలాలా డైరీని ఒక మంచి పాత్రికేయ దర్పణంలో చూస్తారు. తాలిబాన్ల పెత్తనాన్ని, ప్రజల కష్టాలను మానవీయ కోణంలో వెల్లడించేలా ఆ డైరీని ప్రసారం చేయాలనుకున్నాడు.

ఆ వయస్సులో పిల్లలు హోంవర్క్ చేయటానికి కూడా వెనకాడతారు. అదే వయసులో పాఠశాలకు వెళ్ళలేకపోతున్నామనే నిస్సహాయతతో మలాలా తన డైరీ రాసింది. మలాలా డైరీ స్వాత్ కొండల్లోని మనుషులు, ప్రదేశాలు, ఇంకా అక్కడ ఉండే పిల్లల దైన్యాన్ని వెల్లడించే ఉత్తమ సమాచారం అవుతుంది. 3 జనవరి, 2009 నుంచి 12 మార్చి, 2009 వరకు ప్రసారమైన మలాలా డైరీ భాగాలను చదువుతుంటే ఆమె రాసిన పద్ధతి చమత్కారంగా అనిపించకపోవచ్చు. కాని అందులో ఆ అమ్మాయి ధైర్యం మెచ్చుకోదగ్గదిగా ఉంది. ఆ రచన రాజకీయాలకు అతీతంగా ఉంది. అందులో ఆమె అత్యధికంగా తన పాఠశాల, చదువు, ఇల్లు ఇంకా స్నేహితుల గురించి రాస్తూ తాలిబాన్లకు సూటిగా సవాలు విసిరింది. బి.బి.సి. ద్వారా ఆ డైరీ వెలుగు చూసిన తర్వాత పశ్చిమ దేశాల ప్రసార మధ్యమాల్లో మలాలా '19వ శతాబ్దపు మలాలాయి'గా చర్చనీయాంశం అయ్యింది.

జియావుద్దీన్ ప్రతీరోజు శవాలు దర్శనమిచ్చే ప్రాంతంలో తన కుమార్తె తనను తాను తీర్చిదిద్దుకునే విధంగా అవకాశాలు కల్పించాడు. స్వాత్ ప్రాంతంలో ఏ ఒక్క అమ్మాయి స్వరం కూడా వినిపించని ఆ సమయంలో మలాలా కేవలం డైరీ రాయడం మాత్రమే కాకుండా కుటిల నీతిజ్ఞులకు సవాల్ విసురుతూ, టెలివిజన్‌లోనూ తన సహవిద్యార్థినుల ముందూ బహిరంగంగా మాట్లాడింది. కాని తాలిబాన్ల హెచ్చరికలకు భయపడలేదు.

మలాలా డైరీ తనను యావత్ ఇస్లామిక్ జగత్తులోనే ప్రత్యేక చర్చనీయాంశం చేసింది. తాలిబాన్ల స్థావరం అయిన స్వాత్‌లో ఒక చిన్న అమ్మాయి తీవ్రవాదులకు ఎలా సవాలు విసరగలుగుతోంది? అన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోలేకపోతున్నారు. తనకు తెలుసు ఎప్పటికైనా తాలిబాన్లు తనను ఎత్తుకెళ్ళి తూటాలతో పేల్చేస్తారు లేదా తన శరీరంపై యాసిడ్ పోస్తారని. కాని "నేను మలాలా యూసుఫ్‌జాయిని, నా స్వాత్ కోసం తుది శ్వాస వరకు పోరాడుతాను" అంటుందామె.

# ఇవీ డైరీ పుటలు

**3 జనవరి, 2009**

నిన్న రాత్రి నేను ఎంత భయంకరమైన కలగన్నానంటే అందులో హెలికాప్టర్‌లో ప్రభుత్వ సైన్యాలు, ఇంకా తాలిబానీ తీవ్రవాదులు కనిపించారు. స్వాత్‌లో సైన్యాల ఆపరేషన్ మొదలైన తర్వాత ఇటువంటి కలలు నిత్యం వస్తూనే ఉన్నాయి. అమ్మ అల్పాహారం పెట్టింది. తర్వాత నేను తయారయ్యి పాఠశాలకెళ్ళడానికి బయలుదేరాను. నాకు పాఠశాలకు వెళ్తున్న సమయంలో చాలా భయం అనిపించింది. ఎందుకంటే అమ్మాయిలు స్కూల్‌కి వెళ్ళకూడదని తాలిబాన్లు ప్రకటించారు. ఈ రోజు మా తరగతిలో 27మందిలో కేవలం 11మంది అమ్మాయిలు మాత్రమే హాజరయ్యారు. తాలిబాన్ల ప్రకటనకు భయపడిన నా ముగ్గురు స్నేహితురాళ్ళు పాఠశాల మానివేసి తమ కుటుంబ సభ్యులతో పెషావర్, లాహెూర్, రావల్‌పిండి ప్రాంతాలకు వెళ్ళిపోయారు.

1.40కి పాఠశాల ముగిసింది. ఇంటికి వెళుతున్న సందర్భంలో నాకు ఒక భయంకరమైన  శబ్దం వినిపించింది. 'నేను నిన్ను వదలను' అంటూ వినిపిస్తుంది. నేను భయపడ్డాను. ఇంకా నడక వేగం పెంచాము. నేను వెనక్కు తిరిగి చూస్తే  ఆ దారిలో వస్తున్న ఎవరో ఫోన్‌లో అవతలి వారిని హెచ్చరిస్తున్నాడు.

**4 జనవరి, 2009**

ఈరోజు సెలవు. అందుకని నేను ఉదయం 10 గంటల వరకు నిద్రపోయాను. కాని లేవగానే నాన్న ఒక చెడువార్త వినిపించాడు. అది: ఇవ్వాళ కూడా గ్రీన్ చౌక్‌లో మూడు శవాలు దొరికాయి. ఆ ఘటనతో నా మనసు భయాందోళనలకు గురి అయ్యింది. అప్పటి వరకు స్వాత్‌లో పోలీసు చర్యలు మొదలవ్వలేదు. మా కుటుంబసభ్యులంతా ప్రతి ఆదివారం నాడు పిక్‌నిక్ కోసం మీర్‌గుజార్, ఫిజా–ఎ–ఘట్ ఇంకా కాజు వంటి ప్రాంతాలకు వెళ్ళేవాళ్ళము. ఈ రోజు పరిస్థితి ఎంతగా మారిపోయిందంటే ఏడదిన్నర నుంచి పిక్‌నిక్‌కి వెళ్ళలేకపోయాము.

మేము రాత్రి భోజనం తర్వాత సరదాగా బయటకి వెళుతున్నాము. కాని ఇప్పుడు ఈ పరిస్థితుల కారణంగా జనం సాయంత్రం కాకముందే ఇండ్లకు తిరిగి వస్తున్నారు. నేను ఈ రోజు ఇంటి పనులన్నీ చేశాను. హోంవర్క్ చేశాను. కొద్దిసేపు చిన్న తమ్ముడితో

ఆడుకున్నాను. రేపు పాఠశాలకు వెళ్ళాలి. ఈ ఆలోచనతో నా మనస్సు ఇప్పటి నుంచే వణికిపోతుంది.

## 5 జనవరి, 2009

నేను పాఠశాలకు వెళ్ళటానికి సిద్ధమవుతున్నాను. యూనిఫామ్ వేసుకోవాలనుకున్నాను. కాని ప్రిన్సిపాల్ మమ్మల్ని స్కూల్ యూనిఫామ్ వేసుకొని రావద్దని చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. తను మమ్మల్ని సాధారణ వస్త్రాలలో పాఠశాలకు రావాలని చెప్పింది. దాంతో నేను నాకు ఇష్టమైన గులాబీ రంగు దుస్తులు ధరించాను. పాఠశాలకు వచ్చే ఇతర అమ్మాయిలు కూడా రంగు రంగు దుస్తుల్లో ఉన్నారు. పాఠశాలలో ఇంటి వాతావరణం అలుముకుంది. నా స్నేహితురాలు నాతో “భగవంతునిపై ఒట్టేసి నిజంగా చెప్పు, మన పాఠశాలపై తాలిబాన్లు దాడి చేస్తారా?” అని అడిగింది.

## 7 జనవరి, 2009

నేను మొహర్రం సెలవులకు నా కుటుంబ సభ్యులతో బురైన్ జిల్లాకు వచ్చాను. నాకు ఇక్కడి కొండలు మరియు ఆకుపచ్చని పొలాలు బాగా నచ్చాయి. నా స్వాత్ కొండలు కూడా చెప్పలేనంత అందంగా ఉన్నాయి. కాని అక్కడ శాంతి లోపించింది. ఇక్కడ బురైన్‌లో మాత్రం ప్రశాంతంగా అలాగే సుఖంగానూ ఉంది. ఇక్కడ తుపాకులు పేల్చడంకాని, ఏ ఇతర భయం కానీ లేదు. మేమందరం ఇక్కడ చాలా సంతోషంగా ఉన్నాం.

ఈ రోజు మేము పీర్‌బాబా సమాధి వద్దకు వెళ్ళాము. అక్కడ చాలా మంది ఉన్నారు. వీరంతా ప్రార్థన చేయడానికి వచ్చారు. మేము మాత్రం తిరగడానికి వచ్చాం. దుకాణాలల్లో గాజులు, చెవిదిద్దులు, హారాలు ఇతర వస్తువులన్నీ నకిలీ ఆభరణాలు అమ్ముడుబోతున్నాయి. నేను కూడా ఏమైనా కొనుక్కోవాలనుకున్నాను. కాని ఏమీ నచ్చలేదు. అయితే మా అమ్మ గాజులు, చెవిదిద్దులు కొన్నది.

## 9 జనవరి, 2009

ఈ రోజు నేను నా స్నేహితులకు బురైన్ గురించి చెప్పాను. ఇంకా ఎఫ్.ఎం. ఛానల్‌లో మాట్లాడే తాలిబాన్ సభ్యుడు మౌలానా శాహ్‌దేరా మరణ వార్త గురించి చెలరేగిన వదంతులపై పెద్ద చర్చ జరిగింది. అతనే అమ్మాయిలు పాఠశాలకు వెళ్ళడాన్ని నిషేధిస్తూ ప్రకటన చేశాడు.

కొంతమంది అమ్మాయిలు అతను చనిపోయాడు అంటారు, ఇంకొంతమంది కాదు అతను బతికే ఉన్నాడు అంటారు. ఎందుకంటే ఆ ముందురోజు అతను ఛానల్‌లో మాట్లాడలేదు. అందుకే చనిపోయాడని వదంతులు చెలరేగాయి. ఒక అమ్మాయి "అతను సెలవుపై వెళ్ళిఉంటాడు" అంది. శుక్రవారం నాడు మా ట్యూషన్‌కు సెలవు ఉంటుంది. అందుకే  చాలాసేపు ఆడుకుంటూనే ఉన్నాము. నేను టివి చూడటానికి కూర్చున్నాను. అంతలోనే లాహోర్‌లో బాంబులు పేలాయని తెలిసింది. నాలో నేను అనుకున్నాను. అయ్యో భగవంతుడా! ప్రపంచంలో అన్నిచోట్ల కంటే ఎక్కువగా పాకిస్తాన్‌లోనే బాంబులు పేలతాయెందుకు  అనుకున్నాను.

### 14 జనవరి, 2009

పాఠశాలకు వెళ్తున్నప్పుడు నా మనసేమీ బాగోలేదు. ఎందుకంటే రేపటి నుంచి శీతాకాల సెలవులుంటాయి. ప్రిన్సిపాల్ అయితే సెలవులు ప్రకటించారు. కాని పాఠశాల తిరిగి ఎప్పుడు తెరుస్తారో చెప్పలేదు. మొదటిసారి ఇలా జరిగింది. ఎందుకంటే ఇంతకు ముందు ప్రతీసారి సెలవుల తర్వాత పాఠశాల తిరిగి ఎప్పుడు తెరుస్తారో కూడా ప్రకటించే వారు. అయినప్పటికీ ప్రిన్సిపాల్ పాఠశాల తిరిగి ఎప్పుడు తెరుస్తారనే తేది ఎందుకు చెప్పలేదో కారణం నాకు తెలియదు. జనవరి 15 నుండి అమ్మాయిలు పాఠశాలలకు వెళ్ళడాన్ని నిషేధిస్తూ తాలిబాన్ల ప్రకటన వచ్చింది. అందుకే ఇలా జరిగిందని నేను అనుకుంటున్నాను.

ఈసారి అమ్మాయిలు సెలవుల గురించి ఉత్సాహంగా లేరు. ఎందుకంటే ఒకవేళ తాలిబాన్లు తమ ఆజ్ఞను అమలుపరిస్తే ఇక ఎప్పటికి పాఠశాలకు వెళ్ళలేమని వారికి అర్థమైంది. తాలిబాన్ల పాలనలో స్వాత్ ప్రాంతంలో అమ్మాయిల చదువుపై నిషేధం విధించారు. అయినప్పటికీ కొంతమంది అమ్మాయిలకు తిరిగి ఫిబ్రవరిలో పాఠశాల తెరుస్తారని నమ్మకం ఉంది. కాని చాలామంది అమ్మాయిలు తమ చదువులు కొనసాగించడం కోసం తమ తల్లిదండ్రులు స్వాత్ నుంచి ఇతర నగరాలకు వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నట్లు చెప్పారు. పాఠశాలకు ఆఖరి రోజు అవుతున్నందుకు నేను నా స్నేహితులు అందరం ఇంకొంత సేపు ఆడుకుందామనుకున్నాము. నాకు మాత్రం తిరిగి పాఠశాల తెరచుకుంటుందని నమ్మకం ఉంది. కాని నేను ఇంటికి వెళ్ళేటపుడు పాఠశాలవైపు తిరిగి చూస్తే ఇక నేనెప్పుడూ ఇక్కడికి రాలేనేమో అనిపించింది.

## 15 జనవరి, 2009

రాత్రంతా తూటాల శబ్దాలే వినిపించాయి. నాకు మూడుసార్లు మెలుకువ వచ్చింది. ఎటూ పాఠశాలకు వెళ్ళేది లేదు. అందుకని చాలా ఆలస్యంగా నిద్రలేచాను. తర్వాత నా స్నేహితురాలు వచ్చింది. మేము హోంవర్క్ గురించి మాట్లాడుకున్నాము. నేడు 15 జనవరి రేపటి నుండి తాలిబాన్ల ఆజ్ఞలు అమలవుతాయి. నేను నా స్నేహితురాలు హోంవర్క్ గురించి ఎంత గంభీరంగా చర్చిస్తున్నామంటే ఇదేమంత సాధారణ విషయం కాదు అన్నంత గొప్పగా చర్చిస్తున్నాము.

ఇవ్వాళ, నేను బిబిసి ఉర్దూ శాఖ కోసం రాసిన నా డైరీ పేజీ చదివాను. మా అమ్మకు నా మారుపేరు “గుల్‌మకాయి” చాలా నచ్చింది. మా నాన్నతో మాట్లాడుతూ “మనం తన పేరు మార్చి గుల్‌మకాయి ఎందుకుపెట్టకూడదు”? అంది. నాకు కూడా ఆ పేరు బాగా నచ్చింది. ఎందుకంటే నా నిజమైన పేరులో “దుఃఖభరితమైన మనిషి” అనే అర్థం వస్తుంది కనుక.

మా నాన్న నా డైరీ గురించి చెబుతూ “కొన్ని రోజుల ముందు ఒక వ్యక్తి నా డైరీ ప్రింటవుట్ తీసుకొచ్చి చూపిస్తూ 'ఇది చాలా బాగుంది' అన్నాడని” గుర్తుచేశాడు. ఆ ప్రశంస విన్న మా నాన్న కేవలం చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడట. ఎందుకంటే ఆ అద్భుతమైన రాత నా కూతురిదేరా అని చెప్పలేడు కనుక.

## 19 జనవరి, 2009

ఈ రోజు మా నాన్న “ప్రభుత్వం మన పాఠశాలలను తప్పకుండా రక్షిస్తుంది” అని చెప్పాడు. ప్రధానమంత్రి కూడా ఈ విషయాన్ని ప్రస్తావించాడు. నేను చాలా సంతోషపడ్డాను. కాని దీంతోనే మా సమస్య పరిష్కారం కాదు. ఇక్కడ స్వాత్ ప్రాంతంలో ఈ రోజు ఫలానా ప్రాంతంలో ఇంతమంది సైనికులు చనిపోయారు. అటు అంతమంది గాయాల పాలయ్యారు అనే ఆ వార్తలు ప్రతీ రోజు వింటుంటాం, పోలీసులు అయితే ఈ మధ్య నగరంలో అసలు కనిపించడమే లేదు.

తాలిబాన్లు ఎఫ్.ఎమ్.ఛానల్‌లో ఇస్తున్న తమ ప్రకటనలు ఎప్పుడైతే తిరిగి వెనక్కు తీసుకుంటారో అప్పటి వరకు మమ్ములను పాఠశాలలకు పంపించరు. సైన్యాల కారణంగా కూడా మా ప్రాంతం అభివృద్ధిపై ప్రభావం పడింది. ఈ రోజు మా వీధిలోని ఒక అబ్బాయి పాఠశాలకు వెళితే “నువ్వు వెంటనే ఇంటికి వెళ్ళిపో, ఎందుకంటే ఇంకొద్దిసేపట్లో కర్ఫ్యూ విధిస్తున్నారు” అని ఉపాధ్యాయులు వెనక్కి పంపించేశారు. అయితే ఆ తర్వాత కర్ఫ్యూ విధించలేదు. కాని ఆ దారిలో సైన్యం దుండగులను పట్టుకొని తీసుకెళ్ళారు అని తెలిసింది.

## 19 జనవరి, 2009

ఈరోజు మరో ఐదు పాఠశాలలను బాంబులతో పేల్చేశారు. వీటిలో ఒక పాఠశాల మా ఇంటి ప్రక్కనే ఉంది. ఈ పాఠశాలలు మూసే ఉన్నాయి కదా! అని ఆశ్చర్యపోయాను. మరెందుకు వీటిని పేల్చేశారు? తాలిబాన్లు గీసిన గీతను దాటి ఎవరూ పాఠశాలల్లో అడుగుపెట్టలేదు.

ఈ రోజు నేను నాస్నేహితురాలు ఇంటికి వెళ్ళాను. అయితే కొన్ని రోజుల ముందు మౌలానా షాహ్ దౌరా పినతండ్రిని ఎవరో హత్యచేశారని చెప్పింది. అందుకనే బహూశా తాలిబాన్లకు కోపం వచ్చి పాఠశాలలు పేల్చివేశారన్నది. తాలిబాన్లకు ఎవరూ కష్టం కలిగించగూడదు, వారిని ఎవరైన ఈ విధంగా కష్టపెడితే ఆ కోపంతో మన పాఠశాలలు పేల్చేస్తారని చెప్పింది. కాని సైన్యం ఏమీ చేయలేక పోతోంది. వారు కొండ మీద కందకాల్లో కూర్చొని ఉంటారు. మేకలు కోసుకుని తింటూ ఆనందిస్తున్నారు.

## 22 జనవరి, 2009

పాఠశాలలు మూతబడి ఉన్నాయి. ఖాళీగా ఇంట్లో కూర్చోడం వల్ల ఏదో వెలితిగా అనిపిస్తోంది. నా స్నేహితులు చాలా మంది స్వాత్ విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ఈ మధ్య స్వాత్‌లో పరిస్థితులు చాలా దిగజారిపోయాయి. భయం కారణంగా ఇంట్లో నుంచి బయటికి వెళ్ళలేకపోతున్నాను. రాత్రి కూడా మౌలానా షాహ్‌దౌరా ఎఫ్.ఎం. ఛానల్‌లో మాట్లాడుతూ అమ్మాయిలు ఇంటి నుంచి బయటికి రావద్దని హెచ్చరించాడు. సైన్యాలు మోహరించి ఎక్కడైనా పాఠశాలలు తెరిపిస్తే బాంబులు పేల్చడం ఖాయం అని కూడా హెచ్చరించాడు.

నాన్నగారు ఈరోజు ఇంట్లో చెప్పిందేంటంటే 'హాజీబాబాలో అమ్మాయిలు – అబ్బాయిలు కలిసి చదువుకునే పాఠశాలల్లో సైన్యం మోహరించింది. వారిని దేవుడు రక్షించు గాక!' అన్నారు.

## 24 జనవరి, 2009

మా వార్షిక పరీక్షలు ఈ సెలవులైన తర్వాత నిర్వహిస్తారు. కాని అమ్మాయిలు పాఠశాలలకు వెళ్ళడాన్ని తాలిబాన్లు ఎప్పుడు అంగీకరిస్తారో అప్పుడే నిర్వహించ గలుగుతారు. పరీక్షలకు సిద్ధమవడానికి మాకు కొన్ని అధ్యాయాలు సూచించారు. కాని నా మనసుకు చదువుకోవాలనిపించడం లేదు.

నిన్న సైన్యాలు మింగోరాలోని విద్యా సంస్థలను సంరక్షించడానికి వాటిని తమ ఆధీనంలోకి తీసుకోగలిగాయి. గతంలో డజన్ల కొద్ది పాఠశాలలు నాశనమయ్యాయి. వందల కొద్ది మూతపడ్డాయి. అయితే ఆ పరిస్థితి రాకముందే అక్కడికెళ్ళి రక్షణ కల్పించాలని సైనికులకు అర్థమయ్యింది. ఒకవేళ అప్పుడే సరియైన సమయంలో గస్తీ చేస్తే ఇటువంటి పరిస్థితి ఎదురయ్యేది కాదు. స్వాత్ తాలిబాన్ల ప్రవక్త ముస్లిమ్‌ఖాన్ సైనికులున్న పాఠశాలలపై కూడా దాడులు చేస్తామని హెచ్చరించాడు. మా పాఠశాలలో ఉన్న ఒక నల్లబల్లను ఆనర్ బోర్డు అంటారు. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకున్న వారి పేర్లు ఆ బోర్డుపై రాస్తారు. కాని ఈసారి ఆ బోర్డుపై పేర్లు రాసే సాహసం ఎవరూ చేయలేదు.

## 26 జనవరి, 2009

పొద్దు పొద్దున్నే ఫిరంగి గుండ్ల శబ్దాలు విని ఒక్కసారిగా మెలకువ వచ్చింది. చాలా తూటాలు పేల్చారు. ముందు అయితే హెలికాప్టర్ల శబ్దాలతోనే భయపడేవాళ్ళము. ఇక ఇప్పుడు ఫిరంగి గుండ్ల శబ్దాలతో. నాకు బాగా గుర్తుంది. గస్తీ మొదలైనప్పుడు మొట్టమొదటిసారి హెలికాప్టర్లు మా ఇండ్లపై నుంచి వెళ్ళాయి. అప్పుడు మేము భయాందోళనలకు గురై దాక్కున్నాము. మా వీధిలో పిల్లలందరి పరిస్థితి ఇదే.

ఒకరోజు హెలికాప్టర్ల పైనుంచి టాఫియాలు (మిఠాయిలు) విసిరారు. ఈ పరిస్థితి కొంత కాలం నడిచింది. ఇప్పుడు నా తమ్ముళ్ళు, మా వీధిలోని అనేక మంది పిల్లలు హెలికాప్టర్ శబ్దం వస్తే ఇంట్లో నుంచి బయటికి వచ్చి టాఫియాలు విసిరితే తీసుకోవాలని ఎదురు చూస్తుంటారు. కాని మళ్లీ ఎప్పుడు అలా జరగలేదు.

## 28 జనవరి, 2009

మా నాన్న తాను ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాడు. మేము నిన్ననే ఇస్లామాబాద్ చేరుకున్నాము. దారిలో చాలా భయపడ్డాము. ఎందుకంటే తాలిబాన్లు దారి కాస్తూ ఉంటారని విని ఉన్నాం. కాని మాకు అటువంటి పరిస్థితి ఎదురు కాలేదు. దీనికి బదులు సైనికులు మా గురించి విచారించారు. స్వాత్ ప్రాంతం దాటిపోగానే భయం పోయింది. మేము ఇస్లామాబాద్‌లో నాన్నగారి స్నేహితుడి ఇంట్లో దిగాం. నేను ఇక్కడకి మొదటిసారి వచ్చాను.

ఇస్లామాబాద్‌లో నాన్న లోక్‌విర్సాకి తీసుకెళ్ళాడు. ఇక్కడ నా గురించి చాలా గొప్పగా చెప్పుకుంటున్నారు. ఈ పట్టణంలో సుందరమైన భవనాలు, వెడల్పాటి రహదారులు ఉన్నాయి. కాని స్వాత్‌తో పోలిస్తే ప్రకృతి సౌందర్యం లోపించింది. మా నాన్న మమ్మల్ని లోక్‌విర్సా మ్యూజియం చూపించడానికి తీసుకెళ్ళారు. అక్కడ నేను చాలా నేర్చుకున్నాను. స్వాత్‌లో కూడా ఇటువంటి మ్యూజియం ఉంది. కాని యుద్ధం తర్వాత అది సురక్షితంగా ఉంటుందో లేదో తెలియదు. లోక్‌విర్సా నుంచి బయలుదేరి మా నాన్న ఒక అపరిచిత వృద్ధుని వద్ద మా కోసం పాప్‌కార్న్ తీసుకున్నాడు.

ఆ వృద్ధుని గురించి వివరాలడిగితే అతను మొహ్మద్ ఏజెన్సీకి సంబంధించిన వాడని తెలిసింది. అక్కడ సైనిక గస్తీలు మొదలయ్యాయి, ఇల్లువాకిలి విడిచి పెట్టి ఇక్కడికి వచ్చాను అన్నాడు. ఆ సమయంలో మా అమ్మా నాన్న కళ్ళ నుంచి నీరు తిరగడం నేను గమనించాను.

**31 జనవరి, 2009**

స్వాత్ యుద్ధంతో మాకు జరిగిన ఉపయోగం ఏమిటంటే మా నాన్న జీవితంలో మొదటిసారి మా అందరిని మింగోరా (స్వాత్ కొండల్లోని అన్నింటికంటే పెద్ద నగరం) నుంచి బయటకు తీసుకువచ్చి అనేక నగరాలు తిప్పి చూపించాడు. మేము నిన్న ఇస్లామాబాద్ నుండి పెషావర్ వచ్చాము. అక్కడ మేము మా బంధువుల ఇంట్లో చాయ్ తాగాము. ఆ తర్వాత బన్నూ వెళ్ళాలనుకున్నాము.

తర్వాత మేము వాహనాలు ఆగే స్థావరానికి వెళ్ళి అక్కడి నుంచి వ్యాగన్‌లో కూర్చొని బన్నూకి బయలుదేరాము. వ్యాగన్ చాలా పాతది, కొంతదూరం పోయాక చెడిపోయిన రోడ్డు కావడంతో వ్యాగన్ పక్కకు ఒరిగి ఒక గోతిలోకి పడిపోయింది. దాంతో అనుకోకుండా వ్యాగన్‌కు హారన్ మ్రోగింది. అప్పుడు నా రెండవ తమ్ముడు పది సంవత్సరాల వయస్సుంటుంది. వాడు నిద్రలో నుంచి ఉలిక్కిపడి లేచాడు. చాలా భయపడ్డాడు. లేవగానే వాడు అమ్మతో 'అమ్మా ఏం జరిగింది. ఏమైనా పేలిందా?' అన్నాడు. చాలా రాత్రి అయ్యాక మేము బన్నూ చేరుకున్నాము. అక్కడ మా నాన్న స్నేహితుడు మా కోసం ఎదురుచూస్తున్నారు. మా నాన్న స్నేహితుడు కూడా పస్తూన్ తెగకు చెందినవాడే. కాని వారి కుటుంబ సభ్యుల యాస మాకు సరిగా అర్థం కావడం లేదు.

ముందు మేము అక్కడి సంతకు వెళ్ళాము. ఆ తర్వాత పార్కుకి వెళ్ళాము. ఇక్కడి మహిళలు బయటికెళ్ళేటపుడు తలపాగా ఉండే బుర్ఖా ధరించడం తప్పనిసరి. మా

అమ్మ అయితే ధరించింది. కాని నేను నిరాకరించాను. ఎందుకంటే అది వేసుకుని నడవలేను.

స్వాత్‌తో పోలిస్తే ఇక్కడ శాంతియుతంగా ఉంది. మాకు ఆతిథ్యం ఇచ్చిన ఒకతను ఇక్కడ కూడా తాలిబాన్లు ఉన్నారని చెప్పాడు. అయినా ఇక్కడ స్వాత్‌లో ఉన్నంత అశాంతి ఉండదు. ఇక్కడ కూడా అమ్మాయిల పాఠశాలలు మూసివేయాలని తాలిబాన్లు హెచ్చరించారు. కాని పాఠశాలలు మూతపడలేదు.

## 1ఫిబ్రవరి, 2009

బన్నూ నుండి పెషావర్ వెళ్తున్నపుడు దారిలో ఉండగా స్వాత్ నుంచి నా స్నేహితురాలి ఫోన్ వచ్చింది. ఆమె చాలా భయంగా ఉంది. ఆమె నాతో 'ఇక్కడి పరిస్థితులు అస్సలు బాగా లేవు. నువ్వు ఇక్కడికి రావద్దు' అని చెప్పింది. ఆమె ఇంకా మాట్లాడుతూ, 'సైనిక చర్యలు మొదలయ్యాయి. మిషన్‌గన్లతో 37 మందిని చంపేశారు. సాయంత్రమే మేము పెషావర్‌కి వెళ్ళి పోయాం' అంది. మేము చాలా అలసిపోయి ఉన్నాము. టివి పెట్టి చూశాం. అందులో కూడా స్వాత్ గురించే మాట్లాడుతున్నారు. ప్రజలు ఆ కష్టాలు భరించలేక దేశం విడిచి వెళ్ళిపోతున్నట్లు చూపించారు. ప్రజలు బారులు కట్టి పరాయి ప్రాంతాలకు తరలి పోతున్నారు. వారు రిక్తహస్తాలతో ఉన్నారు.

గతంలో ఆలోచించేదాన్ని. అదేమిటంటే ఒకానొక సమయంలో బయటి ప్రదేశాల నుంచి విహారయాత్ర కోసం స్వాత్‌కి వచ్చేవారు. కాని ఇప్పుడు స్వాత్ నివాసులు స్వయంగా అక్కడి నుంచి వెళ్ళిపోయే పరిస్థితి ఏర్పడింది. నేను మరో ఛానల్ పెట్టాను. ఇందులో ఒక మహిళ మాట్లాడుతూ 'మన షహీద్ బేనజీర్ భుట్టో రక్తాన్ని పంచుకుందాం' అంది. అయితే నేను మా నాన్నతో 'వందల మంది స్వాతీయుల రక్తం ఎవరు పంచుకుంటారు నాన్న?' అని అడిగాను.

## 3 ఫిబ్రవరి, 2009

నేడు మా పాఠశాల తెరచుకునే రోజు. ఉదయం లేవగానే పాఠశాల తెరవడం లేదన్న సందేశం వచ్చినందుకు నేను బాధపడ్డాను. గతంలో ఎప్పుడైనా నిర్ణయించిన రోజు పాఠశాల తెరవకుంటే సంతోషపడేవాళ్ళము. ఈసారి అలాకాదు. ఎందుకంటే మా పాఠశాల తాలిబాన్ల ఆజ్ఞలపై శాశ్వతంగా మూతబడి పోతుందేమోనని భయమేస్తోంది.

బాలికల ప్రయివేటు పాఠశాలలు మూతపడ్డాక, బాలుర ప్రయివేటు పాఠశాలలు కూడా ఫిబ్రవరి 8 లోపు తెరవరాదని నిర్ణయించాయని, ఫిబ్రవరి 9న తెరుస్తున్నట్లు ఆ మేరకు వాటి ముందు నోటీసులు అతికించారని నాన్న చెప్పాడు. కాని అమ్మాయిల పాఠశాలలపై ఈ ప్రకటన లేదు అని చెప్పాడు. అంటే దీనర్థం మా పాఠశాలలు ఎన్నటికీ తెరవబడవు అని.

## 7 ఫిబ్రవరి, 2009

మధ్యాహ్నం నేను, నా చిన్న తమ్ముడు నాన్నతో కలిసి మింగోరాకు బయలు దేరాము. అమ్మ ఇంకొక తమ్ముడు మాకంటే ముందే అక్కడికి వెళ్ళిపోయారు. 20 రోజుల తర్వాత తిరిగి మింగోరా వెళ్తున్నామన్న ఆలోచన సంతోషం కలిగిస్తోంది. అదే సమయంలో భయం కూడా వేసింది. ఖంబర్ వచ్చాం. అది దాటితే మింగోరానే. అక్కడంతా వాతావరణంలో ఒకరకమైన స్తబ్దత ఆవరించి ఉంది.

పెద్ద పెద్ద గడ్డాలు, పొడవాటి వెంట్రుకలు గల మనుషులు తప్ప అక్కడ ఇంకేమీ కనిపించడంలేదు. రూపురేఖలు చూస్తే వీరందరు తాలిబాన్లలాగే కనిపిస్తున్నారు. నేను కొన్ని ఇండ్లను గమనించాను. అవి కాల్పుల్లో ధ్వంసమై ఉన్నాయి.

మింగోరా గల్లీలు చాలా ఇరుకుగా అనిపించాయి. మేము మా అమ్మ కోసం ఏదైనా బహుమతి కొనటానికి షాహ్ సూపర్ మార్కెట్‌కి వెళ్ళాము. అయితే అది మూసేసి ఉంది. గతంలో ఈ మార్కెట్ సాయంత్రం చాలా సమయం వరకు తెరిచే ఉంచేవారు. మిగతా దుకాణాలు కూడా మూసేశారు. మేము అమ్మతో మింగోరా వస్తున్నట్లు ముందుగా చెప్పలేదు. ఎందుకంటే మేము ఆమెను ఆశ్యర్యంలో ముంచెత్తాలని అనుకున్నాము. మేము ఇంట్లోకి రావడంతోనే అమ్మ మమ్మల్ని చూసి నిజంగానే ఆశ్చర్యపోయింది.

## 8 ఫిబ్రవరి 2009

నేను బీరువా తెరవగానే అందులో కనిపించిన యూనిఫామ్, పుస్తకాల సంచీ, జామెట్రీ బాక్సు చూసి నాకు చాలా బాధ అనిపించింది. బాలుర ప్రైవేట్ పాఠశాలలన్నీ రేపు తెరుస్తారు. మా ఆమ్మాయిల అభివృద్ధికి మాత్రం తాలిబాన్లు అడ్డుపడ్డారు.

నేను జామెట్రీ బాక్సు చూస్తే 200 రూపాయలు ఉన్నాయి. ఇవి పాఠశాలకు కట్టాల్సిన ఫైన్ డబ్బులు. ఎప్పుడైనా అమ్మాయిలు పాఠశాలకు రాకపోయినా, ఆలస్యంగా వచ్చినా వారి వద్ద ఫైన్ కట్టించుకోవాల్సిన బాధ్యత టీచర్ నాకు అప్పగించింది.

పాఠశాల విషయాలు చాలా గుర్తుకు వస్తున్నాయి. అన్నింటికంటే ఎక్కువగా అమ్మాయిల మధ్య తలెత్తే చిలిపి తగాదాలు గుర్తుకు వస్తున్నాయి. నా చిన్న తమ్ముడి పాఠశాల రేపు తెరుస్తున్నారు. వాడు అసలే హోంవర్క్ చేయలేదు. పాఠశాలకు వెళ్ళాలంటే భయపడుతున్నాడు. మా అమ్మ రేపే కర్ఫ్యూ విధిస్తున్నారనే విషయం చెప్పగానే వాడు వెంటనే రేపు నిజంగానే కర్ఫ్యూ విధిస్తున్నారా అని అడిగాడు. దాంతో అమ్మ "అవును" అంది. అది వినగానే వాడు సంతోషంతో గంతులు వేయడం మొదలుపెట్టాడు.

## 9 ఫిబ్రవరి, 2009

స్వాత్‌లో అబ్బాయిల పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రాథమిక తరగతుల అమ్మాయిలు పాఠశాలకు వెళ్ళడంపై తాలిబాన్లు ఆంక్షలను తొలగించిన తరువాత, అమ్మాయిలు కూడా పాఠశాలకు వెళ్తున్నారు. మా పాఠశాలలో 5వ తరగతి వరకు అమ్మాయిలు, అబ్బాయిలు కలిసే చదువుకుంటారు.

నా చిన్న తమ్ముడి తరగతిలో 49మందికి కేవలం ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. అందులో ఒక అమ్మాయి ఉంది. అసెంబ్లీలో కూడా 70 మంది విద్యార్థులే ఉన్నారు. మా పాఠశాలలో మొత్తం 700 మంది ఉండాలి.

ఈ రోజు మా ఇంటి పనిమనిషి వచ్చింది. ఆమె వారానికి ఒక రోజు మా ఇంట్లో బట్టలు ఉతుకుతుంది. ఆమెతో ఇంకొక మహిళ కూడా వచ్చింది. పని మనిషి అటక్ జిల్లాకు చెందినది. కాని ఈమె ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటుంది. అయితే "పరిస్థితులు చాలా దుర్భరంగా ఉన్నాయి. అందుకే నా భర్త వెంటనే అటక్ తిరిగి వచ్చేయమని కబురు పంపాడు" అంది. ఇన్ని సంవత్సరాల నుండి ఇక్కడే ఉండటానికి కారణం స్వాత్‌లో ఉంటే నాకు సొంత ఇంట్లో ఉన్నట్లు అనిపిస్తుందని ఆమె చెప్పింది. నేను మా నగరం అయిన అటక్‌కు వెళితే నేను నా సొంత నగరాన్ని విడిచి కొత్త ప్రదేశానికి వచ్చినట్లు అనిపిస్తుందన్నది. ఆమె తోడు వచ్చిన ఇంకొక మహిళ స్వాత్ వాసురాలే. ఆమె మా అమ్మకు ఒక సామెత వినిపించింది.

**అలమ్ చార్‌లహ్‌మూలక్ : న జీ**

**ధా దేర్ గరీబ్ శీయాదయార్ లహ్‌గమ్ : జీ నా**

(మనుషులు తమ ఇష్టానుసారంగా తమ ఆస్తిని వదులుకోరు, ఏదైనా చాలా కష్టం వస్తేనో లేదా తన ప్రేయసి ఆ ఆస్తి కావాలని ఒత్తిడి చేస్తేనో విడిచిపెడతారు)

## 11 ఫిబ్రవరి, 2009

ఈ రోజు కూడా రోజు మొత్తం వెలితిగానే గడిచింది. ఇంట్లో టి.వి. కూడా లేదు. మేము శీతాకాలం సెలవుల్లో 20 రోజులు వేరే ఊరికి వెళ్ళినపుడు ఇంట్లో దొంగతనం జరిగింది. గతంలో ఇటువంటి దొంగతనాలు ఎప్పుడూ లేవు. కాని పరిస్థితులు పూర్తిగా మారిపోయిన తర్వాత ఇటువంటివి జరుగుతున్నాయి. దేవుడి దయవల్ల మా ఇంట్లో నగదు, బంగారం ఏమీ లేదు. నా బ్రాస్‌లెట్, కాళ్ళ పట్టీలు కనపడలేదు. ఆ తర్వాత అవి నాకు వేరే చోట దొరికాయి. బహుశా దొంగలు అవి మంచివి అనుకొని తీసుకువెళ్ళాలనుకున్నారు. కాని అవి గిల్టువని తరువాత గుర్తించి ఉంటారు. మౌలానా ఫజల్ ఉల్లాహ్ గత రాత్రి ఎఫ్.ఎం.లో మాట్లాడుతూ, మింగోరా పోలీస్ స్టేషన్‌పై జరిగిన ఆత్మాహుతి దాడిని, కేవలం ప్రెజర్‌కుక్కర్ పేలుడు మాత్రమే అనుకోండి. దీని తర్వాత పెద్ద పాత్ర పేలుతుంది, దాని తర్వాత పెద్ద ట్యాంకర్ పేలుతుంది అని చెప్పాడు.

రాత్రిపూట మానాన్న స్వాత్‌లో జరుగుతున్న అన్ని దుర్ఘటనల గురించి చెప్పాడు. ఈ మధ్యకాలంలో మేము మాట్లాడుకుంటున్న ప్రతీ మాటలో సైన్యం, తాలిబాన్ రాకెట్, తూటాల అమ్మకాలు, మౌలానా ఫజల్ ఉల్లాహ్, ముస్లిం మతం, పోలీస్, హెలికాప్టర్, హత్యలు, గాయాలు వంటి మాటలే అనివార్యంగా వస్తున్నాయి.

## 12 ఫిబ్రవరి, 2009

నిన్న రాత్రి మొత్తం తుపాకీ శబ్దాలు భయంకరంగా వినిపిస్తునే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కూడా నా ఇద్దరు తమ్ముళ్ళు హాయిగా నిద్రపోతున్నారు. కాని నాకు మాత్రం అస్సలు నిద్రపట్టలేదు. నేను నాన్న దగ్గరకు వచ్చాను. అక్కడ కూడా నచ్చలేదు. అమ్మ దగ్గరకు వెళ్ళి పడుకున్నాను. తర్వాత కొద్దిసేపు నిద్రవచ్చినట్లు కళ్ళు మూతలు పడుతున్నాయి, తెరుచుకుంటున్నాయి. దీనివల్ల ఉదయం ఆలస్యంగా మేలుకున్నాను. మధ్యాహ్నం ట్యూషన్ టీచర్ వచ్చింది. దాని తర్వాత ఇస్లాం మత బోధకుడు వచ్చి కొద్దిసేపు బోధించాడు. సాయంత్రం లోపు తమ్ముళ్ళతో ఒకసారి గొడవపెట్టుకొని, ఇంకొకసారి వారిని బుజ్జగించి ఆడించాను. టి.వి. లేనందుకు కొద్దిసేపు కంప్యూటర్ గేమ్స్ కూడా ఆడుకున్నాను.

తాలిబాన్లు కేబుల్‌పై ఎప్పటి వరకైతే ఆంక్షలు విధించారో అప్పటి వరకు స్టార్ ప్లస్‌లో సీరియల్స్ చూస్తూ ఉంటాను "రాజుగారి వివాహ వేడుక" సీరియల్ నాకు చాలా నచ్చింది. నాకు హాస్యం కూడా చాలా నచ్చుతుంది. పాకిస్తాన్ ఛానల్ "జియో" హాస్య

కార్యక్రమం "మేమంతా నమ్మకంగా నమ్మకంగా ఉన్నాము" అనేది కూడా నేను చాలా ఇష్టంగా చూస్తుంటాను.

ఈ రోజు శుక్రవారం. అందుకనే నాకు చాలా భయమేస్తోంది. ఎందుకంటే శుక్రవారం నాడు ఆత్మాహుతి దళాల దాడులు చాలా ఎక్కువగా జరుగుతాయని అంటారు. ఇస్లాంను అనుసరించి ఇది ఒక పవిత్రమైన దినం. ఈ రోజు ఆత్మాహుతి చేసుకోవడం వల్ల పుణ్యాత్ములమవుతామని వారి నమ్మకం.

## 13 ఫిబ్రవరి, 2009

ఈ రోజు వాతావరణం చాలా బాగుంది. వర్షాలు బాగా పడినపుడు మా స్వాత్ చాలా అందంగా తీర్చిదిద్దినట్లు అవుతుంది. కాని ఉదయం లేవగానే ఇవాళ ఎవరో ఒక రిక్షా డ్రైవర్‌ను ఇంకా, ఒక వృద్ధ కాపలాదారుడిని హత్య చేశారని మా అమ్మ చెప్పింది. ఇక్కడ జీవితమంతా దుర్భరమైన పరిస్థితుల్లోకి నెట్టబడుతోంది. చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి వందల మంది మింగోరా వస్తుంటే, మింగోరా ప్రజలేమో వేరే నగరాలకు వెళ్ళిపోతున్నారు. ధనవంతులైనవారు స్వాత్‌ను విడిచివెళుతున్నారు. పేద ప్రజలు మాత్రం ఎటూ వెళ్ళలేని పరిస్థితుల్లో ఉన్నారు.

మేము మా పెద్దనాన్న కుమారుడికి ఫోన్ చేసి ఇప్పుడున్న మంచి వాతావరణంలో మీ బండిలో ఎక్కించుకొని మింగోరా అంతా తిప్పి చూపమని అడిగాము. అతను వచ్చాడు. కాని మేము బయటకి వెళ్ళి చూస్తే మార్కెట్ అంతా మూతబడి ఉంది. రోడ్లన్ని నిశ్శబ్దంగా ఉన్నాయి. మేము కంబర్ వైపు వెళ్ళాలని అనుకున్నాము. కాని ఎవరో ఎదురుపడి ఆ రోడ్డులో చాలా పెద్ద ఊరేగింపు జరుగుతోందని చెప్పాడు.

రాత్రి ఎఫ్.ఎం. స్టేషన్‌లో మౌలానా ఫజలుల్లాహ్ మాట్లాడాడు. అతను చాలాసేపు రోదించాడు. అతడు తమపై సైనికచర్య ఆపివేయాలని డిమాండ్ చేశాడు. అతను ప్రజలకు విన్నవించుకుంటూ కష్టాలు వచ్చినప్పుడు విడిచిపోకూడదు, అందరూ తమ తమ ఇళ్లకు తిరిగి వచ్చేయండని కోరాడు.

## 15 ఫిబ్రవరి, 2009

ఈ రోజు పెషావర్ ఇంకా ఊర్ల నుండి బంధువులు వచ్చి ఉన్నారు. మధ్యాహ్నం భోజనాలు చేస్తున్న సమయంలో బయట విపరీతమైన ఫైరింగ్ మొదలయ్యింది. ఇంత తీవ్రమైన ఫైరింగ్ గతంలో నేను ఎప్పుడూ చూడలేదు. మేమంతా భయభ్రాంతులకు

గురయ్యాము. బహుశా తాలిబాన్లు వచ్చారనుకున్నాము. నేను నాన్న దగ్గరకు పరిగెత్తాను. అయితే నాన్న "భయపడవద్దు, ఇది శాంతి కోసం జరిగే ఫైరింగ్ మాత్రమే" అన్నాడు. ఇంకా ఈ రోజు తాలిబాన్లు ప్రభుత్వం మధ్య స్వాత్ గురించి ఒప్పంద చర్చ జరుగుతున్నట్లు వార్తా పత్రికలో వచ్చిందని చెప్పారు. అందుకని ప్రజలు సంతోషంతో ఫైరింగ్ చేస్తున్నారు. ఇంకా సాయంత్రం పూట తాలిబాన్లు కూడా ఎఫ్.ఎం.లో శాంతి ఒప్పందాన్ని ప్రకటించినపుడు మధ్యాహ్నం కంటే ఎక్కువ ఫైరింగ్ వినిపించింది. ఎందుకంటే ప్రజలు ప్రభుత్వం కంటే తాలిబాన్ల ప్రకటనపైనే ఎక్కువగా నమ్మకం పెట్టుకున్నారు. మేము కూడా ఈ ప్రకటన విన్నపుడు మా అమ్మ ఏడ్చేసింది. ఇంకా నాన్న కూడా. నా ఇద్దరు చిన్న తమ్ముళ్ళ కళ్ళ నుంచి కూడా నీరు కారాయి.

## 16 ఫిబ్రవరి, 2009

నేను చాలా ఆనందంగా ఉన్నాను. ఎందుకంటే ప్రభుత్వం, తాలిబాన్లు శాంతి శాంతి ఒప్పందం మీద ఈ రోజే సంతకం చేస్తారు. హెలికాప్టర్లు కూడా ఇవ్వాళ చాలా కింది నుంచి ఎగురుతున్నాయి. శాంతి దగ్గరపడుతున్న కొద్దీ హెలికాప్టర్లు కూడా భూమికి దగ్గరవుతున్నాయని మా బంధువు ఒకరు వ్యాఖ్యానించారు.

మధ్యాహ్నం పూట 'శాంతి' వార్త విని ప్రజలు మిఠాయిలు పంచుకున్నారు. నా స్నేహితురాలు నాకు అభినందనలు చెప్పటానికి ఫోన్ చేసింది. ఇప్పుడిక తనకు ఇంట్లో నుంచి బయటకి వెళ్ళే అవకాశం దొరుకుతుంది అని చెప్పింది. ఎందుకుంటే ఆమె కొన్ని మాసాల కాలం నుంచి ఒకే గదిలో బంధించినట్లు ఉంటుంది. మేమిద్దరం కూడా ఇక అమ్మాయిల పాఠశాలలు తెరుస్తారేమో అనే నమ్మకంతో సంతోషపడ్డాం.

## 17 ఫిబ్రవరి 2009

పరీక్షలకు సిద్ధం కావడం మొదలుపెట్టాను. ఎందుకంటే శాంతి చర్చల తర్వాత తిరిగి అమ్మాయిల పాఠశాలలు తెరుస్తారని నమ్మకంగా ఉంది. ఈ రోజు నా ట్యూషన్ టీచర్ కూడా రాలేదు. ఆమె ఒక ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్ళింది. నేను నా గదిలోకి వెళ్లాను. అక్కడ నా ఇద్దరు తమ్ముళ్ళు హాయిగా ఆడుకుంటున్నారు.

ఈ రోజు స్వాత్‌లో సూఫీమొహ్మద్ వచ్చి ఉన్నాడు. మీడియా వాళ్ళు కూడా చాలామంది వచ్చారు. పట్టణమంతా కోలాహలంగా ఉంది. మార్కెట్ వాతావరణం తిరిగి వచ్చింది. ఈ విడత చర్చలు సఫలం కావాలని దేవుణ్ణి వేడుకుంటున్నారు. నాకైతే చాలా

నమ్మకం ఉంది. ఒకవేళ ఏమీ ఫలించకపోయినా కనీసం అమ్మాయిల పాఠశాలలైనా తెరవబడతాయి.

## 18 ఫిబ్రవరి, 2009

ఈ రోజు నేను మార్కెట్‌కు వెళ్ళాను. అక్కడ చాలా సందడిగా ఉంది. ప్రజలు శాంతి చర్చలతో సంతోషంగా ఉన్నారు. చాలా కాలం తర్వాత మార్కెట్ వద్ద ట్రాఫిక్ జామ్ చూశాను. కాని సాయంత్రం మూసా ఖాన్‌ఖెల్ అనే స్వాత్ జర్నలిస్టును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని నాన్నగారు చెప్పారు. అమ్మ ఆరోగ్యం బాగా లేదు. మాకు అందరికీ శాంతిపై నమ్మకం పోయింది.

## 19 ఫిబ్రవరి, 2009

ఈ రోజు నాన్నే అల్పాహారం సిద్ధం చేశారు. ఎందుకంటే నిన్నటి నుంచి అమ్మ ఆరోగ్యం బాగాలేదు. ఆ జర్నలిస్టు హత్య గురించి నాకెందుకు చెప్పారంటూ ఆమె అభ్యంతరం వ్యక్తం చేసింది. నేను తమ్ముళ్ళతో కూడా చెప్పాను. ఇక నుంచి మనం యుద్ధం గురించి కాకుండా శాంతి గురించే మాట్లాడుకుందాం అని. ఈ రోజు మా ప్రధానోపాధ్యాయురాలు అమ్మాయిలకు మార్చి మొదటి వారంలో వార్షిక పరీక్షలుంటాయిని ప్రకటించినట్లు తెలిసింది. నేను కూడా ఈ రోజు నుంచి పరీక్షల కోసం పూర్తి స్థాయిలో సిద్ధమవ్వడం మొదలుపెట్టాను.

## 21 ఫిబ్రవరి, 2009

స్వాత్‌లో పరిస్థితులన్నీ మెల్లమెల్లగా మారుతున్నాయి. ఫైరింగ్, ఆయుధం ఉపయోగించడం కూడా దాదాపుగా తగ్గింది. కాని ప్రజలు ఇప్పటికీ భయం, భయంగానే ఉంటున్నారు. ఎందుకంటే శాంతి చర్చలు ఎన్నిరోజులు నిలబడతాయోనని. తాలిబాన్ల కమాండర్లు కొంతమంది ఈ చర్చలతో ఏకీభవించడం లేదు, కొన ఊపిరి ఉన్నంతవరకు వరకు పోరాడుతూనే ఉంటామని అంటున్నారు. అలా అని ప్రజలు కొంతమంది బూటకపు ప్రచారాలు కూడా చేస్తున్నారు.

ఇటువంటి బూటకాలు చూసి హృదయం తల్లడిల్లుతుంది. అసలు వారెందుకు ఇలా చేస్తున్నారు? మేము జామియాహఫ్సా, లాల్‌మజీద్‌ల బదులు తీసుకుంటాం అంటున్నారు. కాని అందులో మా తప్పేముంది? ఎవరైతే అటువంటి చర్యలకు పాల్పడ్డారో

వారికి ఎందుకు తగిన బుద్ధి చెప్పరు? ఇప్పుడే, ఇంతకు ముందు మౌలానా ఫజల్ ఉల్లాహ్ ఎఫ్.ఎం.లో ఒక ప్రకటన ఇస్తూ మేము అమ్మాయిల పాఠశాలల పట్ల మా నిర్ణయాలు రద్దుచేసుకుంటున్నాం, మార్చి 17వ తేది నుండి జరిగే పరీక్షలు రాయటానికి అమ్మాయిలు పాఠశాలలకు వెళ్ళి రావచ్చు. కాని వారు తప్పకుండా పరదా వేసుకునే పోవాలి అని ప్రకటించారు.

నేను చాలా సంతోషపడ్డాను. ఇలా జరుగుతుందని నేను ఎప్పుడూ ఊహించలేదు.

ఈ రోజు మేము షాపింగ్ చేయడానికి మహిళల మార్కెట్‌కు వెళ్ళాము. దారిలో మేము చాలా భయాందోళనలకు గురయ్యాం. తాలిబాన్లు మహిళల మార్కెట్‌లో షాపింగ్ చేయకూడదని నిషేధం విధించి ఉన్నారు. మేము మింగోరాలోని చైనా మార్కెట్‌కు వెళ్ళాము. అక్కడ కేవలం మహిళలకు అవసరమైన వస్తువులు మాత్రమే లభిస్తాయి.

మార్కెట్‌కు చేరుకోగానే ఆశ్చర్యపోయాము. అక్కడ చాలా తక్కువ మంది మహిళలు షాపింగ్‌కి వచ్చారు. గతంలో మేము ఈ మార్కెట్‌కి వస్తే మహిళలు కిక్కిరిసిపోయి ఒకరినొకరు నెట్టేసుకుంటూ నడవాల్సి వచ్చేది. మార్కెట్‌లో కొన్ని షాపులు మూసి ఉన్నాయి. కొన్ని షాపులపై "దుకాణాలు అమ్మబడును" అని బోర్డులు ఉన్నాయి. తెరచి ఉన్న దుకాణాల్లో కూడా సరుకులు చాలా తక్కువగా ఉన్నాయి. అవి కూడా పాతబడిపోయాయి.

## 23 ఫిబ్రవరి, 2009

తిరిగి పాఠశాలకు వెళ్తున్నానన్న ఆనందంతో ఈ రోజు నిద్ర లేచాను. పాఠశాలకు వెళ్ళి చూస్తుంటే కొంతమంది అమ్మాయిలు యూనిఫామ్, ఇంకొంత మంది సాధారణ వస్త్రాలు ధరించి ఉన్నారు. స్కూలు అసెంబ్లీలో అమ్మాయిలంతా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ సంతోషాలు పంచుకుంటూ కనిపించారు. అసెంబ్లీ అయిన తర్వాత ప్రధానోపాధ్యాయురాలు వచ్చి మీరు పరదా వేసుకుని రండి, ఎందుకంటే అమ్మాయిలు బడికి వెళ్ళొచ్చని ప్రకటించినప్పుడే అమ్మాయిలు బుర్ఖా ధరించడం కూడా తప్పనిసరి అని షరతు విధించారు.

మా తరగతిలో కేవలం 12 మంది అమ్మాయిలు మాత్రమే వచ్చారు. కొంతమంది అమ్మాయిలు స్వాత్ విడిచి వెళ్ళిపోయారు. కొంతమంది అమ్మాయిల తల్లిదండ్రులు భయం కారణంగా వారిని పాఠశాలకు పంపించడానికి నిరాకరించారు. నా స్నేహితురాళ్లు నలుగురు

ముందే స్వాత్ నుంచి వెళ్ళిపోయారు. ఈ రోజు కూడా ఇంకొక అమ్మాయి కుటుంబం రావల్సిండి వెళ్ళిపోతుందని చెప్పింది. నేను చాలా బాధపడ్డాను. ఆమెకు మీరు వెళ్ళొద్దు, ఇక్కడే ఆగిపోండని చెప్పాను. శాంతి చర్చలు జరిగాయి. పరిస్థితులు కూడా ఒక్కొక్కటి అనుకూలిస్తున్నాయి. కాని ఆమె మాత్రం ఇప్పుడు ఇక పరిస్థితులపై నమ్మకం లేదు అంది.

నాకు చాలా దుఃఖం వచ్చింది. నా నలుగురు స్నేహితురాళ్ళు ముందే వెళ్ళిపోయారు. ఉన్న ఒక్క ఆమె కూడా ఈ రోజు వెళ్ళిపోతుంది.

## 25 ఫిబ్రవరి, 2009

అమ్మ అనారోగ్యంగా ఉంది. నాన్న ఏదో సమావేశం కోసం స్వాత్ విడిచి వేరే ఊరికి వెళ్ళాడు. అందుకని ఉదయం పూట అల్పాహారం నేనే చేశాను. తర్వాత పాఠశాలకెళ్ళాను. ఈ రోజు మేము క్లాస్‌లో చాలా అల్లరి చేశాం. గతంలో లాగే ఆడుకున్నాము. ఈ మధ్య హెలికాప్టర్లు కూడా ఎక్కువ తిరగడం లేదు. మేము కూడా సైనికులు, తాలిబాన్ల గురించి మాట్లాడటం తగ్గింది. సాయంత్రం నేను, అమ్మ, మా కజిన్ బుర్ఖాలు వేసుకొని బయటికి వెళ్ళాము. ఒక కాలంలో నాకు బుర్ఖా ధరించడం చాలా ఇష్టంగా ఉండేది. కాని ఇప్పుడు దీంతో చిరాకు పుట్టుకొస్తోంది. ఎందుకంటే దీంతో నేను నడవలేను.

స్వాత్‌లో ఈ మధ్య ఒక మహిళ, షటిల్‌కాక్ బుర్ఖా (తలపాగా ఉన్న బుర్ఖా) ధరించి వెల్తున్నపుడు దారిలో కింద పడిపోయింది. ఈ విషయం చుట్టుపక్కల చాలా ప్రచారం అయ్యింది. ఒక అపరిచితుడు ఆమెను లేపబోయాడు. దాంతో ఆమె “వద్దు సోదరా! నన్ను లేపొద్దు, నేనిలా ఉంటేనే ఫజల్‌ఉల్లాహ్‌కి కడుపు చల్లబడుతుంది” అంది. మేము మార్కెట్లో ఎప్పుడూ వెళ్ళే దుకాణానికి వెళ్ళాము. దుకాణదారుడు నవ్వుతూ “ మీరు ఆత్మాహుతి దాడులు చేయడానికైతే రాలేదు కదా? భయపడిపోయాను” అన్నాడు. ఆయన అలా ఎందుకు అన్నాడంటే గతంలో ఒకటి రెండుసార్లు ఇటువంటి బుర్ఖాలు వేసుకొని ఆత్మాహుతి దాడులు చేశారు కనుక.

## 27 ఫిబ్రవరి, 2009

ఈ రోజు పాఠశాలకు వెళ్తే నా ఇద్దరు స్నేహితురాళ్ళు వచ్చారు. వారిని చూసి నాకు చెప్పలేనంత సంతోషం కలిగింది. దాడుల సమయంలో ఇద్దరూ రావల్సిండి

వెళ్ళిపోయారు. రావల్పిండిలో శాంతి కూడా ఉంది, అలాగే అన్ని విధాలా సౌకర్యాలు ఉన్నాయని వారు చెప్పారు. అయినా మేము స్వాత్‌లో శాంతి ఎప్పుడు వస్తుంది. మా పాఠశాలలు ఎప్పుడు తెరుస్తారు. మేము స్వాత్‌కి ఎప్పుడు రావాలి అనే ఎదురు చూశాము. ఇప్పుడు మా ఉపాధ్యాయురాలు మాకు పాఠం చెబుతూ ఉదాహరణ కోసం ప్రతీసారి చహర్‌బాగ్ ప్రాంతం గురించే మాట్లాడుతోంది. అయితే మీరు ప్రతీసారి చహర్‌బాగ్ పేరు ఎందుకు తెస్తున్నారని అడిగాను. దానితో ఆమె నేను చహర్‌బాగ్‌లో ఉండేదాన్ని. అక్కడ మోటర్ బాంబులు పడేవి. దాంతో మేము మింగోరా వచ్చాము అని చెప్పింది. ఇప్పుడు మా చహర్‌బాగ్ గుర్తుకొస్తుంది అంటుంది. అందుకే నా నాలుకపై అదే ఆడుతోంది అని చెప్పింది.

## 2 మార్చి, 2009

మా క్లాసులో అమ్మాయిల సంఖ్య మెల్లమెల్లగా పెరుగుతోంది. ఈ రోజు 27 మందిలో 19 మంది అమ్మాయిలు వచ్చారు. 9 మార్చి నుండి పరీక్షలు మొదలు కాబోతున్నాయి. అందుకని మేము ఎక్కువ సమయం చదువుకే కేటాయిస్తున్నాము.

ఈ రోజు మహిళలతో కలిసి చీనా మార్కెట్‌కి వెళ్ళాను. అక్కడ నేను చాలా షాపింగ్ చేశాను. ఎందుకంటే అక్కడ ఒక దుకాణదారుడు దుకాణం మొత్తం తీసేస్తున్నాడు. అతను తక్కువ ధరలకు సరుకులు అమ్ముతున్నాడు. ఇప్పుడు చీనా మార్కెట్‌లో కూడా చాలా దుకాణాలు మూతబడ్డాయి.

ఈ మధ్య మోటర్ బాంబుల శబ్దాలు కూడా ఆగిపోయాయి. రాత్రిపూట ప్రశాంతంగా నిద్రపోతున్నాం. తాలిబాన్లు ఇప్పుడు కూడా ఈ ప్రాంతంలో పరిస్థితులపై ఆరా తీస్తుంటారని ప్రచారం ఉంది. వారు ఇల్లు వాకిలి లేని పేద ప్రజల కోసం  సరఫరా అవుతున్న సరుకులు కూడా దోచుకుంటారు. పరిచయస్తుడొకరు ఒక రాత్రి తాలిబాన్లతో కలిసి వాహనాలను సోదా చేస్తుంటే చూసి తన తమ్ముడు ఆశ్చర్యపోయాడట... నా స్నేహితురాలు చెప్పింది. అతను ఉదయం పూట కూలీ చేస్తుంటాడు, రాత్రి పూట తాలిబాన్లతో కలిసి తిరుగుతాడు అని చెప్పాడట. నేను అతడిని కలిసి నువ్వు 'తాలిబాన్ కదా!? అలాంటి పని ఎందుకు చేస్తున్నావు?' అని అడిగాను. అయితే 'ఉదయం పూట కూలీ చేసి కొంత సంపాదిస్తాను. ఇంకా రాత్రిపూట తాలిబాన్లతో తిరుగుతాను. దాంతో

ఖర్చులన్నీ భరించగలుగుతున్నాను, ఇంట్లో అవసరమైన వస్తువులన్నీ పుష్కలంగా దొరుకుతాయి' అని సమాధానమిచ్చాడు.

## 3 మార్చి, 2009

నా చిన్న తమ్మునికి స్కూల్‌కెళ్ళడం ఇష్టముండదు. వాడు స్కూల్‌కెళ్ళే సమయంలో ఏడుస్తుంటాడు. తిరిగి వస్తున్నపుడు నవ్వుతాడు. కాని ఈ రోజు వచ్చేటప్పుడు ఏడ్చుకుంటూ వచ్చాడు. అయితే అమ్మ ఏడుపుకి కారణం అడిగింది. అయితే వాడు నాకు స్కూల్ నుంచి వస్తున్నపుడు భయం వేసింది అన్నాడు. ఎప్పుడైనా నాకు కొత్తవారు కనిపిస్తే వారు నన్ను ఎత్తుకెళ్ళి పోతారేమోనని భయం వేస్తుంది అన్నాడు.

నా చిన్న తమ్ముడు నిత్యం "ఓ భగవంతుడా, స్వాత్‌లో శాంతి చేకూర్చు. ఒకవేళ అది కాకుంటే అమెరికా లేదా చైనాను ఇక్కడికి తీసుకురా" అని ప్రార్థిస్తుంటాడు.

స్వాత్‌లో మళ్ళీ తాలిబాన్‌కు సైన్యానికీ మధ్య ఘర్షణ జరిగింది. కొన్ని రోజుల నుంచి ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇవ్వాళ నేను చాలా రోజుల తర్వాత మోటర్ బాంబుల శబ్దాలు విన్నాను. ప్రజల్లో శాంతి ఒప్పందంపై నమ్మకం సడలిపోవడం మొదలయ్యింది. కొంతమంది అయితే "నిజానికి శాంతి ఒప్పందం శాశ్వతంగా కాదు. ఇది కొంతకాలం యుద్ధానికి విశ్రాంతి ఇవ్వడం కోసమే" అని అంటున్నారు.

## 4 మార్చి, 2009

ఈ రోజు క్లాసులో టీచర్ మీలో ఎంత మంది ఎఫ్.ఎం. రేడియో వింటారు అని అడిగింది. అయితే చాలామంది అమ్మాయిలు ఇప్పుడు మేము ఎఫ్.ఎం. వినడం మానేశాం అని చెప్పారు. కొంతమంది అమ్మాయిలు ఇప్పటికీ వింటున్నారు. అమ్మాయిల నమ్మకం ఏమిటంటే ఎప్పటి వర్కకైతే ఎఫ్.ఎం. ఛానల్ ఆగిపోదో అప్పటి వరకు శాంతి అనేది లేదు.

ఈ రోజు మేమందరం బయటి పరిస్థితుల గురించి సమాచారం సేకరించడం కోసం బయటకి వెళితే ఆకాశంలో హెలికాప్టర్ కనిపించింది. మా పాఠశాల ఉన్న ప్రాంతంలో హెలికాప్టర్‌లు చాలా కిందిగానే ఎగురుతుంటాయి. అమ్మాయిలు సైనికులను చూసి కేకలుపెట్టారు. వారికి సమాధానంగా సైనికులు వారికి చేతులు ఊపి ఊపి అలిసిపోయినట్లు అనిపించింది. ఎందుకంటే గత రెండు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది.

## 9 మార్చి, 2009

ఈ రోజు నుంచి మా పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. మేల్కోగానే నాకు ఇబ్బందిగా అనిపించింది. అమ్మా నాన్న ఎవరో బంధువులు చనిపోయారని పరామర్శించటానికి ఊరికి వెళ్ళారు. అందుకని నేనే స్వయంగా ఇద్దరు తమ్ముళ్ళ కోసం అల్పాహారం తయారు చేశాను.

నా సైన్స్ పేపరు చాలా సులువుగా ఉంది. అందులో 10 ప్రశ్నలలో ఎనిమిదే రాయమన్నారు. కాని నాకు అన్ని ప్రశ్నలకు సమాధానం వచ్చు. ఆ తర్వాత నేను ఇంటికి రాగానే అమ్మా, నాన్నలు ఇంట్లో ఉండటం చూసి చాలా సంతోషపడ్డాను. తాలిబాన్ల జేర్–ఎ–కంట్రోల్ ఇలాఖా నుంచి ఊరికి వెళ్ళామని అమ్మ చెప్పింది. అక్కడ తాలిబాన్ సాయుధులు కనిపించారు. కాని వారు గతంలో లాగా మోటర్ వాహనాలు సోదా చేయలేదు.

## 10 మార్చి, 2009

ఈ రోజు నేను స్కూల్ నుంచి తిరిగి వస్తున్నపుడు నా స్నేహితురాలు ఒకామె కలిసి, సరిగా కప్పుకో లేకపోతే తాలిబాన్లు శిక్షిస్తారు అని చెప్పింది. ఈ రోజు కూడా మింగోరా పరిసర ప్రాంతమైన కంబర్‌లో రక్షక దళాలపైన కాల్పులు జరిగాయి. ఎఫ్.ఎం. ఛానల్‌లో మాట్లాడే తాలిబాన్ నాయకుడు మౌలానా షాహెద్ ఔరా కూడా ఈ రోజు తన ఊరు కంబర్ నుంచి తిరిగి వచ్చాడు. అక్కడి తాలిబాన్లు ఇతన్ని ఉపయోగించారని అంటూ ఉంటారు. తాలిబాన్లు ఇప్పటికే నమాజ్ చేయాలి, మహిళలు తప్పకుండా పరదా ధరించాలని కట్టడి చేశారు.

## 11 మార్చి, 2009

ఈ రోజు కూడా పరీక్ష బాగా రాశాను. రేపు సెలవు. చాలా సంతోషంగా ఉంది. ఈ రోజు నేను నా ఇద్దరు తమ్ముళ్ళు కోడిపిల్లలను కొనుక్కున్నాము. కాని నా కోడిపిల్లకు జలుబు చేసింది. ఇంకా దానికి జబ్బు కూడా చేసింది. అమ్మ దానిని వేడిగుడ్డలో చుట్టిపెట్టింది.

మార్కెట్‌కు వెళ్ళాను. అక్కడ చాలా రద్దీగా ఉంది. అక్కడక్కడ ట్రాఫిక్‌తో వాహనాలు ఎక్కువగా నిలిచిపోయాయి. గతంలో రాత్రి అయిన వెంటనే దుకాణాలు మూసివేసేవారు. కాని ఇప్పుడు చాలా సేపు దుకాణాలు తెరిచే ఉంచుతున్నారు.

ఈ రోజు నేను రేడియో పెట్టగానే ఆశ్చర్యమేసింది. ఎందుకంటే ఒక మహిళ ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ప్రేక్షకులు ఆమెకు ఫోన్‌చేసి ఇష్టమైన పాటలు కోరుకుంటున్నారు. ఇది ప్రభుత్వ ఛానల్ అని నాన్నగారు చెప్పారు. నేను చాలాకాలం తరువాత రేడియోలో ఇష్టమైన పాటలు విన్నాను. సుదూర ప్రాంతాల నుండి ప్రేక్షకులు ఫోన్‌లు చేస్తున్నారు. ఒక అబ్బాయి బెలుచిస్తాన్ నుండి ఫోన్ చేశాడు.

## 12 మార్చి, 2009

నాకు రెండు రోజుల నుండి గొంతు బాగోలేదు. వెంటనే నాన్న నన్ను డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళాడు. అక్కడ ఇద్దరు మహిళలు వేచి ఉన్నారు. ఆ ఇద్దరు కంబర్‌కి చెందిన వారు. ఇందులో ఒక ఆమె వారి ప్రాంతం నేటికీ తాలిబాన్ల ఆధీనంలోనే ఉందని చెప్పింది. ఈ రోజు కొంతమందిని శిక్షించారు కూడా. ఆ మహిళ తమ వీధిలోని ఒక అబ్బాయికి జరిగిన ఘటన గురించి వివరించింది. అతని పేరు అనీష్.

అతను తాలిబాన్లతో కలిసి ఉండేవాడు. ఒక రోజు తాలిబాన్ సభ్యుడు ఖాతున్ తనకు కల వచ్చిందని అందులో ఒక దేవదూత వచ్చి, మాకు అనీష్ కావాలని అడిగినట్లు అనీష్‌కి చెప్పాడు. దాంతో అనీష్ చాలా సంతోషపడ్డాడని చెప్పాడు. అనీష్ తన నాన్నతో దేవదూతలు తన కోసం ఎదురు చూస్తున్నారని చెప్పి ఆత్మాహుతి చేసుకొని చనిపోతానని చెప్పాడు. అతని అమ్మా, నాన్న దానికి అంగీకరించలేదు. అయితే అతను ఆఫ్ఘనిస్తాన్ వెళ్ళి జీహాద్ చేస్తానని చెప్పాడు.

అయితే మహిళ చెప్పిన దాని ప్రకారం ఆ అబ్బాయి ఇంటి వారు ఒప్పుకోలేదు. కాని అతడు మాత్రం ఇల్లు విడిచి పారిపోయాడు. సంవత్సరన్నర కాలం తరువాత స్వాత్‌లోని తాలిబాన్లు అతని ఇంటికి వెళ్ళి అనీష్ స్వాత్‌లోని రక్షక దళాలపై ఆత్మాహుతి దాడి చేసి ప్రాణాలు కోల్పోయాడని చెప్పారు.

# చర్చనీయాంశం

బ్లాగ్ రాయడంతో మెల్లమెల్లగా గుల్‌మకాయి స్వాత్‌కొండల్లో చర్చనీయాంశం అయింది. తాలిబాన్లకు తెలియని విషయం ఏమిటంటే, 11 సంవత్సరాల ఒక అమ్మాయి ఎవరో వారిపై నిర్భయంగా తిరగబడిందన్న వాస్తవం. ఆమె తాలిబాన్లకు వ్యతిరేకంగా వారి ఆగడాలు ఆపేందుకు సిద్ధమైంది. ప్రతి చోట ఆమె చర్చే జరుగుతుంది. అది ఏమిటంటే, ఆమె ఎవరు? అప్పటివరకు ఆమె గుర్తింపు, ఆమె అస్తిత్వం పరదా వెనక ఉన్నాయి.

ఆలోచనలలో ఇంత స్పష్టత, రచనల్లో ఇంత నిర్భయం ఉండాలంటే క్రూరమైన నిజాన్ని అర్థం చేసుకోవటానికి ఒక పరిణతి చెందిన జ్ఞానం అవసరమవుతుంది. కాని వాస్తవానికి మలాలా చిన్ననాటి నుంచే మంచి తెలివితేటలతో నిర్భయంగా ఆలోచించేది, దీనితో ఆమె రచనల్లో కూడా ఇంత నిర్భయత్వం ఉండటం సహజమే, ఆమె లక్ష్యం ఒక్కటే, తాలిబాన్లు చేసిన శాసనానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయడం, ముఖ్యంగా పాఠశాలలకు వెళ్ళి అమ్మాయిలను జాగృతం చేయడం. ఈ కారణంగానే తన డైరీ ద్వారా తాలిబాన్ల ఆదేశాలను పక్కకు పెట్టి ఆ ప్రాంతంలోని ప్రజలను అమ్మాయిల చదువు ఇంకా ఇతర సమస్యలపై చైతన్యం చేయటమే కాకుండా తాలిబాన్ల తీవ్రవాదానికి వ్యతిరేకంగా ప్రచారం చేసింది.

మే 2009లో సైనిక చర్య ప్రారంభం కాగానే, దానికంటే ముందే మలాలా ఆమె కుటుంబం స్వాత్ కొండలు విడిచి వెళ్ళిపోయారు. అప్పుడు పాకిస్తాన్ సైన్యం స్వాత్‌ను స్వాధీనం చేసుకుంది. అప్పుడు తిరిగి మింగోరా వచ్చారు. ఆమె తండ్రి జియావుద్దీన్ ఆమె అసలు పేరును అందరి ముందు తెలపాలని నిర్ణయించుకున్నాడు.

ఇది ఆయన ఎందుకు చేశారంటే మలాలా పేరు ఇప్పుడు అంతర్జాతీయ శాంతి పురస్కారానికి ఎన్నికయ్యింది.

తిరిగి వచ్చిన తరువాత మలాలా ఆమె అసలు పేరును బయటపెట్టింది. ఆ తరువాత ఈమె ఆ అమ్మాయే, బి.బి.సి. ఉర్దూ ఛానల్ కోసం బ్లాగ్ రాస్తూ ఉందని అందరూ తెలుసుకున్నారు. పాకిస్తాన్ ప్రభుత్వం జాతీయ శాంతి పురస్కారం ఇచ్చింది. ఆమె ఆ తర్వాత సాధారణ ప్రజానీకం మధ్య తన మాటలు వినిపించటానికి వారిని కలుస్తూ ఉంది. అమ్మాయిల విద్యా హక్కు కోసం పోరాటం చేసే అమ్మాయిగా ఆమె పేరు చర్చనీయాంశం అయ్యింది. పాకిస్తాన్ బయట కూడా ఆమె గురించి గొప్పగా చెప్పుకున్నారు.

ఇది మింగోరా నుండి వెళ్ళక ముందు జరిగిన సంఘటన. ఒక రోజు సంగతి. అది మధ్యాహ్నం సమయం. మలాలా భోజనం చేసి పుస్తకం చదువుకోవటానికి కూర్చుంది. ఆమె స్కూల్స్ తెరిచే వరకు ఇంట్లోనే ఉండి బాగా చదువుకోవాలని ఆలోచిస్తుంది.

ఆమెలో ఉన్నటువంటి ఆందోళన దాదాపు పూర్తిగా శాంతించింది. చదువు కుంటూ, చదువుకుంటూనే ఆమె కనురెప్పలు మూసుకుపోతున్నాయి. అప్పుడు మింగోరా వీధుల్లో తూటాలు పేలుతున్న శబ్దం వినిపించింది. ఆమె ఇద్దరు తమ్ముళ్ళు పడుకొని ఉన్నారు. జియావుద్దీన్ యూసుఫ్‌జాయి మలాలా భుజాలు తడుముతూ 'భయపడవలసిన విషయం ఏమిలేదు ఇవి శాంతి కోసం పేల్చుతున్న తూటాలు'అని చెప్పాడు. ఇంకా జియావుద్దీన్ ఆమెతో ఇలా చెప్పాడు... తను పత్రికలో చదివిన దాని ప్రకారం ప్రభుత్వం తీవ్రవాదులతో ఒప్పందం కోసం చర్చలు జరుపుతుంది.

ఇది విన్న మలాలాకు సహజంగానే నమ్మకం కుదరలేదు. తాలిబాన్లు ఏ విధంగాను నమ్మశక్యం కారు. అటువంటి క్రూరమైన హంతకులను విశ్వసించటమంటే మనల్ని మనమే మోసం చేసుకున్నట్లు. కాని ఆ రోజు రాత్రి తాలిబాన్లు ఎఫ్.ఎం. రేడియోలో శాంతి ఒప్పందం గురించి ప్రకటించినప్పుడు మళ్ళీ తూటాలు పేల్చుతున్న శబ్దం వచ్చింది. ఆ సమయంలో మలాలా తన బ్లాగ్‌లో వ్రాసింది. "ప్రజలు ఎక్కువగా ప్రభుత్వం మాటకంటే ఉగ్రవాదుల మాటలనే నమ్ముతున్నారు."

పై ప్రకటన వినగానే జియావుద్దీన్, మలాలా, వాళ్ళ అమ్మా, ఇద్దరు తమ్ముళ్ళ కళ్ళనుండి నీళ్ళు వచ్చాయి. మలాలా ఇప్పటికీ విశ్వసించలేక పోతుంది. అయినా, తనలో ఒక రకమైన నమ్మకం కలిగింది. ఇప్పుడైన అన్నీ చక్కబడతాయి అనుకుంది. ఆమె తన అమ్మను కౌగిలించుకుని వాళ్ళ నాన్నతో " నాన్న ఇప్పుడు నేను పాఠశాలకు వెళ్ళగలను, ఇది జరుగుతుంది కదా? మన స్వాత్ మళ్ళీ ఇంకొకసారి వెలుగులు చిమ్ముతుంది. పాఠశాలలు తెరుచుకుంటాయి, మేము చదువుకుంటాము. మాకు మా హక్కులు దక్కుతాయి" అని చెప్పింది.

జియావుద్దీన్ తన కూతురి తల నిమరడం తప్ప ఏమీ చేయలేక పోయాడు. అసలు ఆయన చెప్పడానికి కూడా ఏముంది. సంవత్సరాల నుండి తాలిబాన్ల విషాన్ని దిగమింగుతున్నాడు.

మలాలా స్కూల్‌కి వెళ్ళాలని ఎన్నో కలలు కంటుంది. అనుకున్న పుస్తకాలన్నీ నిరంతరంగా చదువుకుంటుంది. ఆమె తన స్నేహితురాళ్ళతో కూడా పాఠశాలకు వెళ్ళటానికి సిద్ధం కమ్మని చెబుతుంది. కొన్ని రోజుల తరువాత తాలిబాన్ల నాయకుడు మౌలాన ఫజల్ ఉల్లాహ్ అమ్మాయిల చదువుపై ఉన్న నిషేధాన్ని తొలగిస్తూ ప్రకటన చేశారు. ఇక అమ్మాయిలు మార్చిలో జరగబోయే వార్షిక పరీక్షలు అయ్యేంత వరకు పాఠశాలకు వెళ్ళవచ్చు, కాని వారు తప్పకుండా బురఖా ధరించాలని నిబంధన పెట్టాడు.

ఈ ప్రకటన తర్వాత ఇప్పుడు ఆమె కన్న కలలను నిజాలుగా మలుచుకోవచ్చనే నమ్మకం వచ్చింది. ఆ రోజు ఆమె తన స్నేహితురాలితో చాలా సంతోషంగా గడిపింది. వారందరు కలసి ఆడుకోవడానికి అల్లరి చేయటానికి ఉబలాటపడుతున్నారు. మధ్యాహ్నం ధార్మిక విద్యను బోధించే ఉపాధ్యాయురాలు వచ్చింది. మలాలా ఆమెతో కూర్చొని చాలాసేపు చర్చించింది.

మలాలా, ఆమె టీచర్ ఇద్దరూ కూడా బుర్ఖా వేసుకునే విషయంపై అయిష్టంగా ఉన్నారు. కాని మహిళలు చదువుకోవటానికి పాఠశాలలకు వెళ్ళకూడదనే నిబంధనను ఎత్తివేయడంపై సంతోషించారు. కాని మలాలా బుర్ఖా విషయంలో మాత్రం ఎవరెంత చెప్పినా కూడా రాజీపడకుండా 'నేను బుర్ఖా ధరించను, తాలిబాన్లు ఏం చేసుకుంటారో చేసుకోనివ్వండి, ఈ విధంగా వారు మన గుర్తింపును దాచేసి మనల్ని చీకట్లో నెట్టివేయలేరు.'

ఆమె మాటలు విని జియావుద్దీన్ సమర్థించాడు. కాని తన అమ్మా, టీచర్ భయపడిపోయారు.

టీచర్ వాళ్ళ అమ్మతో 'ఏ అల్లా ఈ అమ్మాయికి ఎటువంటి సమస్య రానీయకుండా చూడు. తాలిబాన్లకు వ్యతిరేకంగా పోవడమంటే చావుకు ఎదురెళ్ళడమే' అంది. టీచర్ మాటలు విని వాళ్ళ అమ్మ ఆమెకు చాలా నచ్చచెప్పింది. నీవు తప్పకుండా పాఠశాలకు బురఖా వేసుకునే వెళ్ళాలి. కాని దృఢంగా నిశ్చయించుకున్న మలాలాకి ఆమె నిర్ణయాన్ని మార్చుకోవడం అంత సులువైన పని కాదు. ఆమె ఒక్కసారి నిర్ణయించుకుంటే దాన్ని తప్పకుండా ఆచరించి తీరుతుంది.

ఇప్పుడు అమ్మాయిల్లో ఎంత భయం ఉందంటే చాలా తక్కువమంది స్కూల్‌కి వస్తున్నారు. తాలిబాన్లు ఎప్పుడైన దారిలో కనబడి ఎత్తుకెళ్ళిపోతారేమోనని, ముఖంపై యాసిడ్ పోస్తారేమోనని వారు భయపడుతున్నారు. అలా చేయడం ఆ తీవ్రవాదులకు చాలా తేలికైన పనే.

వార్షిక పరీక్షలు దగ్గరపడ్డాయి. పాఠశాలలు మూసి ఉండటంతో పరీక్షలకు సిద్ధం కాలేకపోయారు. ఆమె స్నేహితురాళ్ళు కూడా పాఠశాలకు రావటానికి సిద్ధంగా లేరు. ఎందుకంటే ఆ ప్రాంతంలో తాలిబాన్లు ఏ పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఇంకా వాళ్ళు ఆయుధాలతో తిరుగుతున్నారు. మలాలా విద్యార్థులందరినీ ప్రోత్సహిస్తూ పాఠశాల మానివేయడం కంటే తీవ్రవాదులను ఎదిరించడం నేర్చుకోండి అని చెబుతోంది. అయినా వారి లోపల ఉన్న భయాన్ని తీసివేయలేకపోతున్నారు. ఆమె ఇంటింటికి వెళ్ళి విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుంది. కాని రెండు మూడు రోజుల తర్వాత పాత పరిస్థితే కొనసాగింది. తండ్రి మలాలాతో శాంతి ఒప్పందం రద్దు అయ్యిందని చెప్పాడు. ఆ సమయంలో మలాలా బ్లాగ్‌లో రాసింది. "సైనికులు తాలిబాన్ల మధ్య యుద్ధం జరిగింది. తూటాలు పేలుస్తున్న శబ్దాలు వచ్చాయి. ప్రజలు ఇంకా భయభ్రాంతులకు గురయ్యారు. ఇక శాంతి నిరంతరాయంగా ఉండదు. కొంతమంది అయితే శాంతి ఒప్పందం కాదు, తిరిగి యుద్ధం మొదలవుతుందని నమ్ముతున్నారు."

శాంతి ఒప్పందంపై ఎటువంటి ఆశలు కనిపించడంలేదు. ఇంకా మలాలాకు లోలోపల అసహనం పెరుగుతూ ఉంది. తాత్కాలిక రాష్ట్రపతి అసిఫ్ అలీ జర్దారీ చట్టంలో ఒక వివాదస్పదమైన నిబంధనపై సంతకం చేశాడు. ఇందులో అన్నింటికంటే ముందు స్వాత్ ప్రాంతంలోని ధార్మిక చట్టాన్ని కట్టుదిట్టం చేశారు. దీనికి మద్దతు లభించింది. "తహరీ-ఏ-షరీయత్-ఏ-మహ్మదీ సంస్థాపకులు సూఫీ మహ్మద్ దీనిని పూర్తిగా సమర్థించాడు. ఇప్పటి నుండి మహిళలు మార్కెట్‌కి, ఉద్యోగానికి వెళ్ళకూడదని ప్రకటన జారీచేశారు."

ప్రభుత్వానికి తాలిబాన్లకు మధ్య దాడులు నిత్యం పెరుగుతున్నాయి. అందుకోసం ప్రభుత్వానికి అన్ని జిల్లాల్లోనూ సైన్యంతో ఆపరేషన్ ప్రారంభించాల్సి వచ్చింది. పాకిస్తానీ సైన్యం స్వాత్ కొండల్లో మరో యుద్ధానికి సిద్ధపడి నలువైపుల నుంచి చుట్టుముట్టారు. మింగోరా నుంచి అందరిని పంపించేశారు. యూసుఫ్‌జాయి కుటుంబం అంతా విడిపోయింది. జియావుద్దీన్ ఈ విషయంపై ఆందోళన చేయడానికి పెషావర్ వెళ్ళిపోయాడు. అప్పుడు మలాలాను తన తల్లి, ఇద్దరు తమ్ముళ్ళను తోడిచ్చి బంధువుల దగ్గరకి ఒక గ్రామానికి పంపించేశారు. అయితే అక్కడ "నా మనసు అసలే స్థిరంగా లేదు ఎందుకంటే అక్కడ చదువుకోవడానికి పుస్తకాలు లేవు" అనేది.

అయితే కేవలం జియావుద్దీన్ కుటుంబం మాత్రమే విడిపోలేదు. అ సమయంలో పిల్లలు, పెద్దలు మహిళలు, వృద్ధులు వేలమంది స్వాత్ నుంచి వెళ్ళిపోతున్నారు. కొందరి భుజాలపై సామానులతో బరువైన సంచులు ఉంటే, కొందరి భుజాలపై చిన్న పిల్లలు కనిపిస్తారు. తాలిబాన్‌కు ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న గొడవ సామాన్య ప్రజలకి మరుపురాని వ్యథగా తయారైంది. పాకిస్తాన్ ప్రభుత్వానికి రాబోవు కాలంలో తాలిబాన్లతో విభేదాలు ఇంకా ముదిరిపోనున్నాయి అని చాటి చెప్తుంది. కష్టాలు తొలగిపోయే పరిస్థితులు కనిపించడంలేదు. మారుతున్న పరిస్థితులను చూస్తూ పాలకులే ప్రజలను వెంటనే మింగోరా వదిలేసి వెళ్ళిపోవాలని చెప్పారు.

స్వాత్‌లో కర్ఫ్యూ మొదలైంది. పాలకులు చేసిన విజ్ఞప్తిని ఎలా పాటించాలో ప్రజలకు అర్థం కావడం లేదు. ప్రభుత్వం కర్ఫ్యూను మధ్యలో ఆరు గంటలు సడలించినపుడు ప్రజలు వెంటనే పరుగెత్తడం మొదలు పెట్టారు. పోలీసులు ముఖ్య కూడళ్ళు, విద్యుత్ స్టేషన్లు, సర్క్యూట్ హౌజ్ ఆక్రమించుకున్నారు.

స్వాత్ కొండల్లో మూడు మాసాల పాటు సైనికులు తాలిబాన్ దుండగుల మధ్య నిరాయుధ పోరాటం జరుగుతునే ఉంది. దాని తర్వాత పాఠశాలల్లో చదువులు తిరిగి ప్రారంభమయ్యాయి. దీంతో తాలిబాన్ల పాలన పూర్తిగా నీరుగారిపోయింది.

యూసుఫ్‌జాయి కుటుంబం మూడు మాసాల పాటు ఇలాగే విడిపోయి స్వాత్‌కి దూరంగా ఉండాల్సి వచ్చింది. స్వాత్‌కొండలకు తిరిగి రావచ్చు అని ఒకరోజు ప్రధానమంత్రి ప్రకటించినట్లు తెలిసింది. అక్కడ ఇప్పుడు సురక్షితమైన వాతావరణం ఏర్పడింది. పాకిస్తాన్ సైన్యం తాలిబాన్లను స్వాత్ నుంచి పూర్తిగా బయటకి పంపివేశారు. మూడుమాసాలు విడిగావున్న తర్వాత యూసుఫ్‌జాయి కుటుంబానికి తిరిగి కలిసి ఉండే అవకాశం వచ్చింది. మలాలా, తన ఇద్దరు తమ్ముళ్ళు ఎప్పటిలానే కీచులాడుతున్నారు. ఒకవైపు నాన్నతో కలుస్తున్నామనే సంతోషం, మరోవైపు తమ స్వాత్‌కి తిరిగివెళ్తున్నామన్న సంతోషం వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తమ ఇల్లు, వీధి, స్నేహితులు... అందరినీ కలవరించే మలాలా జులై 24, 2009న స్వాత్‌కు తిరిగి వచ్చింది.

# రాజకీయ జీవితం

అల్లకల్లోలంగా, నిత్యం భయభ్రాంతులతో కాలం గడిచిన తర్వాత స్వాత్ లోయలో శాంతియుత వాతావరణం, సుఖసంతోషాలు నెలకొన్నాయి. తిరిగి వచ్చిన వెంటనే మళ్ళీ గతంలోలా మలాలా క్రియాశీలక కార్యక్రమం ప్రారంభమయింది. ఆమె చేతులు ముడుచుకుని సుఖంగా కూర్చునేవాళ్ళతో సమానం కాదు. ఆమెకు ముందే తెలుసు. తాలిబాన్లు ఇంత తొందరగా ఓటమిని ఒప్పుకోరని, వాళ్ళు ఖాళీగా కూర్చోరని.

మలాలా ఏదో ఒక  కార్యక్రమంలో లీనమై అది పూర్తి అయ్యేంత వరకు ఉరుకులు పరుగులు తీస్తూ పూర్తి చేస్తుంది. సామాజిక విషయంలో అయితే మహిళలకు చదువు కోసం ప్రతిజ్ఞ చేసింది. కాని ఇప్పుడు రాజకీయ జీవితం ప్రారంభమయ్యింది.

22 డిసెంబర్, 2010లో ఒక వీడియో – పిల్లలు కిక్కిరిసి పోయిన అసెంబ్లీలో మలాలా ప్రవేశిస్తుంది. ఆమెను చూడగానే పిల్లలంతా కరతాళధ్వనులు చేస్తారు. ఆమె వేదికపై కుర్చీలో కూర్చుంటుంది. ఆమె వెనకాల ఒక బ్యానర్ ఉంది. దానిపై "డిస్ట్రిక్ట్ చైల్డ్ అసెంబ్లీ స్వాత్". ఆ అసెంబ్లీని ఖపాల్ కోర్ ఫౌండేషన్ ద్వారా యూనిసెఫ్ సౌజన్యంతో స్థాపించారు. దీని ఉద్దేశం యువకుల మరియు బాలల హక్కులకు సంబంధించిన సమస్యలపై పోరాడే అవకాశం వారికే ఇవ్వాలని,  ఆ సమస్యలను పరిష్కరించుకోడం ఎలాగో నేర్పాలని.

2009వ సంవత్సరంలో ఖఫాల్ కోర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పడి యూనిసెఫ్ నిధులతో నిర్వహించబడే ఈ డిస్ట్రిక్ట్ చైల్డ్ అసెంబ్లీలో విభిన్న పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మలాలాను చైర్‌పర్సన్ హోదాలో ఆహ్వానించారు. అప్పుడు మలాలా మాట్లాడుతూ "ఎక్కడైతే తాలిబాన్లు మన పాఠశాలలు ధ్వంసం చేశారో వాటన్నింటిని మనందరం పునర్ నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ పాఠశాలలకు వెళ్ళలేని పిల్లలు వేల సంఖ్యలో ఉన్నారు. దీని గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం

బాధకరమైన విషయం. కొంతమంది పిల్లలు వణికిపోయే చలిలో టెంట్‌ల కింద కూర్చుని చదువుకోవాల్సి వస్తుంది.” ఒక గొప్ప దర్శకుడు ఆడమ్ ఎలక్ మలాలా భావాలను తెలుసుకొని డాక్యుమెంటరీ ఫిలిం తీయాలని నిర్ణయించుకున్నాడు.

ఆడమ్ ఎలిక్ న్యూయర్క్ టైమ్స్ డాక్యుమెంటరీ “క్లాస్ డిస్‌మిస్డ్”లో స్వాత్‌లోని పాఠశాలల మూసివేత మాత్రమే కాకుండా, స్వాత్‌లోని జీవన పరిస్థితుల గురించి కూడా చూపించారు. ఎందుకంటే దాదాపు కోటిమంది నివాసితులు సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్ళారు. టి.టి.పి. నుండి కాపాడుకోవటానికి జనం ఎలా పారిపోతున్నారో ఆ దృశ్యాలను ఇందులో బంధించారు. జియావుద్దీన్ యూసుఫ్‌జాయి ఈ డాక్యుమెంటరీ తయారు చేయటానికి సహకరించాడు. పాఠశాలలను ఈ డాక్యుమెంటరీలో పాకిస్తానీ సైనికులు మూసివేసిన కోటల్లా చూపించారు. ఇంకా బాంబుల దాడిలో భవనాలు ఎలా ధ్వంసం అయ్యాయో కూడా చూపించారు. డాక్యుమెంటరీ ముగింపులో మలాలాను పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ రాష్ట్రపతులతో ఇంకా అమెరికా రాష్ట్రపతి ఒబామా మొదలైన ముఖ్య ప్రతినిధుల మధ్య కలిసి కూర్చున్నట్లు, చదువుకు సంబంధించిన సహాయం అమెరికాను అడుగుతున్నట్లు చూపించారు. ఈ దృశ్యం ఉద్దేశం ఏమిటంటే మలాలా దృఢవిశ్వాసాన్ని చూపించడం, విద్యా వ్యవస్థ తాలిబాన్ల హెచ్చరికలతో నలిగిపోవడం గురించి చూపించడం. ఇది ప్రాధాన్యత  సంతరించుకుంది.

మలాలా తన విభిన్న విజ్ఞప్తులను బ్లాగ్‌ల రూపంలో రాయడం వల్ల, వాటిని పాకిస్తాన్ టి.వి.లో ప్రసారం చేయడం వల్ల ఒక ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. ఇంకా ప్రజలు ఆమె కార్యక్రమాలను ప్రశంసిస్తూ బాగా చర్చించుకోవడం కూడా తెలిసిన విషయమే. ఆమె కార్యక్రమాల గురించి తెలుసుకుంటున్న వారంతా ఒక అమ్మాయి ఇంత గొప్ప పని చేయగలిగిందా? అని ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంకొందరు తాలిబాన్లకు సరితూగే   ఉక్కుమనిషిగా భావించారు. వారు అనుకునేవారు, ఈ అమ్మాయి నిజంగానే ఏదో ఒక రోజు తనను తాను నిరూపించుకుంటుంది. విభిన్న సంస్థలు ఆమె కార్యక్రమాలను, ముఖ్యంగా పిల్లలకు సంబంధించిన కార్యక్రమాలను అంగీకరించాయి.

మలాలా ‘ఇన్‌స్టిట్యూట్ ఫర్ వార్ అండ్ పీస్ రిపోర్టింగ్’లో ‘ఓపెన్ మైండ్స్ ప్రాజెక్ట్’లో పాల్గొనడం ప్రారంభించింది. ఈ ప్రాజెక్ట్ యొక్క లక్ష్యం పాకిస్తాన్‌లోని 42 పాఠశాలల్లో జర్నలిజం ట్రైనింగ్ ఇవ్వడం, అలాగే సమకాలిన సమస్యలపై చర్చావేదికలు నిర్వహించడం, ఏదో ఒక పరిష్కారాన్ని కనుగొనడం. తన బహిరంగ ఆలోచనలు,

సమస్యలకు సరిపోయే సమాధానాలు ఇవ్వడంలో మలాలా దాదాపు తన లక్ష్యాన్ని చేరుకొని సఫలీకృతం అయ్యింది. ఆమె సఫలం కావడం అనేక మంది ప్రజలకు ప్రేరణ కల్పించింది. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనే ఉత్సాహం ప్రజలలో నిండింది. ఇటువంటి వారిలో అమ్మాయిల సంఖ్య బాగా పెరిగింది. 'ఓపెన్ మైండ్'తో ఉండే యువకులు ఆ సమస్యలపై రాయడాన్ని ప్రోత్సహించడం కోసం, చర్చాగోష్ఠులు నిర్వహించడం కోసం క్లబ్బులను స్థాపించారు.

ప్రజలు సమర్థించడంతో మలాలా ఇప్పుడు ఇంకా ధైర్యంగా మాట్లాడ గలుగుతోంది. ఒక రోజు ఆమె జి.ఓ. టి.వి. స్టార్ యాంకర్ యమీద్‌మీర్ కొత్త షోలో కనిపించింది. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుండి ఆమె ఉన్న పట్టణం బాంబుల దాడులతో ఎలా దద్దరిల్లిపోతుందో వివరించింది. మీర్ ఆమెను ప్రశ్నిస్తూ "నీవు ఏమి కావాలనుకుంటున్నావు" అని అడిగింది.

మలాలా ఈ ప్రశ్న వినగానే చిరునవ్వు నవ్వింది. నిత్యం భయంకరమైన వాతావరణంలో అమ్మాయిలు చదువుకోవటాన్ని నిషేధించిన పరిస్థితుల్లో, ముందున్న అనిశ్చిత భవిష్యత్తులో మలాలా దృఢవిశ్వాసంతో "నేను రాజకీయ నాయకురాలు కాదలచుకున్నాను, నా దేశం కష్టాల్లో ఇరుక్కొని ఉంది. మా రాజకీయ నాయకుల అలసత్వాన్ని పోగొడతాను. ఇంకా దేశసేవ చేస్తాను." ఇది చెబుతున్న మలాలా కళ్ళు మెరిసిపోయాయి.

కొంతకాలం తర్వాత మలాలా "ఏ మార్నింగ్ విత్ ఫరాహ్" పేరు గల టాక్ షో ప్రోగ్రాంలో పాల్గొంది. ఆమె ఆ సమయంలో లేతరంగు డ్రెస్, తలపై స్కార్ఫ్ ధరించి ఉంది. ఫరాహ్ హుస్సేన్ ఆమెతో చర్చిస్తూ నీ ఉర్దూ చాలా బాగుంది అని ప్రశంసించింది.

ఇది వినడంతో గులాబీరంగులో ఉన్న మలాలా చెంపలు ఇంకా గులాబీరంగులోకి మారిపోయాయి. ఆమె నవ్వినపుడు ఆ బుగ్గలపై పడే చిన్ని సొట్టలతో ముద్దులొలికే ఆ అమ్మాయిలో మెదులుతున్న అసంఖ్యాక ప్రశ్నలన్నీ కొన్ని క్షణాలు మటుమాయం అయ్యాయి. కాని మరుక్షణమే ఫరాహ్ తాలిబాన్ల గురించి గుర్తుచేయగానే ఆమె ముఖం కోపంతో రగిలిపోయింది. ఆమె గంభీరమైన స్వరంతో అన్నది "ఇప్పుడు తాలిబాన్లు వస్తే నేను నా చెప్పు తీసి వారి ముఖంపై కొడతాను. నేనే కాదు నా స్నేహితులు కూడా తాలిబాన్లను రాక్షసుల కంటే భయంకరమైన వారిగా భావిస్తారు. ఎందుకంటే వారు తమని తాము స్వయంగా దేవదూతలు అనుకునే మూర్ఖులు."

గుల్‌మకాయి ఎవరో ముందే బయటపడింది. తాలిబాన్లు ఇది తెలుసుకొని, ఒక అమ్మాయి తమకు వ్యతిరేకంగా నిప్పులు చెరుగుతుందా? అని ఆక్రోశించారు. వారు ఆమెపై  అసహనంగా ఉన్నారు. అప్పుడు తాలిబాన్ నాయకుడు ఒకతను ఈ అమ్మాయిని మనం మన దారి నుండి తొలిగించాల్సిన అవసరం ఉందని అన్నాడు.

మలాలా యూసుఫ్‌జాయి, ఆమె తండ్రి జియావుద్దీన్‌కు తాలిబాన్లు హెచ్చరికలు ప్రారంభించారు. వాళ్ల సొంత పాఠశాల భవనంపై రాళ్ళు రువ్వడం మొదలు పెట్టారు. ఇది తెలిసిన ప్రభుత్వం వారికి రక్షణ కల్పించటానికి ముందుకు వచ్చింది. కాని జియావుద్దీన్ దాన్ని నిరాకరించాడు. కాని మలాలా సహకారం తీసుకున్నాడు. జియావుద్దీన్ ప్రభుత్వం సహకారాన్ని తిరస్కరిస్తూ "తుపాకులు నలువైపుల నుండి చుట్టుముట్టి ఉండేట్లయితే పాఠశాలలో సాధారణ వాతావరణం దెబ్బ తింటుంది" అన్నాడు. మలాలా తాలిబాన్ల హెచ్చరికలకు భయపడలేదు. వ్యతిరేకంగా మాట్లాడటం మానేయలేదు. అలాగే ఆమె బహిరంగంగా వారిని వ్యతిరేకించేందుకే సిద్ధమయ్యింది.

పాఠశాల సెలవులు వచ్చేశాయి. ప్రతీ సంవత్సరంలాగే ఈసారి కూడా జియావుద్దీన్ విద్యార్థులను మర్గాజర్‌లోని జలపాతం చూపించడానికి తీసుకు వెళ్ళాలనుకున్నాడు. మర్గాజర్ పదానికి అర్థమేమంటే ఆకుపచ్చని కొలను. ఇది వాస్తవంగా కూడా అలాగే ఉంటుంది. పవిత్రమైన పర్వతం, ఆహ్లాదకరమైన వాతావరణం, చల్లని నీటి అలలు, సువాసనలు వెదజల్లే పూలగుత్తులు, పచ్చ పచ్చని చెట్లు... అందరి మనసును ఆకట్టుకుంటాయి.

ఒకరోజు ఎవరో వారి పాఠశాలలో కరపత్రాలు విసిరారు. అందులో "మీరు మా అమ్మాయిల భవితను కాలరాస్తున్నారు. పిక్నిక్ రిసార్ట్‌కి తీసుకెళ్ళి అశ్లీలతను ప్రేరేపిస్తున్నారు. అక్కడ వారిని పరదాలు లేకుండా తిప్పుతున్నారు" అని రాసి ఉంది.

అయినా జియావుద్దీన్ భయపడలేదు. విద్యార్థులందరినీ మర్గాజర్‌కి  తీసుకెళ్ళాడు. మలాలా, ఆమె స్నేహితులు ఇతర విద్యార్థులు చాలా సంతోషపడ్డారు. ఎందుకంటే చాలాకాలం తర్వాత స్వేచ్ఛవాయువులు పీల్చుకోబోతున్నారు.

ఒకరోజు ఉదయం తెల్లవారకముందే ఇంటి దర్వాజ కొట్టినట్లు చప్పుడు వచ్చింది. జియావుద్దీన్ నిద్రమత్తులోనుండి మేల్కొన్నాడు. తమ ఇంటిపై తాలిబన్లు దాడిచేయడానికి వచ్చి ఉంటారని భావించాడు. అయినా ధైర్యం చేసి తలుపు తీసాడు. అక్కడ తన తమ్ముడు అకీల్ యూసుఫ్‌జాయి నిల్చుని కన్పించాడు. తన తమ్ముడిని చూసిన జియావుద్దీన్

ఆశ్చర్యపోయాడు. కానీ ఏదో ముఖ్యమైన పని వుండి వచ్చాడు అనుకున్నాడు. తన ముఖంలో కూడా ఆందోళన కన్పిస్తుంది. అకీల్ తనను ఎవరూ గమనించడం లేదు కదా! అన్నట్లు అటు ఇటు చూశాడు.

జియావుద్దీన్ అతని భుజంపై చేయిని వేశాడు, అతనికి ధైర్యం చెప్పుతున్నట్లు. ఆ తర్వాత "ఏమైంది అకీల్, ఇంత కంగారుగా ఉన్నావెందుకు? ఇంట్లో అంతా బాగానే ఉన్నారు కదా" అని అడిగాడు.

"అన్నయ్యా! నా గురించి ఆలోచించకండి, నాకు కేవలం మలాలా గురించే ఆలోచన. నేను నీకు చెప్పేది ఒక్కటే. మలాలాను బహిరంగంగా మాట్లాడవద్దని చెప్పు. ఒకవేళ ఇలా చేయకుంటే, మలాలా ఒప్పుకోకుంటే నువ్వు ఈ దేశం విడిచి వెళ్ళిపోవడమే ఉత్తమం. ఆమె ప్రాణాలకు అపాయం పొంచి ఉంది. ఆమె మాటలు తాలిబాన్లకు వ్యతిరేకంగా ప్రజలతో నిప్పులు చెరిగిస్తున్నాయి. తాలిబాన్లు ఈమెను ఎప్పటికీ క్షమించరు. వారేమైనా చేయగలుగుతారు అన్నయ్యా" అకీల్ కళ్ళల్లో భయం కన్పిస్తోంది, మాట వణుకుతోంది. తన ప్రియమైన అన్నయ్య కూతురి కోసం చాలా ఆందోళన చెందుతున్నాడు.

జియావుద్దీన్ తన తమ్ముడి భుజాలు పట్టి కూర్చోబెట్టాడు. అకీల్ మాటలు విన్న తనకు కంగారు ఏమీ అనిపించలేదు. ఆ పరిస్థితుల్లో అక్కడ ఏమైనా జరగవచ్చు. తన ఆప్తమిత్రుడు కూడా కుటుంబ సభ్యులందరితో దేశం విడిచి వెళ్ళిపోవాలని సలహా ఇచ్చాడు. మలాలా ఆ సమయంలో నిద్రపోతుంది. జియావుద్దీన్ ఆమెను నిద్రలేపి "మన ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని, మనం ఇక్కడనుంచి వెళ్లిపోవాలని మీ చిన్నాన్న చెబుతున్నాడు." మలాలా ఇది విని కొద్దిగా అయినా ఆశ్చర్యపడలేదు. ఇంకా ఆమె దృఢ నిశ్చయంతో మా చిన్నాన్న చాలా మంచివారు, కానీ అది గొప్పవాళ్ళ స్వభావానికి మేలు చేయదు అన్నది.

# పెరుగుతున్న ప్రసిద్ధి

**మ**లాలా ఎంతగా ప్రసిద్ధి చెందుతుందో, ఆమెకు ప్రమాదం కూడా అంతే స్థాయిలో పొంచి ఉంది. తాలిబాన్లకు విరుద్ధంగా ఎవరు మాట్లాడినా వారిపై దాడులు చేయడం సహజమేనని అందరికీ తెలిసిన విషయమే. అయినప్పటికీ మెల్లమెల్లగా స్వాత్‌లో ప్రభుత్వ నియంత్రణ ప్రారంభమయ్యింది. తాలిబాన్ల అరాచకాలు తగ్గిపోతున్నాయి. దేశ విదేశాల మీడియా కూడా అక్కడికి చేరుకుంటోంది. వారు తాలిబాన్ల సమయంలో జరిగిన దాడులు, అరాచకాల పైన వ్యాసాలు రాయడం మొదలుపెట్టారు. ఆ సమయంలో అంతర్జాతీయ మీడియా మలాలా గురించి చాలా విషయాలు ప్రపంచానికి వెల్లడించింది.

అక్టోబర్ 2011లో డెస్‌మండ్ టుటు ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ పీస్ ప్రైజ్ (అంతర్జాతీయ బాలల శాంతి బహుమతి) ప్రదానానికి  మలాలా యూసుఫ్‌జాయి పేరును ప్రకటించారు. ఆ తరువాత ఆమె పాకిస్తాన్‌లో సెలబ్రిటీగా మారిపోయింది. దక్షిణాఫ్రికాకు చెందిన నోబుల్ పురస్కార విజేత డెస్‌మండ్ టుటు హాలెండ్‌లోని ఆమ్‌స్టర్‌డామ్‌లో 90 మంది సభ్యులలో ఆమె పేరును ప్రతిపాదించాడు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ 'మలాలా అమ్మాయిలకు ప్రతిఘటించే ధైర్యాన్ని ఇచ్చింది. అమ్మాయిలకు కూడా పాఠశాలకు వెళ్ళే హక్కు కావాలని ప్రపంచానికి చాటేందుకు జాతీయ, అంతర్జాతీయ మీడియాను కూడా ఉపయోగించుకోగలిగింది' అని చెప్పాడు. అప్పుడు ఆమె పేరు ప్రఖ్యాతులు, ప్రజల మనస్సు గెలుచుకొని ఇంకా వృద్ధి చెందినపుడు 19 డిసెంబర్, 2011న ఆమెకు పాకిస్తాన్ ప్రభుత్వం, పాకిస్తాన్‌లో యువకులకు ఇచ్చే 'జాతీయ శాంతి పురస్కారం' మొట్టమొదటిసారిగా మలాలాకు ఇచ్చారు. అప్పటి ప్రధాన మంత్రి యూసుఫ్ రజాద్ గిలాని మలాలాకు ఈ పురస్కారం ప్రదానం చేశాడు. ఈ పురస్కారం తీసుకున్నపుడు మలాలా తాను స్వంతంగా రాజకీయ పార్టీ స్థాపించాలని ఉన్నట్లు ప్రకటించింది. 'అందులో  విద్యాభివృద్ధి కోసం పని చేసేవారిని కలుపుకుంటాను. నా పార్టీ నలుదిక్కులా పనిచేస్తుంది' అని చెప్పింది.

మలాలా ఈ విధంగా చెప్పడంతో ప్రధానమంత్రి గిలాని స్వాత్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో ఐ.టి. క్యాంపస్ నిర్మించాలని ఆదేశాలు ఇచ్చాడు.

'మలాలా... మలాలా... ఏవైపు చూసినా మలాలా గురించే చర్చ ఎందుకు జరుగుతుంది?' తాలిబాన్లలో ఉక్రోషం పెరిగిపోతోంది, బద్దలవుతోంది. ఈ పరిణామంతో మలాలాను చంపివేస్తామని వార్తా పత్రికల్లో ప్రకటనలు ప్రచురితమవుతున్నాయి. తలుపుల క్రింది నుంచి కత్తిరించిన ఆ పేపరు ముక్కలను ఇంట్లో వేయడం మొదలైంది. ఫేస్‌బుక్‌లో కూడా ఆమెను బెదిరిస్తున్నారు. ఆమె పేరుమీద నకిలీ ప్రొఫైల్ తయారు చేశారు. మలాలా ఆమె ఫేస్‌బుక్ ఎకౌంట్‌ను తొలిగించివేసింది. ఇంకా డిజిటల్ సెక్యూరిటీ విభాగాల్లో పాల్గొనడం మొదలు పెట్టింది. దాంతో ఆమె అమ్మాయిల విద్య, అభివృద్ధి కోసం పోరాటం చేయటానికి నేను ఎప్పుడూ వెనకాడనని ప్రతిజ్ఞబూనింది.

తాలిబాన్లు ఆమెను హత్య చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీన్ని ఆహ్వానిస్తూ వారు నన్ను చంపేయటానికి వచ్చినా, 'మీరు తప్పు చేస్తున్నారు, ఎందుకంటే చదువుకోవడం మా ప్రాథమిక హక్కు అని చెబుతాను' అన్నది.

2012లో టి.టి.పి.లు నలువైపులనుంచి మలాలాపై నిఘా పెట్టారు. ప్రజలు ఆమెను పూజిస్తున్నారని, పాఠశాలలకు ఆమె పేర్లు పెడుతున్నారని ఆక్రోశిస్తున్నారు. ఆమె రాజకీయ నాయకులతో కలుస్తుండటం, ఇంకా ఆమె స్వయంగా రాజకీయ పార్టీ స్థాపించాలని భావించడం వారికి నచ్చడం లేదు.

మలాలా తాలిబాన్లకు ఒక ప్రమాదంగా మారింది. ఎందుకంటే ఆమె ఒక ప్రేరణశక్తిగా మారింది. ఆమె తాలిబాన్ల గుండెల్లో గుబులు పుట్టించింది. వారి సాహసం, వారి శక్తి, దృఢత్వం తగ్గిందనటానికి ఆమె ఉదాహరణగా మారింది. అందుకని తాలిబాన్లు తెలుసుకున్నది ఏమిటంటే ఒకవేళ 'నాయకుడిని కాల్చివేస్తే అనుచరులు బెదిరిపోతారు' అని. వారికి ఇలా చేయడమే తెలిసిన పని. అయితే వాస్తవంగా ఈ ఆలోచన పిరికితనానికి నిదర్శనం, దీంతో వారి చేతగానితనం ప్రపంచానికి అర్థమవుతుంది. ఒక అమ్మాయికి బెదిరిపోయినవారు ఏం సాధిస్తారు?

అప్పుడు క్రూరమైన తాలిబాన్లు ఎంతచేత గానివారో ప్రపంచం మొత్తానికి అర్థమయ్యింది. ఆ అమ్మాయికి ఉన్న ఆయుధం కేవలం రాత మాత్రమే, అందుకే ఆమె వారికి అతి పెద్ద ప్రమాదంగా కనిపించడం మొదలైంది. ఆమెపై వారి మూర్ఖత్వపు బాణం ఎక్కుపెట్టి నిజంగానే ఆమెను ఒక పెద్ద నేతగా నిరూపించారు.

మలాలా కార్యక్రమాలు, ఆమె దృఢత్వం, ధైర్యం చూస్తుంటే, 21వ శతాబ్దానికి ఒక నేత తయారుకాబోతోందని, తిరుగులేని ప్రపంచాన్ని సృష్టించాలనే ధీమా తన కళ్ళలో కనిపిస్తోందనేది అబద్ధం కాదు. ఈ కలను నిజం చేయడానికి కట్టుబడి ఉంది. 'నేను ప్రతిచోట, ప్రతి ఒక్కరికి విద్య అందుబాటులో ఉన్న దేశాన్ని చూడాలని కలలు కంటున్నాను' అంటోంది ఆమె.

ప్రపంచమంతటా దమనకాండ సృష్టించాలనుకునే దుష్ట ఆలోచనలకు ప్రతిఘటనగా, విప్లవాత్మకమైన అభివృద్ధికి ఒక ప్రతీకగా నేడు మలాలా యూసుఫ్‌జాయీ నిలిచింది.

14 ఏళ్ల అమ్మాయిపై హత్యాయత్నానికి పాల్పడిన క్రూరులు తాలిబాన్లు జబ్బలు చరుచుకుంటూ ఈ చర్యకు పాల్పడింది మేమే అని గర్వంగా చెప్పుకున్నారు. అంతేకాకుండా ఈ అమ్మాయి పరమతస్తురాలు లాగా ఇస్లాముకు వ్యతిరేకంగా అందోళనలు చేస్తోంది. అటువంటి ఆమె ఒకవేళ ప్రాణాలతో బ్రతికుంటే మళ్లీ కాల్చేస్తాం అంటూ బహిరంగంగా ప్రకటించారు. దాంతో ప్రపంచం మొత్తం ఈ ఘటనను దూషించింది.

అయినప్పటికి తాలిబాన్లు అనుకున్న దాన్ని మరచిపోలేదు. కాని మలాలా వైపు పాకిస్తాన్ ప్రభుత్వమే కాదు, ప్రపంచం మొత్తం మద్దతుగా నిలబడింది. అప్పుడు దేశం మొత్తం రొమ్ములు విరుచుకొని ముందుకొచ్చింది. దాంతో తాలిబాన్లు సిగ్గుచేటు అనిపించుకున్నారు. దేశంలో ఏమవుతుందో వారికి అర్థంకాలేదు. ముక్కుపచ్చలారని అమ్మాయిని చంపేయాలనే నిర్ణయం అయితే తీసుకున్నారు. కాని ఎవరూ ఆమె వారి దాడికి గురవుతుందని అనుకోలేదు. మానవ హక్కుల సంఘం సభ్యుడు ఒకతను 'మలాలాకు ఇలా అవుతుందని ఎవరు ఊహించలేదు అనడం సరియైనది కాదు' అని అభిప్రాయపడ్డారు. తుపాకి నిత్యం వెన్నంటి ఉండేది. కాని వారి చేతివ్రేళ్ళు అప్పటి వరకు ట్రిగ్గర్‌పై పడలేదు. అంతే.

ఆయన అనుకున్నది చెప్పాడు. కాని ఆ మాట చాలా దూరం పోయింది. స్వాత్‌లోయ మలాలాపై తూటా పేలిన తరువాత 'ఇప్పుడు వారందరిలో ప్రతి ఒక అమ్మాయి నేను మలాలానే, మేము మలాలాలమే' అని రాసుకున్నారు.

# వేటాడిన క్రూరత్వం

**అ**ది అక్టోబర్ 9వ తేది, 2012, జియావుద్దీన్ యూసుఫ్‌జాయి ప్రెస్‌క్లబ్‌లో స్థానిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడు. అక్కడ ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించటానికి చేస్తున్న ప్రయత్నాల గురించి చెబుతున్నాడు. అప్పుడు తన మొబైల్‌ను స్నేహితుడు అహ్మద్ షాహ్ చేతికిచ్చాడు. ఖుషాల్ స్కూల్ నెంబర్ నుండి ఫోన్ వచ్చింది. దాంతో ఫోన్ జియావుద్దీన్‌కి ఇవ్వబోయాడు. దాంతో జియావుద్దీన్ పాఠశాల నుండే కదా, నువ్వే మాట్లాడు అన్నాడు.

షాహ్ ఫోన్లో హల్లో అని అన్న వెంటనే ఎవరో మహిళ భయపడుతూ, వణుకుతున్న గొంతు వినిపించింది.'ఎవరో స్కూల్ బస్సుపై దాడి చేశారు తొందరగా రండి' దాని తరువాత ఫోన్ కట్ అయ్యింది. షాహ్ విషయం చెప్పగానే జియావుద్దీన్ బయటికి వచ్చి దుఃఖంతో ఎవరో కాని మలాలాపైనే గురిపెట్టారు. ఎప్పటి నుండో తాలిబాన్లు ఆమె ప్రాణాలకి శత్రువులై కూర్చున్నారు. 'నా చిట్టి తల్లి ఎలా ఉందో?' అనుకున్నాడు.

ఆయన కళ్ళ నుండి నీళ్ళు కారుతున్నాయి. వారు తొందరగానే మలాలా ఉన్న హాస్పిటల్‌కు చేరుకున్నారు. ఆమె నోటి నుండి రక్తం కారుతుంది. ఆమె బట్టలన్నీ రక్తంతో తడిసిపోయాయి. 'నాన్నా... నాన్నా!' ఆంటూ ఏడుస్తూ ఎక్కిళ్ళు పెట్టి మలాలా స్పృహ కోల్పోయింది.

ఘటనా స్థలం నుండి చెక్ పాయిట్ కేవలం 4 నిమిషాల దూరం మాత్రమే. బస్సు డ్రైవర్ మలాలా రక్తంతో తడిసి పోవడం చూసి సహాయం కోసం అరిచాడు. కాని ఎవరూ రాలేదు. ఇలా 20 నిమిషాలు గడిచిపోయాయి. బస్సులో ఉన్న విద్యార్థులు, టీచర్లు, డ్రైవర్ ఆ దాడికి సైనికులే కారణం అనుకుంటున్నారు. ఎందుకంటే వారు కూడా తాలిబాన్లలాగే మలాలాను, ఆమె తండ్రిని నోరు మూయించాలనుకుంటున్నారు.

ఒక నెల మొత్తం తాలిబాన్ల షార్ప్ షూటర్స్ టీమ్ ఒకటి మలాలా దినచర్యను గమనిస్తున్నారు. ఆమె ఏం చేస్తుంది? ఎక్కడికి వెళుతుంది. ఇంకా పాఠశాలకు వెళ్ళే, వచ్చే సమయం ఏమిటి? స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తరువాత ఆమె విధి విధానాలేమిటి? మలాలాకు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని సూక్ష్మదృష్టితో గమనిస్తున్నారు. తర్వాత కట్టుదిట్టమైన ప్రణాళికతో ఆమెపై దాడి చేశారు. దాడి చేసిన తరువాత తాలిబాన్లు పెద్ద గర్వంతో దాడికి బాధ్యులం మేమేనని ప్రకటించుకున్నారు. తమ దుర్మార్గాన్ని సమర్థించుకోడానికి వారు ఆమెపై అనేక ఆరోపణలు చేశారు: ఆమె అమెరికా గూఢాచారి. ఎందుకంటే ఆమె నల్లజాతి దానవుడైన ఒబామాను ఆదర్శంగా భావిస్తుంది. అనాగరిక సాంప్రదాయాన్ని ముందుకు తెచ్చి మలాలా పాపం చేసింది. ఆమె షరియత్ చట్టాన్ని ఉల్లంఘించింది. ఆమె ఒక గూఢచారిగా మారి బిబిసి ద్వారా ముజాహిద్దిన్, తాలిబాన్ల గురించి సమాచారం ఇస్తుంది, దీనికి బదులు ఆమెకి పురస్కారాలు, బహుమతులు ఇస్తారు. ఎప్పుడైనా ఆమె ఇంటర్వ్యూ ఇవ్వడానికి వెళితే మేకప్ చేసుకునేది. ఒకవేళ మలాలా ప్రాణాలతో ఉన్నా మేమే మళ్ళీ దాడి చేస్తాము. కాని ఇప్పుడు జియావుద్దీన్ వంతు వస్తుంది. అతన్ని కూడా మేము చంపేస్తాం. ఆమె తండ్రియే ఆమె మెదడును పాడు చేశాడు. మేము చాలాసార్లు నచ్చజెప్పాము. మీ అమ్మాయికి మా గురించి వ్యతిరేకంగా చెప్పడం మానుకోవాలని చెప్పాము. కాని అతను మా మాట వినలేదు. మేము అనివార్యంగా ఈ పనిచేయాల్సి వచ్చింది. మలాలా, ఆమె తండ్రి ఎప్పటికీ మా హిట్‌లిస్ట్‌లో ఉంటారు. వారు మా తూటాల నుండి తప్పించుకోలేరు.

మలాలాను తాకిన తాలిబాన్ తూటా ఆమె నుదుటికి ఎడమవైపు నుంచి, పుర్రె ఎముకను ఛిద్రం చేస్తూ, ముఖభాగాన్ని చీల్చుకుంటూ, చెవి పక్కగా భుజంలోకి దూసుకుపోయింది. స్పృహ తప్పి రక్తపు మడుగులో ఉన్న ఆమెను పెషావర్‌లోని మిలిటరీ ఆసుపత్రిలో చేర్చారు. ఆమె శాశ్వతంగా కోమాలోకి వెళ్ళిపోయిందేమోనని డాక్టర్లు తొలుత భయపడ్డారు. అయితే ఆమె చాలా రోజులు కోమాలో ఉంది. తూటా తాకిన ప్రభావంతో ఆమె ఎడమవైపు తలభాగం వాచిపోయింది.

మలాలా ప్రాణాపాయ స్థితికి పాకిస్తానే కాదు, పూర్తి ప్రపంచమే దుఃఖించింది. ప్రజలు మలాలా బాగుండాలని దేవుని వేడుకున్నారు.

మలాలా పరిస్థితి విషమించడం చూసి పాకిస్తాన్ ప్రభుత్వం విదేశాలకు పంపించి వైద్యం చేయించాలని నిర్ణయించింది. పాకిస్తాన్ ప్రభుత్వం ఎటువంటి వ్యతిరేకతను భరించేందుకు సిద్ధంగా లేదు. ప్రపంచం మొత్తం మలాలా పక్షాన నిలిచి ఉంది. ప్రజలు

ఆమె స్పృహలోకి ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. గాయపడ్డ మలాలా కష్టాల సముద్రపు అలల్లో కొట్టుకుంటోంది. ఇంత పెద్ద శిక్ష విధించటానికి ఆమె చేసిన తప్పేంటి?

అపరేషన్ చేయటానికి ముందు మలాలా కాళ్ళు చేతులు బాగానే ఉన్నాయి. దీంతో ఆమెకి పక్షవాత సమస్య లేదని అర్థమయ్యింది. మలాలా అస్పష్టమైన భాషలో ఏదో చెప్పబోతుంది. స్వాత్ లోయలోని ప్రతి వ్యక్తి దేవుడిని కోరుకుంటున్నారు... ఆమె పాఠశాల స్నేహితులు ఆసుపత్రి బయట నుంచొని ఆమె బాగోగులను ప్రతి క్షణం తెలుసుకుంటున్నారు. తాలిబాన్ తీవ్రవాదుల నుండి ఇప్పటికీ ఆమెకు ప్రమాదం పొంచి ఉంది. కాని అనుకోకుండా ప్రజలలో ఒక సాహసం పుట్టుకొచ్చింది. ఇంకా వారు తమ ప్రాంత అమ్మాయికి వచ్చిన ఇటువంటి పరిస్థితికి బదులు తీర్చుకోవటానికి సిద్ధమయ్యారు.

మలాలా ఆరోగ్యం కాస్త కుదుటపడితే లండన్ తీసుకువెళ్ళాలని ఎదురు చూస్తున్నారు. దీని కోసం బాదుర్షాఖాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వారి ప్రయాణానికి కావాల్సిన ఏర్పాట్లు సిద్ధం చేశాడు.

పెషావర్ ఆసుపత్రిలోని డాక్టర్లు ఆమెను కాపాడలేకపోవడంతో, పాకిస్తాన్ మరియు బ్రిటిష్ డాక్టర్లతో కూడిన ప్యానెల్‌ను ఆమెకు వైద్యం చేయటానికి పిలిపించారు. అందుకని ఆమెను రావల్పిండిలోని ఆర్మీ ఫోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్డియాలజీకి మార్చారు. ఆ సమయంలో సైనిక ఆసుపత్రి మెడికల్ టీమ్ కూడా ఆమెకి దాదాపు ఆరోగ్యం పూర్తిగా కోలుకుంటుందని చెప్పారు. కాని అప్పటికీ పరిస్థితి దారుణంగానే ఉంది. డాక్టర్లయితే 70 శాతం బ్రతికే అవకాశం ఉందని చెప్పారు. ఆమె శరీరంలో ఉన్న తూటా తీసే ముందు ఆమె స్పృహ కోల్పోయి ఉంది.

“స్వాత్ అమ్మాయి, స్వాత్ గుండె చప్పుడు, ఈ రోజు నిశ్శబ్దంగా ఉంది. ఈమె ప్రతి అడుగులో ప్రజలు వెంట నడుస్తారు. ఈమె ఇచ్చిన పిలుపులకు తాలిబాన్ల దిమ్మ తిరిగిపోయింది. దాంతో వారు ఆందోళనకు గురై ఆమెపై తూటాలు పేల్చారు. అందుకే ఆమె నిశ్శబ్దంలోకి వెళ్ళిపోయింది. ఆ సమయం స్వాత్‌కు చాలా కష్టకాలం. జియావుద్దీన్‌కైతే తన ముద్దుల కూతురు మలాలా ఎప్పటిలాగే నిర్భయంగా ఆలోచిస్తూ తన మనసును దోచుకునేదని నమ్మకంతో ఉన్నాడు. ఈ రోజు ఆమె గొంతు మూగబోయిందని ఆయనకు విశ్వాసం కలగడంలేదు. ఆమెలో కనీసం కదలికలు కూడా లేవు. పిలిచినా కూడా ఎటువంటి స్పందనా లేదు.

డాక్టర్లు ఆమెను వెంటిలేటర్‌పై పెట్టారు. సి.టి.స్కాన్ చేసి మలాలా తలలో కాస్త వాపు ఉన్నట్లు గమనించారు. కాని ఆమె మిగతా అవయవాలన్నీ చాలా బాగా స్పందిస్తున్నాయని తెలుసుకున్నారు. డాక్టర్లు ఆమెకి 'డీకంప్రెసివ్ క్రినిక్‌టామి' ద్వారా ఆమె తలవాపు తగ్గడానికి చికిత్స చేసి పుర్రెలోని ఒక భాగాన్ని పక్కకు జరిపి మెదడుపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చేశారు.

దీని తర్వాత డాక్టర్లు మలాలాకు నిద్రమత్తు కోసం ఇచ్చే మందు మోతాదు కాస్త తగ్గించారు. అయితే ఈమెను మంచి వైద్యం కోసం ఎక్కడికి తీసుకువెళ్ళాలనే చర్చ మొదలయ్యింది. పాకిస్తాన్ అప్పటి అంతర్గత వ్యవహారాల మంత్రి రెహమాన్ మాలిక్ ఆమె పరిస్థితి కుదుటపడిన వెంటనే జర్మనీ పంపించాలని సలహా ఇచ్చాడు. అక్కడ అయితే ఆమెకు మెరుగైన వైద్యం లభిస్తుందని చెప్పాడు. దుబాయ్‌లో, అమెరికాలో.. ఇలా రకరకాల ప్రతిపాదనలు వచ్చాయి.

మలాలా పరిస్థితులు ఒకవైపు చాలా దుఃఖభరితంగా ఉన్నాయి. ప్రజలు ఆమె బాగు కోసం ప్రార్థిస్తున్నారు. మరోవైపు రాజకీయ నాయకులు ఏ దేశం తీసుకు వెళ్ళాలి? ఎక్కడ వైద్యం చేయించాలి అనే చర్చలతో ప్రతీ దేశం మలాలా ద్వారా ప్రజా గౌరవం, గుర్తింపు పొందాలని భావిస్తున్నాయి.

ఆ తరువాత 15 అక్టోబర్, 2012న మలాలాను బ్రిటన్‌కు పంపించారు. లండన్‌లోని బర్మింగ్‌హామ్‌లోని క్వీన్ ఎలిజబెత్ ఆసుపత్రిలో ఆమెకు వైద్యం మొదలయ్యింది.

క్వీన్ ఎలిజబెత్ ఆసుపత్రిలో గాయపడ్డ సైనికులకు వైద్యం చేస్తుంటారు. ఆధునిక టెక్నాలజీ, మెరుగైన వైద్యం అందుబాటులో ఉండటం వల్ల మలాలాకు మంచి ఉపయుక్తంగా ఉంది. కాని అక్కడ మెరుగైన చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ కుటిల నీతి కూడా కనిపించింది. వాస్తవానికి బ్రిటన్  పాకిస్తాన్‌ల మధ్య సంబంధాలు చాలా పురాతనమైనవి. ఇవి 1947 నుండి నేటికీ అలాగే ఉన్నాయి.

16 అక్టోబర్, 2012లో ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ మెడికల్ డైరక్టర్ అక్కడ మలాలాకు వైద్యం చేసే డాక్టర్లలో ఒకడు. ఆయన మాట్లాడుతూ 'మేము ఆమె కోలుకోవడం పట్ల చాలా సంతోషంగా ఉన్నాము, మలాలా ఆరోగ్య పరిస్థితి కుదుట పడింది. కాని ఇప్పటికైనా ఖచ్చితంగా చెప్పడం కష్టమైన పనే. ఎందుకంటే వాస్తవంగా ఏం జరిగిందీ, దాని ప్రభావం ఎలా ఉంటుంది ఇటువంటి విషయాలు అర్థం చేసుకోవటానికే 6 నెలల నుండి ఒక సంవత్సర కాలం పడుతుంది.'

కాని విచిత్రమేమంటే అక్టోబర్ 17, 2012న మలాలా కోమా నుండి బయటపడింది. తన దృఢ విశ్వాస శక్తితోనే ఇలా బయటపడగలిగింది. ఎందుకంటే ఆమె లక్ష్యం పూర్తిగా నెరవేరలేదని ఆమెకు గుర్తుంది. ఆ 14 సంవత్సరాల అమ్మాయి ముందు ఇంకా చాలా జీవితం మిగిలే వుంది. ఆమె తన కలలను సాకారం చేసుకోవలసి ఉంది, మహిళలకు విద్యాహక్కు ఇవ్వవలసి ఉంది. ఈ విషయంలో ఆమె కచ్చితంగా గెలిచి తీరుతుంది.

ప్రతి ఒక్కరూ మలాలాను చూడాలని ఉత్సాహంతో ఉన్నారు. కాని డాక్టర్లు అంగీకరించడం లేదు. జియావుద్దీన్ యూసుఫ్‌జాయి ఎంతో విన్నవించుకోవడంతో 26 అక్టోబర్, 2012న డాక్టర్లు ఆమెను మాట్లాడించవద్దనే షరతుపై అనుమతించారు. జియావుద్దీన్, మలాలా తల్లి, ఇద్దరు తమ్ముళ్ళు ఆమెను కలవటానికి అంగీకరించారు. జియావుద్దీన్ తన చేతితో కుమార్తె తలపై నిమురుతున్నాడు. ఆమె తల్లి తన కూతురి తలలో తూటా పేలిందంటే నమ్మలేకపోతుంది. మలాలా తన అమ్మా నాన్నకు చేతులు ఊపి మీరు బాధపడకూడదు, నేను బాగానే ఉన్నాను అన్నట్లు సైగ చేసింది.

మలాలా కళ్ళలో అప్పటికీ ఎటువంటి భయం కనిపించలేదు. తనను చంపటానికి తాలిబాన్లు మరోసారి దాడిచేస్తారనే భయమైనా దగ్గరకి చేరలేదు.

తన లక్ష్యం సాధించుకోవాలనే ఆ పట్టుదల ఉన్న మలాలా వంటి అమ్మాయిలు ఎంత మంది ఉంటారు. మలాలా గురించి ఆలోచిస్తున్నపుడు ప్రతి ఒక్కరు ఇటువంటి స్పృహను, లక్ష్యాలను కలిగి ఉంటారా, ఒకవేళ ఆలోచన వచ్చినా వాటిని సాధించే వరకు పోరాటం చేయగలుగుతారా అని సందేహం వస్తుంది. కాని ఆమె మాత్రం తన ఆశయాన్ని పూర్తిచేసేవరకు ఎటువంటి పరిస్థితులకు లొంగలేదు.

మలాలా తూటా తగిలి ఛిద్రమైన పుర్రె భాగంలో టైటానియం ప్లేట్ అమర్చారు. కోక్లియర్ ఇంప్లాట్ సర్జరీ కూడా చేశారు. దీనివల్ల ఆమె ఎడం చెవి బాగానే పని చేస్తోంది. ఆమె మాట్లాడటానికి, వినటానికి అవసరమైన శక్తి మాత్రం ఇంకా పూర్తిగా రాలేదు. అంతేకాక తన ముఖ భాగాలకు సర్జరీ చేయడంతో ఆకారం మారుతుందేమోనని మలాలా భయపడింది.

# వెన్నుతట్టిన ప్రపంచం

**జి**యావుద్దీన్ మలాలాతో కలిసి బయటికి రాగానే  మీడియా మొత్తం అక్కడ మోహరించింది. పాత్రికేయులు తనను ప్రశ్నిస్తున్నారు. కాని కూతురు అనుభవిస్తున్న బాధను చూసి దుఃఖం ఆపుకోలేక గొంతు పడిపోయినట్లుంది. వణుకుతున్న స్వరంతో 'ఇప్పుడు మలాలా కోలుకుంటోంది. భగవంతుడు కరుణిస్తే తొందరగా పూర్తిగా కోలుకొని తిరిగి ఆటలు ఆడుతుంది, పరుగులు తీస్తుంది. హాయిగా చదువుకోగలుగుతుంది. కాని బ్రిటన్‌కి వెళ్ళడానికి విమానంలో ఉన్నప్పుడు మాత్రం ఆమె గాయమైన తలభాగం బాగా వాచింది. అప్పుడామె కోమాలోకెళ్ళింది. మేమైతే బతుకుతుందనే ఆశ వదులుకున్నాము.'

దేశ విదేశాల నుంచి ఆమె కోసం సందేశాలతో 'గెట్‌వెల్ సూన్' అంటూ కార్డులు వస్తున్నాయి. ఇటువంటి ప్రజల ఆశీర్వాదమే మలాలా కోమా నుంచి కోలుకోవటానికి కారణమైంది. మలాలా తన కుటుంబ సభ్యులతో మళ్లీ మాట్లాడగలిగింది. ఆమె అస్పష్టమైన మాటల్లో కూడా నిర్భయం కనిపించింది.  నేను బాగానే ఉన్నాను, ఆ దుర్మార్గులతో ఎదురు పోరాటానికి సిద్ధంగా ఉన్నాను అనే భావాలు వ్యక్తమయ్యాయి.

పాకిస్తాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ మలాలాను పరామర్శించడానికి ఆసుపత్రి కొచ్చాడు. అంతేకాకుండా చదువుకుంటున్న లక్షల మంది అమ్మాయిల పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయాలన్న డిమాండ్‌ను అంగీకరించి ఫైల్‌పై సంతకాలు చేశాడు. ఆ సంతకం మలాలాకు సన్మానం లాంటిది. అధ్యక్షుడు జర్దారీ మాట్లాడుతూ "మలాలాపై దాడి చేసిన దుండగులు కేవలం పాకిస్తాన్ అమ్మాయిపై కాదు పాకిస్తాన్ పైనే దాడి చేయాలని ప్రయత్నించారు, వారిని క్షమించరాదు" అన్నాడు.

మలాలా ఆసుపత్రిలో ఉంది. కాని ఆసుపత్రి బయట ఆమె కోసం పోరాటమే ఎదురుచూస్తుంది. 15 అక్టోబర్, 2012న బ్రిటన్ మాజీ ప్రధాన మంత్రి, యునైటెడ్ నేషన్స్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ప్రత్యేక రాయబారి గోర్డన్ బ్రౌన్ మలాలా పేరుతో ఒక

ప్రకటన జారీ చేశాడు. "మలాలా ఏ ఉద్దేశం కోసం పోరాడిందో, దాన్ని సమర్థిస్తూ "నేను మలాలా" అనే నినాదం ఇస్తున్నట్లు అందులో ప్రకటించాడు. 2015 నాటికి పాఠశాలకు వెళ్ళలేని ఒక్క బిడ్డా కూడా ఉండకూడదని, మలాలా వంటి అమ్మాయిలు తప్పకుండా పాఠశాలకు వెళ్ళగలుగాలని ఈ నినాదం వెనుక ఉన్న ఉద్దేశం. మలాలా ప్రపంచంలోని అమ్మాయిల చదువు కోసం నిజమైన ప్రేరణగా మారింది. "ఆమె ఒక వేగుచుక్క అయ్యింది. ఆమె చేసిన ఈ సాహసాన్ని దృఢ సంకల్పాన్ని గుర్తించి ఆమెను ప్రశంసించ లేకుండా ఉండలేను, ఇంకా ఆమె ఒక మంచి నేత కావాలని కోరుకుంటాను" అని అందులో రాసి ఉంది. నవంబర్ 2012లో బ్రౌన్ ఇస్లామాబాద్‌కి వచ్చినప్పుడు అతను ఈ విజ్ఞప్తిని రాష్ట్రపతి అసిఫ్ అలీ జర్దారీకి సమర్పించాడు.

మలాలాపై తూటా పేలిన తర్వాత టైమ్స్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బిబిసి ఉర్దూ ప్రధాన అధికారి అమీర్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ ఇప్పుడు నేను నా డెస్క్ ముందు కూర్చొని ఉంటే నా మనసులో "దేవుడా! మేం ఆమెను వెతకకుండా ఉంటే ఇలా జరిగేది కాదు గదా అని అనుకుంటూ ఉండేవాడిని. దీనర్థం ఆమె ప్రశంసనీయతకు మేం కారణమని  గొప్పలు చెప్పడం కాదు. మలాలా వంటి  పిల్లలు తమ దృఢమైన ఆత్మవిశ్వాసంతోనే అటువంటి ఆశయాలు కార్యరూపంలో బయటపెడతారు.

పాకిస్తాన్‌లోనే కాదు అమెరికాలో కూడా మలాలాపై జరిగిన దాడి పట్ల ఆక్రోశంతో ఉన్నారు. అక్కడి అమ్మాయిలు కూడా మలాలాను సమర్థిస్తూ వెన్నుతడుతున్నారు. బ్రిటిష్ యువ నాయకులు మరియం హూయెల్ మాట్లాడుతూ "ప్రజల కోసం మలాలా ఒక ప్రేరణ స్తోత్రం అవుతుంది. మలాలా ఇచ్చిన ధైర్యంతో నా చిన్న చెల్లెలు కూడా ప్రభావితురాలైంది. ఇప్పుడామె చదువులో ఉన్న గొప్పతనాన్ని గ్రహించింది. లేకుంటే ఆమె చదవడం అంటే దూరంగా పారిపోయేది.

మలాలా చదువుకోవడం మన బాధ్యత . ఇది వాస్తవమని మా బ్రిటన్‌లో నిరూపిస్తాం. మేము చదువు 18 సంవత్సరాల వరకు తప్పనిసరి అని ముందుకు సాగుతాం, మన చదువుల కోసం సంఘర్షణ అవసరం లేదు, ఆందోళన అవసరం లేదు, ఇంకా అన్నింటికంటే ముఖ్య విషయమేమిటంటే చదువుకోడం మనల్ని అపాయంలో నెట్టేయకూడదు అని అనుకుంటాము. కాని దీనికోసమే నిరంతరం కష్టాలను భరించే అమ్మాయిలు ఎంతో మంది ఉన్నారు. మలాలా వంటి చాలా మంది నుంచి చదువుకునే

అధికారాన్ని లాక్కున్నారు. మహిళల విద్యపై యుగాల నుంచి వివాదాలు నడుస్తున్నాయి. మహిళలకు చదువుకునే అధికారం ఇస్తే అభివృద్ధికి బదులు నష్టం చేకూరుతుంది అనుకునేవారు సమాజంలో ఇప్పటికీ అక్కడక్కడ దృఢవిశ్వాసంతో ఉన్నారు.

మనం చదువుకుంటే పురుషుల దృష్టిలో మనపై ఉండే చిన్న చూపు పోతుంది. దీంతో సమాజంలో పురుషాధిక్యానికి నష్టం వాటిల్లుతుంది అనే భావాలు అనేక సందర్భాల్లో స్పష్టమయ్యాయి. నాకు తెలిసిన ఒక వాస్తవాన్ని గుర్తు చేస్తాను. అది మా నానమ్మ స్వయంగా అనుభవించిన విషయం నాతో చెప్పింది. ఆమెకు నెలసరి మొదలైన తర్వాత వారి పెద్దన్నయ్య ఆమెను బడికెళ్ళడం మాన్పించాడు. ఎందుకంటే ఒకవేళ ఆమె ఇంకా పై చదువులు చదివితే ఆమె మేము చూసిన పెళ్ళి సంబంధాన్ని ఒప్పుకుంటుందో లేదో అనే భయం. మా తాత–నాయనమ్మ కంటే వయసులో చాలా పెద్దవాడు. ఇంకా మొదటి భార్య చనిపోయిన వాడు కూడా. నేను ఒకసారి మీ అన్నయ్య తీసుకున్న నిర్ణయం నీకు ఎలా అనిపించింది? అని అడిగాను. అయితే ఆమెకు చాలా కోపం వచ్చింది. ఒకవేళ నేను చదువుకున్నదాన్నైతే మీ తాతయ్యను ఎట్టి పరిస్థితుల్లోనూ పెళ్ళాడేదాన్ని కాదు అని చెప్పింది.

బ్రిటిష్ ఆసియా అమ్మాయిగా మూడవ యువతరానికి చెందిన అమ్మాయిగా బ్రైడ్‌ఫోర్డ్‌లో చేరుకోగానే నేను కూడా ఇటువంటి వెనకబాటుతనం ప్రభావానికి గురయ్యాను. ఇది కూడా నా తల్లి తండ్రి ఇంకా కుటుంబసభ్యుల మధ్యనే చాలామంది నన్ను చదివించవలసిన అవసరంలేదు. తొందరగా పెళ్ళిచేసి పంపిస్తే తల్లిదండ్రుల బరువు దిగిపోతుంది అనేవారు. ఇంకొకరైతే ఒకవేళ నేను ఎక్కువ చదువుకుంటే నన్ను నియంత్రించడం కష్టమవుతుంది. ఇంకా చదువు నాకు మితిమీరిన స్వేచ్ఛనిస్తుంది అన్నారు. వాస్తవంగా నా చదువే నాకు స్వతంత్రానిచ్చింది. అది నాకు నలువైపుల నుంచి ఎదురయ్యే సమస్యలను విశ్లేషించే యోగ్యతనిచ్చింది. నిర్భయంగా ప్రశ్నించే సామర్థ్యాన్నిచ్చింది.

ఇప్పుడొక విషయం స్పష్టమైంది. అది తాలిబాన్లు స్వాత్ లోయల్ని ఆక్రమించుకునే సందర్భంలో అమ్మాయిల చదువును అడ్డుకున్నారు. అమ్మాయిల చదువు వారికి అపాయాన్ని తెచ్చిపెడుతుందని భయపడ్డారు.

ఒక వాస్తవం ఏమిటంటే మనం ఒక అమ్మాయిని చదివిస్తున్నామంటే ఆమెకు కేవలం చదువు మాత్రమే చెప్పించడం కాదు. ఆమెకు స్వాతంత్ర్యం కూడా ఇస్తున్నాం.

మనం ఆమెను తన కాళ్ళపై తాను నడిచేలా ముందుకు నడిపిస్తాం. ఇంకా సమాజంలో తన పరిస్థితిని ప్రశ్నించేందుకు ఆమెను సిద్ధం చేస్తున్నాం. మనం ఆమెకు జ్ఞానాన్నిచ్చి ధైర్యాన్నిస్తున్నాం. ఇది తాలిబాన్లకు అపాయకరమైంది. ఎందుకంటే చదువుకుంటే వారిని ధైర్యంగా నిలబెట్టి ప్రశ్నిస్తారు. ఇంకా వారికంటే పెద్ద బలాన్ని సమీకరిస్తారు. దాంతో వారి అధికారం చేజారిపోతుంది. అప్పుడు వారి హెచ్చరికలు ఏ మాత్రం లెక్కచేయరు. వారి పతనం అందరూ చూస్తారు.

ఛాందస ఆలోచన ఇంకా సాంప్రదాయవాద మానసికత కారణంగా పాకిస్తాన్‌లో మహిళల అభివృద్ధి మార్గం నేటికీ కనబడదు. అది 2001లో ఆఫ్ఘనిస్తాన్ నుంచి తాలిబాన్ల అధికారం నాశనం అయిన తర్వాత ఆఫ్ఘనిస్తాన్ మహిళలకు చట్టపరమైన విద్యా, ఓటుహక్కు ఇంకా ఉద్యోగ సౌకర్యం వంటి అధికారాలు ప్రాప్తించాయి. కాని నేటికి ప్రపంచంలోకెల్లా మహిళలకి అన్నింటికంటే అపాయకరమైన ప్రాంతాలలో ఆఫ్ఘనిస్తాన్ మొదటి స్థానంలో ఉంది.

ఛాందసవాద ఆలోచనలు సాంప్రదాయవాద మానసికత కారణంగా పాకిస్తాన్‌లో మహిళాభివృద్ధికి సరియైన దారి లేదు. ఛాందసమార్గ ఆలోచనలు, నిరక్షరాస్యత స్త్రీల ప్రగతిలో అన్నింటికంటే పెద్ద అవరోధంగా మారుతాయంటూ, తాలిబాన్లు పాఠశాలలను పేల్చివేయడానికి వ్యతిరేకంగా మలాలా ఆందోళనకు పిలుపునిచ్చింది. తన ప్రాణాలు అపాయంలోకి నెట్టుకుంది.

వాస్తవంగా పాకిస్తాన్‌లో అమ్మాయిల చదువు విషయంలో ఒకవైపు నుంచి ఆసక్తి లోపించింది. అది ప్రభుత్వం వైపు నుంచి అయినా, లేదా ప్రజల వైపు నుంచి అయినాకాని. పేదరికం ఇంకా అజ్ఞానం కారణంగా అత్యధిక శాతం తల్లిదండ్రులు అమ్మాయిలను చదివించడం డబ్బులు వృధాచేయడమే అని భావిస్తారు. చదువుకు ఖర్చయ్యే డబ్బులు భద్రపరిస్తే పెళ్ళికి ఉపయోగపడతాయని భావిస్తుంటారు. మలాలాకు తన తల్లిదండ్రులు విద్యనభ్యసించే అవకాశాన్ని ఏర్పరచి తన జీవితానికి గొప్ప కానుక ఇచ్చారు. దీంతో ఆమె రాయగలిగే శక్తిని గుర్తించింది. దీనిని తను ఆందోళన చేయడానికి, ఎదిరించడానికి ఆయుధంగా మలుచుకుంది. విద్యను పొందే తన హక్కును కాలరాయలనుకున్న పురుష అహంకారులకు ఎదురుగా ఖడ్గమై నిలిచింది.

“మలాలా పోరాటం, ఆమె నెత్తురు వృధా కాలేదు. ఆమెపై కాల్పులు జరిపిన తర్వాత తాలిబాన్లు స్వాత్ లోయలోని యువతకు హెచ్చరికలు జారీ చేస్తూ, మలాలా లాగా నడుచుకోవాలని ప్రయత్నం చేస్తే వారికీ ఇటువంటి పరిస్థితే ఎదురవుతుందని తెలిపారు. కాని ఇంతకు మించి ఏం చేయలేకపోయారు. స్వాత్ లోయలోని ఏ ఒక్క అమ్మాయినీ భయపెట్టడం వారి వల్ల కాలేదు. స్వాత్ లోయలోని ప్రతీ అమ్మాయి “నేను మలాలానవుతా, చదువుకుంటా, స్వేచ్ఛగా జీవిస్తా, వారు మమ్మల్ని ఓడించలేరు” అంటూ ముందుకు వచ్చారు. వారు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. బ్రిటన్‌లోని క్వీన్ ఎలిజబెత్ ఆసుపత్రి వరకు వారి నినాదం దూసుకెళ్లింది. అది మలాలా చెవులను తాకింది. ఆ కొవ్వొత్తుల జ్వాల ఆమెలో జ్వలించింది. అది ఆమెను దేదీప్యమానంగా వెలిగింపజేసింది.”

“నేడు పాకిస్తాన్ సమాజంలో ఛాందసత్వపు అతివాదులపై ఆవేశం పెల్లుబికింది. వాస్తవానికి తాలిబాన్ల భయం నుంచి ప్రజలను విముక్తి చేయాల్సిన పని పాకిస్తాన్ ప్రభుత్వానిది. కాని దానికోసం ఒక చిన్న అమ్మాయి ప్రతిజ్ఞబూనాల్సి వచ్చింది.”

# ఇంటింటా మలాలా

**సు**శాలమైన పర్వతాల ఒడి నుండి ప్రవహించే స్వాత్ నదీ తీరాన ఉన్న ఆ ఇంటి ముందు నిరంతరం పాకిస్తాన్ పోలీసులు కాపలా కాస్తుంటారు. ఎందుకంటే మలాలాకు లాగే ఆమె ప్రాణాలకు కూడా అపాయం పొంచి వుంది. ఆ ఇంట్లో ఉండేదే అమ్మాయి ఖైనత్ రియాజ్. దాడి చేసిన వారి తూటా ఏ సమయంలో అయితే మలాలా శిరస్సును ఛేదించి లోపలికి దూరిందో ఆ సమయంలో ఆమె స్నేహితురాలు కూడా ఆమెతోనే కూర్చొని ఉంది. ఆమెకు కూడా తూటా తాకింది. గాయాలపాలైంది. ఆ ఘటనతో ఖైనత్ నిర్ఘాంతపోయింది – ఇక్కడ ఏం జరుగుతోందోనని.

తర్వాత ఆమెను కలిసినప్పుడు మాట్లాడుతూ "నేను బస్సులో మలాలాతో కూర్చొని ఉన్నాను. ఒక్కసారిగా వారు బస్సు లోపలకి వచ్చారు. వచ్చి మలాలా అంటే ఎవరు? ఎక్కడ ఉంది? అని అడిగారు. మొదట్లో మేము ఎవరో జోక్ చేస్తున్నారు అనుకున్నాము. మలాలాను గుర్తుపట్టడం పెద్దపని కాదు. ఎందుకంటే మేము సాంప్రదాయ దుస్తులు ధరించే వాళ్ళం. కాని ఆమె పరదా వేసుకోదు కాబట్టి మాకంటే భిన్నంగా కనిపిస్తుంది. ఆ ప్రశ్న వింటూనే మాచూపు మలాలాపై మళ్ళింది. ఒక్కసారిగా తుపాకులు పేలాయి. మలాలాకు తూటా తగిలి పడిపోయింది. ఒక తూటా నా చేతికి తాకింది. అనుకోకుండా అంతా జరిగిపోయింది. వాతావరణం అంతా భయకంపితమైంది. ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. ప్రతి అమ్మాయి గావు కేకలతో ఏడుస్తోంది. తీవ్రంగా గాయపడిన మలాలా బాధతో మూలుగుతూ పడిపోయింది. నాన్నా! నాన్నా!! అంటూ కలవరిస్తోంది. మెల్లమెల్లగా ఆమె పూర్తిగా స్పృహ తప్పిపోయింది."

ఈ దుర్ఘటనపై మలాలా మాట్లాడుతూ... "రక్తంతో నా భుజం తడిసిపోతుంది. కాని నాకు నా స్నేహితుల గురించే బాధ కలిగింది. నా బట్టలు కూడా రక్తంతో తడిసిపోయాయి. డాక్టర్లు నాకు ఆసుపత్రిలో వైద్యం చేయాలంటున్నారు. కానీ నాకు

వెంటనే ఇంటికి వెళ్ళిపోవాలనిపించింది. ఎందుకంటే ఆ దుండగులు ఆసుపత్రి పై కూడా దాడి చేస్తారేమోనని భయపడ్డాను.”

ఖైనత్ గదిలో లేత గులాబిరంగు పెన్సిళ్లు ఉన్న సంచి ఉంది. అది బస్సులో తుపాకులు పేల్చిన సమయంలో కూడా తన వద్దే ఉంది. ఈ సంచి ఆ అమ్మాయికి చాలా ఇష్టం. దీన్ని చూసి ఆమెకు చదువంటే ఎంత ఇష్టమో గుర్తించవచ్చు. ఆ రోజు తాను ధరించిన స్కార్ఫ్ కూడా జాగ్రత్తగా పెట్టుకుంది. దానిపై ఉన్న రక్తపు మరకలు ఇప్పుడు కాస్త రంగు తేలాయి. ఇంకా ఆ సమయంలో మీద వేసుకొని ఉన్న శాలువా కూడా జాగ్రత్తగా దాచిపెట్టింది. “ఇవి నా జీవితానికి మరపురాని జ్ఞాపకాలు. నా రక్తం, నా పోరాటం వీటిలో ఇమిడి ఉన్నాయి” అంటుంది.

మరుసటి రోజే ఖైనత్ ఇంటికి కొద్దిదూరంలో పేలుడు సంభవించింది. “మా ఇంటి చుట్టుపక్కల వారు మమ్మల్ని ఇక్కడ నుంచి వెళ్ళిపొమ్మంటున్నారు. కానీ ఇక్కడనుంచి వెళ్ళిపోయేందుకు కావల్సినన్ని డబ్బులు మా వద్ద లేవు, ఇప్పుడు నాకు భయం వేస్తోంది” అంది.

ఖైనత్ తిరిగి పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమైంది. కానీ బస్సులు, టాక్సీలు, ప్రైవేటు వాహనాలు ఆమెను ఎక్కించుకోవడానికి నిరాకరించాయి. దాంతో ఇంట్లోనే చదువుకుంటోంది. ఇటువంటి సాహస బాలికను స్నేహితుల వద్దకు కానీ, సంతకు కానీ వెళ్ళనీయకుండా అడ్డుపడుతున్నారు. ఆమె ఇప్పుడు ఇంటి గడప కూడా దాటలేకపోతుంది. ఎందుకంటే ఆమెను అమ్మా, నాన్న కదలనీయడంలేదు.

“నేను ఓటమిని అంగీకరించను” అంది తన గులాబీరంగు సంచీ సర్దుకుంటూ. ఆమె మాటల్లో దృఢత్వం ఉంది. ఆమెకు ఎవరూ నేర్పించే అవసరం లేదు. కేవలం స్వయం కృషితోనే సాధిస్తుంది.

నిజంగా మలాలా నేడు స్వాత్‌లోని ప్రతీ అమ్మాయి ముఖంలో, కళ్ళల్లో ప్రతిబింబిస్తోంది.

# ఫలించిన ఆశీస్సులు

**మ**లాలా కోమా నుంచి కోలుకున్నప్పుడు తనను తాను చూసుకుంది. తలలో తూటా పేలిన సంఘటన గుర్తొచ్చింది. ఆమె ఆస్పత్రిలో నలువైపులకు చూపులు సారించింది. తన దేశం విడిచి చాలా దూరాన లండన్‌లోని ఒక ఆస్పత్రిలో ఉన్నానన్న విషయం ఆమెకు తెలియదు. కొత్త వాతావరణం, కొత్త కొత్త ముఖాలు, విదేశీ నర్సులు, డాక్టర్లు అంతా ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు.

పరిస్థితి గురించి డాక్టర్లు నిదానంగా వివరించారు. ఆమె మనస్సులో అసంఖ్యాకంగా ప్రశ్నలు చెలరేగుతున్నాయి. కానీ మాట్లాడలేక పోతోంది. అప్పుడు ఆమె తన భావాలు రాత ద్వారా తెలియజేసింది. డాక్టరు ఆమె కోలుకోవడాన్ని గమనించి వెంటిలేటర్ శ్వాస సాధనం తొలగించారు. కొన్ని క్షణాల పాటు ఆధారం పట్టుకొని నిలబడగలిగింది. తన ముఖంలో ఎటువంటి భయం కన్పించలేదు. ఆమె కొన్నిరోజుల పాటు కోమాలో ఉంది. ఇది తెల్సుకున్న తర్వాత కూడా భయాందోళనలకు గురికాలేదు. బహుశా ఆ దృఢమైన మానసిక స్థిరత్వం వల్లే అంత తొందరగా కోమా నుంచి బయటపడింది. డాక్టర్లు సైతం ఆశ్చర్యపోయారు. అయినప్పటికీ వారు ఆమె శరీరంలో వ్యాపించిన విషం కారణంగా భయపడుతున్నారు. కానీ మలాలా కోలుకుంటున్న తీరుతో డాక్టర్లకు ఇక ఆమె తొందరగానే సాధారణస్థితికి వస్తుందన్న విశ్వాసం కలిగింది.

తన తండ్రి జియావుద్దీన్ ఆసుపత్రిలో తనను కలిసినపుడు ఏడుస్తున్న అతడిని చూసి కళ్లతోనే ఓదార్చింది మలాలా. ఈసారి హాస్పిటల్‌కి వచ్చేటపుడు తన స్కూల్ బుక్స్ తీసుకురమ్మని రాత ద్వారా చెప్పింది తండ్రితో. దాంతో ఆమె తల్లి పెద్దగా అరిచింది. ఆసుపత్రి ఉద్యోగులంతా ఆశ్చర్యపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో కూడా చదువు గురించేనా మాట్లాడేది?

జియావుద్దీన్ యూసుఫ్‌జాయి ఆస్పత్రి నుంచి బయటకి రాగానే తడిసిన కళ్ళతో వణుకుతున్న గొంతుతో "మలాలా మళ్ళీ పైకి లేస్తుంది. ఆమె ఉగ్రవాదుల ముందు ఓడిపోదు. ఆమె తూటా తగిలి పడిపోయినపుడు యావత్ పాకిస్తాన్ ఆమెకు మద్దతుగా లేచినిలబడింది. ప్రపంచం మొత్తం లేచి నిలబడింది. ఇది ఒక గొప్ప మార్పు. ఎందుకంటే మొదటిసారి అన్ని రాజకీయ పార్టీలు, ఉర్దూలు, క్రిస్టియన్‌లు, సిక్కులు, ఇంకా అన్ని మతాల ప్రజలు నా కూతురి కోసం ప్రార్థనలు చేశారు. ఆమె కేవలం నా కూతురే కాదు. అందరికీ కూతురే. ఆమె స్వయంగా అందరికి కృతజ్ఞతలు తెలపాలనుకుంటుంది. నేను శాంతి కోరుకునే, మన అందరి బాగు గురించి ఆలోచించే వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మలాలాపై జరిగిన దాడిని ఖండించిన వారికి, తన ఆరోగ్యం గురించి ప్రార్థించిన వారికి, ఇంకా శాంతి, విద్యా, స్వాతంత్ర్యాలను సమర్థించే ప్రతి ఒక్కరికి కూడా నా కృతజ్ఞతలు."

మలాలాను సమర్థిస్తూ ఇస్లామాబాద్, కరాచి, లాహోర్ ఇంకా ముజఫరాబాద్‌లలో ప్రదర్శనలు నిర్వహించారు. ఆ సందర్భంగా విద్యార్థులందరూ ముఖ్యంగా విద్యార్థినులు పిల్లలందరికి విద్యా హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ తాము అందుకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు.

పాకిస్తాన్ హోం మంత్రి రహమాన్ మాలిక్ మలాలాకు పాక్‌లోని సర్వోన్నతమైన నాగరిక మేధావులకు ఇచ్చే బిరుదైన "సితారా–ఎ–శుజావత్" ఇవ్వాలని ప్రకటించాడు. మలాలాపై జరిగిన దాడికి బాధ్యత తమదే అని ప్రకటించిన తహరిక్–ఎ–తాలిబాన్ల నాయకులను పట్టుకున్నవారికి 5.28 కోట్ల రూపాయలు బహుమతిగా ప్రకటించారు. కాని దీనితో సమస్య పరిష్కారం కాదు. ఈ విషయం ప్రపంచం మొత్తానికి తెలుసు. పాకిస్తాన్ ప్రభుత్వం మలాలా ఇంకా అటువంటి అసంఖ్యాక అమ్మాయిల కలలను సాకారం చేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవలసి ఉంటుంది. స్త్రీలకు విద్యా, మానవ హక్కుల కోసం తన ప్రాణాలు పణంగా పెట్టే మలాలాకు ఇదే నిజమైన సన్మానం. పాకిస్తాన్ ప్రభుత్వానికి ఇది ఒక పరీక్షా సమయం. ఒకవేళ వారు మహిళల విద్య కోసం దృఢమైన సంకల్పంతో ముందుకెళితే దేశపటం, అదృష్టం రెండూ కూడా మారగలుగుతాయి.

తాలిబాన్లు ప్రజల్లో సృష్టించిన భయాన్ని సమైక్యతతో, కలం బలంతో జయించే సాహసం చేసిన మలాలాకు సలామ్.

# సాకారమైన కల

**నూ**తన సంవత్సరం ప్రారంభమయ్యింది. మలాలా ఆరోగ్య పరిస్థితిలోని మార్పును చూసి కుటుంబ సభ్యులు, డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది ఆశ్చర్యం సంతోషం వ్యక్తం చేశారు. వారితో పాటు అనునిత్యం ఆమె ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న వారు కూడా ఆనందించారు. ఆమె పట్ల ప్రశంసలు గుప్పిస్తూ లేఖలు, ఆమెను సమర్థిస్తూ సందేశాలు కొన్ని వేల సంఖ్యలో వచ్చాయి.

3 ఫిబ్రవరి, 2013. చాలా సంతోషకరమైన ఉదయం. చలి విపరీతంగా ఉంది. అయినా క్వీన్ ఎలిజబెత్ ఆసుపత్రి ముందు జనం చాలామంది ఉన్నారు. ఈ రోజు మలాలాను ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేస్తున్నారన్న వార్త బ్రిటన్ మొత్తం ప్రచారమయ్యింది. మలాలా బయటకి వచ్చింది. ఆమె శారీరకంగా నీరసంగా ఉంది. కాని కళ్ళలో దృఢత్వం అలాగే ఉంది. ఆమె చేతులు ఊపి ప్రజలకు ధన్యవాదాలు తెలిపింది.

ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు బ్రిటిష్ ప్రభుత్వం కేటాయించిన ఇంటికి వాహనంలో బయలుదేరారు. వెస్ట్‌మిడ్‌ల్యాండ్‌లో తమ కొత్త ఇంటి వైపు వెళ్ళే దారిలో కూడా ఆమెకు చేతులు ఊపుతూ ప్రజలు అభివాదం చెబుతున్నారు. ఆసుపత్రి నుండి చాలాకాలం తరువాత ఇంటికి వెళుతున్నందుకు మలాలా చాలా సంతోషంగా ఉంది. బ్రిటన్, పాకిస్తాన్ ప్రభుత్వాలు మలాలాకు ప్రమాదకర పరిస్థితులు ఇంకా పొంచి ఉండటంతో ఆమెను బర్మింగ్‌హామ్‌లోనే ఉంచాలని నిర్ణయించారు. ఇప్పటికీ ఆమె మధ్య మధ్యలో ఆసుపత్రికి వెళ్ళి పరీక్షచేయించుకోవాలని డాక్టర్లు చెప్పారు. వారికి కొత్త ఇళ్ళు కేటాయించడంతో పాటు, మలాలా తండ్రికి పాకిస్తాన్ కన్సల్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. అతను బ్రిటన్ మాజీ ప్రధాన మంత్రి ఐరాస విద్యావిషయక సంస్థకు ప్రతినిధి అయిన గార్డన్ బ్రౌన్‌కి ముఖ్య సలహాదారుగా నియమించబడ్డాడు. కుటుంబం మొత్తం మలాలాతోనే ఉంటున్నారు. తాలిబాన్లు మళ్ళీ దాడిచేయకూడదని పాకిస్తాన్

ప్రభుత్వం ఆలోచించి ఈ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగం ఉన్న కారణంగా జియావుద్దీన్ 3 నుండి 5 సంవత్సరాల వరకు బర్మింగ్‌హామ్‌లోనే ఉండవచ్చు. ఇది బ్రిటన్‌లోని రెండవ నగరం. ఇక్కడ పాకిస్తాన్ ప్రజలు ఎక్కువ మంది నివసిస్తుంటారు. బర్మింగ్‌హామ్‌లోని కొత్త పరిసరాలలో మలాలా అలవాటు పడటానికి సిద్ధమయ్యింది. అయినప్పటికి ఒక నెల వరకు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు చెప్పడంతో ఆ సమయమంతా ఇంట్లోనే చదువుతూ గడిపింది. చదువుకోవాలనే ఆమె కోరిక ముందు తాలిబాన్లే కాకుండా తన అనారోగ్యం కూడా ఓటమి పాలయ్యింది.

ఈ మధ్య కాలంలో జియావుద్దీన్ యూసుఫ్‌జాయి మలాలా తరఫున ఒక సందేశాన్ని జారీ చేశాడు: "నా జీవితం ముందుకు సాగడానికి సహకరిస్తూ శుభం కలగాలని ఆశించిన ప్రతి వారికీ నేను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. ప్రపంచంలోని స్త్రీ పురుషులు, పిల్లలు వీరందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు అంతా నాకు స్వస్థత చేకూరాలని కోరుకుంటున్నందుకు చాలా సంతోషిస్తున్నాను."

నాలుగు నెలలు చావుతో పోరాడిన తర్వాత ఫిబ్రవరి 3, 2013న మీడియాలో మలాలా మొదటిసారి ఆంగ్లం, ఉర్దూ, ఇంకా పష్తో అనే వాయవ్య పాకిస్తాన్ ఆదివాసీ భాషలో ప్రపంచానికి సందేశమిచ్చింది. "నాకు మరో జీవితం ప్రాప్తించింది. దీని గురించి మీ అందరికీ ధన్యవాదాలు. నా ఆరోగ్యం రోజు రోజుకీ మెరుగవుతోంది. మీరు నన్ను ప్రాణాలతో చూడగలుగుతున్నారు. నేను తిరిగి మీతో మాట్లాడగలుగుతున్నాను. మిమ్మల్ని అందరిని చూడగలుగుతున్నాను. ఇది మీ అందరి, ప్రపంచ ప్రజలందరి ఆశీస్సుల కారణంగా సాధ్యమవుతోంది. మీ ఆశీస్సుల కారణంగానే దేవుడు నాకు కొత్త జీవితాన్ని ప్రసాదించాడు. నాకు ప్రజాసేవ చేయాలనుంది. ప్రతి అమ్మాయి, ప్రతి అబ్బాయి చదువుకోవాలని కోరుకుంటున్నారు. ఆ ఆశయంతోనే మేము 'మలాలా ఫండ్' కమిటీ వేశాము.

"అవసరమైతే నేను బలిదానానికి సిద్ధంగా ఉన్నాను. పాకిస్తాన్‌లో శాంతికి విద్యాభివృద్ధికి ఏదైతే అవసరమో అది చేయడానికి సిద్ధంగా ఉన్నాను. నా కోరిక ఒకటే... అది ప్రతి బిడ్డా చదువుకోవాలి. మన దేశంలో, మొత్తం ప్రపంచంలో శాంతి నెలకొల్పాలి. శాంతి కోసం నన్ను నేను బలిదానమిచ్చుకుంటాను."

మార్చి 20, 2013. మలాలా చాలా సంతోషంగా ఉంది. ఆమె ఆరోగ్యం దాదాపు కుదుటపడింది. ఆమె ఎటువంటి ఆధారం లేకుండా నడవడం ఆరంభించింది. ఆమె వినడం, మాట్లాడటంలో ఎటువంటి ఇబ్బంది కలగడం లేదు. ఉదయం నుంచి

తియ్యగా మాట్లాడుతూనే ఉంది. ఆమె తన కొత్త పాఠశాలకు ఎప్పుడెప్పుడు వెళ్దామా అని క్షణం ఆగకుండా ఎదురుచూస్తుంది.

గులాబీ రంగు సంచి తగిలించుకొని ఉత్సాహంగా మధ్య ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హామ్ నగరంలోని "ఎజబెస్టన్ గర్ల్స్ హైస్కూల్"లో మలాలా అడుగు పెట్టింది. పాఠశాల మొదటిరోజు... ఐదు నెలల సంఘర్షణ... మనస్సు నిండా ఉత్సాహం... మలాలా పాఠశాల ఆవరణలో అడుగుపెట్టగానే అందరి దృష్టి తనపైనే. "వెల్‌కమ్ మలాలా" "చియర్స్ మలాలా" అంటూ నినాదాలు నలువైపులా మారుమ్రోగుతున్నాయి. కుతూహలంతో ఉత్సాహంతో ఉన్న మలాలా చూపులు... కొన్ని నెలల్లోనే మలాలా అక్కడి విద్యార్థుల మధ్య కూడా "ఒక రోల్ మోడల్" అయ్యింది. మలాలా గురించి విన్న ప్రతీ ఒక్కరూ ఉత్సాహం పొందారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ మలాలాను చుట్టుముట్టారు. మలాలా తరగతి గదిలో తనకు కేటాయించిన సీట్‌పై కూర్చొంది. వారందరితో ఆమె ఇలా చెప్పింది... "ఈ రోజు నాకు చాలా ఉత్సాహంగా ఉంది. తిరిగి పాఠశాలకు రావాలన్న కల సాకారమైంది. ప్రపంచంలో ప్రతీ అమ్మాయికీ ఈ అవకాశం రావాలని నేను ఆశిస్తున్నాను. పాకిస్తాన్‌లో నాతో కలిసి చదువుకున్న వారు చాలా గుర్తుకొస్తున్నారు. అయినా నేను ఇక్కడి కొత్త ఉపాధ్యాయుల వద్ద చదివేందుకు, కొత్త స్నేహితులను పొందేందుకు చాలా ఉత్సుకతతో ఉన్నాను."

# మెరుపు మెరిసింది

**నా**యకత్వానికి ఏ రూపం, ఏ ఆకారం, ఏ లింగం, ఏ దేశం, ఏ వయస్సు అనే తేడాలేవీ ఉండవనడానికి మలాలానే చారిత్రకమైన నిదర్శనం. సుదీర్ఘకాలంగా గొప్ప అనుభవాలున్న వారే చరిత్రను సృష్టించగలరని మనం అనుకుంటాం. కాని ఈ సాహసికురాలైన అమ్మాయి వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా చరిత్రను సృష్టించవచ్చునని రుజువు చేసింది.

మలాలా తన సాహసపూరితమైన ఆశయాల చరిత్ర ఇప్పటికే సృష్టించింది. దాన్ని వెంటనే "ఐయామ్ మలాలా" పేరుతో పుస్తకం కూడా రాయాలనుకుంటోంది. తన ఈ పుస్తకాన్ని రాయడానికి మలాలాకు 3 మిలియన్ డాలర్లు చెల్లించారు. దీనిని బ్రిటన్‌లో ఉన్న వెయిడెన్‌ఫెల్డ్ అండ్ నికోల్సన్ సంస్థ ప్రచురించింది.

"నా కథ అందరితో పంచుకోవాలనుకుంటున్నాను. ఇది చదువు అందుబాటులో లేని 61 లక్షల మంది అమ్మాయిల కథ కావచ్చు. నేను దీన్ని ప్రపంచంలోని చదువుకునే పిల్లలందరితో పంచుకుంటాను." మలాలా తన పుస్తకం ప్రపంచంలోని ప్రతీ ప్రాంతంలో అందుబాటులో ఉంచాలని కోరుకున్నది. ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో కొంతమంది విద్యార్థులు చదువుకోవడంలో ఎన్ని అడ్డంకులెదుర్కొంటున్నారో ప్రతి ఒక్కరికీ తెలుస్తుందని ఆమె ఆశ.

పాఠశాలలను మూసేసి చీకట్లు నింపిన ప్రాంతంలో తిరిగి వెలుగులు చిందించడానికి మలాలా పోరాడి సాధించింది. ఎక్కడైతే పాఠశాలలకు నష్టం చేకూర్చారో అక్కడ చదువుకునే హక్కు కోసం పోరాడింది. ఆమె ఇంటి నుంచి ప్రజల ముందుకొచ్చింది. ఆమె పాకిస్తాన్ ఇంకా ప్రపంచంలో పిల్లలందరికీ తన సాహసం ప్రదర్శించింది. ఆమె సాహసానికి ఆత్మవిశ్వాసానికి ప్రతీక అన్న విషయం అవగతమైంది. దాంతో పాటు ఏమైనా చేయాలి, సాధించాలి అనుకునే వారికి ప్రేరణగా కూడా నిలిచింది. చంపేస్తామనే

హెచ్చరిక వచ్చినా ఆమె అమ్మాయిలు చదువుకోవాలని ప్రచారం మాత్రం కొనసాగించింది. మలాలా పాకిస్తాన్‌కు ఒక మెరుపు తీగ అయ్యింది. ఆమె కేవలం పాకిస్తాన్‌లోనే మెరుపులు విరజిమ్ముతుంది. కాని ప్రపంచం మొత్తం వెలిగిపోతున్నట్లనిపిస్తుంది.

మలాలా కథలో ఉన్న సారాంశం: కష్టకాలంలో గట్టెక్కడానికి దారి కనిపించదు, కాని ఆ దారిని స్వయంగా ఏర్పాటు చేసుకోవాలి. అందుకు ఎంతో సాహసం చేయాల్సి వస్తుంది. అవసరమైతే స్వయంగా బలిదానం ఇవ్వడానికైనా సిద్ధం కావాల్సి ఉంటుంది. మరి మలాలా కనుగొన్న ఈ దారిలో పాకిస్తాన్ పయనిస్తుందో లేదో తెలియదు. కాని ఆమె దారిలో నడవడం పాకిస్తాన్ సమాజానికి ఎంతో అవసరం.

కేవలం పాకిస్తాన్‌కు మాత్రమే కాదు. ప్రపంచంలో మానవత్వంపై నమ్మకం ఉంచే ప్రతీ ఒక్కరికి ఇది ఉపయోగంగా ఉంటుంది. అందుకనే నేడు మలాలాను ఒక సాధారణమైన అమ్మాయిగా కాకుండా నిత్యనూతనంగా వెలిగిపోయే ఒక ఆలోచనా సరళిగా భావించాలి. ఈ ఆలోచనల్ని అనుకరించాలి, అమలుపర్చాలి. అప్పుడే ప్రజలు ఆమె ధైర్యాన్ని చూసి పాఠాన్ని నేర్చుకుంటారు. కష్టకాలం నుంచి బయటపడాలంటే స్వయంగా బాధలను భరించడానికి సిద్ధపడతారు.

# ఐరాసలో మలాలా ఉపన్యాసం

ఐక్యరాజ్యసమితి జులై 12ను "మలాలా దినోత్సవం"గా ప్రకటించింది. జులై 12, 2013న తన 16వ జన్మదినోత్సవ సందర్భంగా మలాలా ఐక్యరాజ్యసమితిలో ఈ ఉపన్యాసం చేసింది.

"గౌరవనీయులైన ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ మిస్టర్ బాన్ కి-మూన్, జనరల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ ఉక్‌జెరమిక్, యూఎన్ అంతర్జాతీయ విద్యా కార్యక్రమ ప్రధాన రాయబారి మిస్టర్ గోర్డన్ బ్రౌన్, ఆదర్శనీయులైన పెద్దలు, నా ప్రియమైన సోదరీ సోదరులారా! అస్సలామ్ అలైకుమ్."

'ఈ రోజు నాకు చాలాకాలం తర్వాత అందరి ముందు మాట్లాడే అదృష్టం ప్రాప్తించింది. ఇంత గొప్ప మహనీయుల మధ్య ఉండటం నా జీవితంలో మరుపురాని క్షణాలు. నేను కప్పుకొన్న ఈ శాలువా బెనజీర్ భుట్టోకి చెందాల్సింది.'

నా మాటలు ఎక్కడి నుండి ఆరంభించాలో అర్థం కావడం లేదు. ప్రజలు నా నుండి ఏమి వినాలనుకుంటున్నారో నాకు తెలియదు. కాని మన అందరినీ సమానంగా భావించే ఆ దేవుడికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అలాగే నేను తొందరగా కోలుకోవాలని, కొత్త జీవితాన్ని ఆరంభించాలని ప్రార్థించిన ప్రతి వ్యక్తికి కూడా నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా వేల సంఖ్యలో శుభ సందేశాలు, ఇంకా కానుకలు వచ్చాయి, వస్తున్నాయి. అందుకు మీ అందరికీ ధన్యవాదాలు. నాకు మద్దతుగా మాట్లాడి ధైర్యాన్నిచ్చిన అమాయక చిన్నారులకూ ధన్యవాదాలు. తమ ఆశీస్సులతో శక్తి చేకూర్చిన నా పెద్దలకూ ధన్యవాదాలు. నేను పాకిస్తాన్, యు.కె. ఆసుపత్రులలోని వైద్యులకు, నర్సులకు, సిబ్బందికి ఇంకా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పదల్చుకున్నాను. నా ఆరోగ్యం, నా శక్తి నాకు తిరిగి ప్రాప్తించాలని కోరుకున్న ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు.

నేను ఐరాస సెక్రటరీ జనరల్ బన్-కీ-మూన్ గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫస్ట్ ఇన్షియేటివ్‌ను, ఆ విభాగానికి యుఎన్ ప్రధాన రాయబారి అయిన గోర్డన్ బ్రౌన్, అలాగే యుఎన్ జనరల్ అసెంబ్లీ గౌరవనీయ అధ్యక్షులు ఉక్‌జెరమిక్‌ను పూర్తిగా సమర్ధిస్తాను. నేను ఆయన అధికార నైతికతను కూడా అభినందిస్తున్నాను. ఆయన మనలను ఎప్పటికీ మంచి పనులు చేయటానికి ప్రేరేపిస్తూ ఉంటారు. ప్రియమైన సోదరీ సోదరులారా ఒక్క విషయం గుర్తు పెట్టుకోవాలి, మలాలా దినోత్సవం అంటే నా దినోత్సవం కాదు. ఈ రోజు అనేది ప్రతీ అమ్మాయిది,అబ్బాయిది. మన హక్కును సాధించుకోటానికి పోరాడే వారందరి దినోత్సవం.

ఇటువంటి వందల మంది మానవ హక్కుల కోసం పోరాడే కార్యకర్తల కోసం సమాజ సేవకులు కేవలం తమ అధికారాల కోసమే కాకుండా శాంతి, విద్యా, సమానత్వం వంటి విషయాల్లో లక్ష్యాన్ని చేరుకోవటానికి పోరాడే వారందరు ఈ కోవకే వస్తారు. తీవ్రవాదులు చేసే దాడుల్లో వేలమంది చనిపోయారు. లక్షల మంది గాయాల పాలయ్యారు. వారందరిలో నేనూ ఒక వ్యక్తిని, ఎంతో మంది మధ్య ఒక అమ్మాయిగా నిలబడ్డాను. నేను కేవలం నా గురించి చెప్పడం లేదు. అలాగే ఒక్క మాట కూడా ఎదురు మాట్లాడలేని వారందరి గురించి కూడా చెబుతున్నాను. తమ హక్కుల కోసం పోరాడిన వారిని, శాంతి నెలకొల్పాలనుకునే వారిని... అందరినీ గౌరవించాల్సిన అవసరం ఉంది. సమానత్వం కావాలని అడగటం వారి హక్కు. విద్యావంతులు కావడం వారి హక్కు.

ప్రియమైన మిత్రులారా! 9 అక్టోబర్, 2012న తాలిబాన్లు నా తలకు ఎడమ భాగంలో తూటా పేల్చారు. నా స్నేహితులపై కూడా కాల్పులు జరిపారు. వారు భావించవచ్చు... వారి తూటాలకు భయపడి మనం మౌనంగా ఉంటామని. కాని వారనుకున్నది సాధించలేకపోయారు. నిశ్శబ్దంగా ఉన్న వేలమంది తిరగబడ్డారు. తీవ్రవాదులు మన లక్ష్యాలను మార్చాలనుకున్నారేమో, మన ఆశయాలను ఇక్కడే ఆపివేయాలను కున్నారేమో, కాని నా జీవితంలో శారీరకంగా కాస్త బలహీనపడ్డానే తప్ప మిగిలిన విషయాల్లో ఏమి మార్పు రాలేదు. నాలో విశ్వాసం ఇంకా పెరిగింది. భయం అనేది పూర్తిగా తొలిగింది. నాలో శక్తి సామర్థ్యాలు మరింత పెరిగాయి. నేను గతంలోని మలాలానే. నా కోరికలు, ఆకాంక్షలు కూడా గతంలోనివే. నా విశ్వాసాలు, ఆశలు కూడా గతంలోనివే. ప్రియమైన సోదరీ సోదరులారా, నేను ఎవరికీ వ్యతిరేకం కాదు. నేను ఇక్కడ తాలిబాన్లు లేదా ఇంకెవరైన తీవ్రవాదులకు వ్యతిరేకంగా నా వ్యక్తిగత అభిప్రాయాలు కొన్ని చెప్పడానికి ఇక్కడికి వచ్చాను. నేను ప్రతీ ఒక బిడ్డకూ విద్యా హక్కు

ఉండాల్సిన అవసరంపై మాట్లాడాలని వచ్చాను. తాలిబాన్లు ఇంకా ఇతర తీవ్రవాద సంస్థలు ఉగ్రవాదులు కూడా తమ అబ్బాయిలు, అమ్మాయిలకు అందరికి చదువు నేర్పించాలని కోరుకుంటున్నాను. నాపై కాల్పులు జరిపిన ఆ తాలిబాన్లపై కూడా నాకు ద్వేషం లేదు. ఒకవేళ ఒక తాలిబాన్ నా ముందుకు వచ్చినా నావద్ద తుపాకీ ఉన్నా సరే నేను అతడిపై కాల్పులు జరపను. మహ్మద్ ప్రవక్త నుంచి, జీసస్ క్రైస్ట్ నుంచి, బుద్ధ భగవానుడి నుంచి ఈ దయాగుణాన్ని నేను నేర్చుకున్నాను. ఈ మార్పును నేను మార్టిన్ లూథర్‌కింగ్, నెల్సన్ మండేలా, మహ్మద్ ఆలీ జిన్నాల వారసత్వం నుండి అంది పుచ్చుకున్నాను. అహింసా సిద్ధాంతాన్ని నేను గాంధీజీ, బచ్చాఖాన్, మదర్ థెరిస్సాల నుంచి నేర్చుకున్నాను. ఇంకా ఇటువంటి క్షమాగుణం మా తల్లిదండ్రుల నుండి నేర్చుకున్నాను. అందుకనే నా అంతరాత్మ శాంతంగా ఉండు, అందరిని ప్రేమించు అంటూ ఉంటుంది.

ప్రియమైన సోదరీ సోదరులారా! మనకు వెలుతురు విలువ ఎప్పుడు తెలుస్తుందంటే మనం చీకట్లో ఉన్నప్పుడు. అలాగే మన మాట యొక్క విలువ మన నోరు నొక్కేసినప్పుడు ఆర్థమవుతుంది. అలా మేము పాకిస్తాన్ ఉత్తర ప్రాంతం స్వాత్‌లో జీవించాము. తుపాకుల నిఘాను చూసినప్పుడు, నేను పెన్ను- పుస్తకం శక్తి గుర్తించాను. ఒక మంచి సామెత ఉంది. 'కత్తి కంటే కలం గొప్పది'. ఇది నిజం. ఉగ్రవాదులు కలానికి పుస్తకాలకు భయపడతారు. విద్య యొక్క శక్తి వారిని భయాందోళనలకు గురి చేస్తుంది.

అలాగే వారు మహిళలకు భయపడతారు. మహిళల తిరుగుబాటు వారిని భయాందోళనలకు గురి చేస్తుంది. ఈ కారణంగానే వారు చేసిన అనేక దాడులలో 16 మంది అమాయక విద్యార్థులు చావుకు గురయ్యారు. ఈ కారణంగానే వారు మహిళా ఉపాధ్యాయులను చంపేశారు. ఈ కారణంగానే వారు ఇప్పుడు పాఠశాలలను కూలగొడుతున్నారు. ఎందుకంటే వారు అప్పుడూ ఇప్పుడూ కూడా సమానత్వం అనే మార్పుకి భయపడుతున్నారు. నాకు బాగా గుర్తుంది. మా పాఠశాలలోని ఒక అబ్బాయిని విలేకర్లు ప్రశ్నిస్తూ, 'తాలిబాన్లు విద్యను ఎందుకు వ్యతిరేకిస్తారు?' అని ప్రశ్నించారు. అతను నిర్భయంగా సర్వసాధారణమైన పద్ధతిలో తన వద్ద ఉన్న పుస్తకం వైపు చూపిస్తూ సమాధానం చెప్పాడు. 'తాలిబాన్లకు ఈ పుస్తకాల్లో ఏముంటుందో అసలు తెలియదు' అని అన్నాడు.

వారు భగవంతుడిని ఒక అల్పుడైన మితవాది అని అనుకుంటారు. ఆయన పాఠశాలకు వెళ్ళే అమ్మాయిలను నరకానికి పంపిస్తాడని భావిస్తారు. తమ స్వార్థప్రయోజనాల కోసం ఈ తీవ్రవాదులు ఇస్లాం పేరును తప్పుడు పనులకు వాడుకుంటున్నారు. పాకిస్తాన్ శాంతికాముక ప్రజాస్వామిక దేశం. పష్తూన్లు తమ పిల్లలకు చదువు చెప్పించాలని కోరుకుంటారు. ఇస్లాం అనేది శాంతి, సమానత్వం, సోదరభావం గల మతము. ఇది ప్రతి బిడ్డా విద్యను పొందే హక్కు గురించి మాత్రమే కాకుండా అది వారి విధి, బాధ్యత అని కూడా చెబుతోంది.

చదువుకోవాలంటే శాంతి అవసరమవుతుంది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ముఖ్యంగా పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో తీవ్రవాదం, యుద్ధాలు, ఘర్షణలు విద్యార్థులు పాఠశాలకు వెళ్లకుండా ఆపేస్తున్నాయి. మనం ఈ యుద్ధాలతో నిజంగా అలసిపోయాం. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో మహిళలు పిల్లలు అనేక విధాలుగా బాధలు పడుతున్నారు. భారత్‌లో అమాయకులైన పేద పిల్లలు రోజూ కూలిపని చేయటానికి అలవాటు పడుతున్నారు. నైజీరియాలో అనేక పాఠశాలలు నాశనం చేశారు. ఆఫ్ఘనిస్తాన్ ప్రజలు ఉగ్రవాద చర్యలతో బాధలు పడిఉన్నారు. అమ్మాయిలు పనిమనిషిలాగా ఇంటిపనులు చేయాల్సి వస్తుంది. వారికి బాల్యవివాహాలు బలవంతంగా చేస్తున్నారు. పేదరికం, అజ్ఞానం, అన్యాయం, జాతివాదం కలిసి ప్రాథమిక హక్కులు వారికి అందకుండా చేస్తూ అనేక సమస్యలు సృష్టిస్తున్నాయి. వాటి ఫలితాలు మహిళలే కాకుండా పురుషులు కూడా అనుభవిస్తున్నారు.

ఈరోజు నేను మీ ఆలోచనలు మహిళల సాధికారత, పిల్లల విద్యాభివృద్ధి వైపు మళ్ళించాలనుకుంటున్నాను. ఎందుకంటే అందరికంటే ఎక్కువగా నష్టపోతున్నది వారే. ఒకానొక సమయంలో మహిళాకార్యకర్తలు తమ హక్కుల కోసం పురుషుల సాయం కోరేవారు. కాని ఇప్పుడు ఈ పని మనం స్వయంగా చేసుకుందాం. నేను మహిళల హక్కుల కోసం మాట్లాడవద్దని పురుషులకు చెప్పడం లేదు. కాని మహిళలంతా స్వతంత్రులు కావాలని, వారు స్వయంగా పోరాడాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రియమైన సోదరీ సోదరులారా...ఇప్పుడు మీరు మీ పోరాటానికి సిద్ధం కండి, నేడు నేను ప్రపంచ నాయకులందరికీ చెప్పదలచుకున్నది ఏమిటంటే శాంతిసౌభాగ్యాలు తీసుకువచ్చేలా మీ వ్యూహాత్మక విధానాలు మార్చుకోండి. అన్ని శాంతి ఒప్పందాలను, మహిళల పిల్లల హక్కులను పరిరక్షించాలి. మహిళల గౌరవాన్ని భంగపరచే ఎలాంటి ఒప్పందమూ ఆమోదయోగ్యం కాదు. ప్రపంచంలోని ప్రతి పిల్లవాడికి ఉచిత నిర్బంధ విద్యా సౌకర్యం

కల్పిస్తే తీవ్రవాదానికి అలాగే హింసకు వ్యతిరేకంగా పోరాడగలుగుతారు. తద్వారా పిల్లలను పాశవికత్వానికి, హానికి గురికాకుండా కాపాడేందుకు ప్రభుత్వాలు తీవ్రవాదం, హింసాకాండలకు వ్యతిరేకంగా పోరాడాలని మనం కోరదాం. అభివృద్ధి చెందిన దేశాలను మేము కోరుకునేదేమిటంటే వర్ధమాన ప్రపంచంలో అమ్మాయిల కోసం విద్యావకాశాలు, ప్రమాణాలు పెంచాలని కోరుతున్నాము. అన్ని సమాజాలూ సహనం కలిగి ఉండాలని; జాతి, మతం, కులం, తెగ లేదా లింగ వివక్షలను తిరస్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు. నేను నా ప్రపంచంలోని ప్రతి ఒక్క సోదరి ధైర్యసాహసాలతో ఉండాలని, తనలో నిబిడీకృతంగా ఉన్న శక్తిని కూడదీసుకోవాలని, తమ పూర్తి సామర్థ్యాన్ని గుర్తించాలని కోరుకుంటున్నాను.

ప్రియమైన సోదరీ సోదరులారా! మన పిల్లల ఉజ్వలమైన భవిష్యత్ కోసం పాఠశాల, చదువు తప్పని సరికావాలి. మనం మన శాంతియాత్రను, చదువును చివరివరకు కొనసాగించాలి. మనల్ని ఎవరూ ఆపలేరు. మనం మన హక్కుల కోసం ఆందోళనలు చేయాలి. మన ఆలోచనలను మార్చుకోవాలి. మనం మన భావాలపై విశ్వాసం ఉంచాలి. మనం భావాలతో ప్రపంచాన్ని మార్చగలం. ఎందుకంటే చదువు విషయంలో మనమంతా ఒక్కటే.

ప్రియమైన సోదరీ సోదరులారా! మనం పేదరికాన్ని, అన్యాయాన్ని, అనుభవిస్తున్న, అజ్ఞానంలో కూరుకుని ఉన్న లక్షల మంది ప్రజల్ని ఎప్పుడూ మర్చిపోకూడదు. చదువుకు దూరమవుతున్న లక్షల మంది పిల్లలను కూడా మరవకూడదు. దేదీప్యమానమైన శాంతియుతమైన భవిష్యత్తు కోసం నిరీక్షిస్తున్న సోదరీసోదరులను కూడా మరవరాదని విన్నవించుకుంటున్నాను. కాబట్టి అజ్ఞానం, పేదరికం, తీవ్రవాదాలపై పోరాటం ప్రకటిద్దాం. రండి పుస్తకాలు పెన్నులు చేత పడదాం. అవే మనకు అన్నింటికంటే అత్యంత శక్తివంతమైన ఆయుధాలు. ఈ ప్రపంచాన్ని మార్చేయడానికి 'ఒక్క విద్యార్థి, ఒక్క ఉపాధ్యాయుడు, ఒక్క పుస్తకం, ఒక్క కలం' చాలు. అన్నిటికీ ఒకే ఒక ఉపాయం... అది చదువు. అన్నిటికంటే ప్రధానం చదువు... ధన్యవాదాలు."

# సోషలిజమే పరిష్కారం

**"సోషలిజం ఒక్కటే (మన సమస్యలకు) పరిష్కారమని నేను పూర్తిగా నమ్ముతున్నాను. కామ్రేడ్స్ మీరంతా ఒక్కటై ఈ ఉద్యమానికి ఒక విజయవంతమైన ముగింపు ఇవ్వాలని మిమ్మల్ని కోరుతున్నాను. మతదురహంకారం, దోపిడీల సంకెళ్ల నుంచి ఇదొక్కటే మనకు స్వేచ్ఛను ఇస్తుంది."**

ఐఎంటి (ఇంటర్నేషనల్ మార్క్సిస్ట్ టెండెన్సీ) పాకిస్తాన్ శాఖ 32వ సదస్సుకు గతేడాది మలాలా యూసఫ్‌జాయి పంపిన సందేశం ఇది. ఆమె ఇంగ్లండులో చికిత్స పొందుతూ ఈ సందేశం పంపారు. కైలాశ్ సత్యార్థితో కలసి 2014 నోబెల్ శాంతి బహుమతికి ఎంపికైన ఆమె పాకిస్తాన్ స్వాత్ లోయలో అమ్మాయిల చదువును ప్రోత్సహించి తాలిబన్ ప్రాణాంతక దాడికి గురెంది. అత్యంత సాహసంతో తీవ్రవాదుల ఆజ్ఞలకు వ్యతిరేకంగా పోరాడిన సాహస పుత్రిక అంటూ పశ్చిమ దేశాల మీడియా ఆమెకు నీరాజనాలు అర్పించింది. అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాను ఇంకా ఇతర ప్రపంచ నేతలను కలిసి అంతర్జాతీయంగా పిల్లల విద్యా హక్కు అమలు కోసం చర్చలు జరిపిన పిన్న వయస్కురాలుగా పొగడ్తలు కురిపించాయి. అయితే పాశ్చాత్య మీడియా అస్సలు పట్టించుకోని, దాదాపు ప్రస్తావించని విషయం ఏమిటంటే ఆమె అసామాన్య సాహసానికి మూలాలు మార్క్సిజం లెనినిజంలో ఉన్నాయన్నది.

ఒక సోషలిస్టుగా ఉండి నోబెల్ బహుమతి పొందిన అతి కొద్దిమందిలో మలాలా కూడ ఒకరు. గతంలో ఫిజిక్సులో నోబెల్ బహుమతి పొందిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ సోషలిస్టు. అయితే ఆయన సోషలిస్టు అని అప్పటికి చాలమందికి తెలియదు. అలాగే హెలెన్ కెల్లర్

కూడ సోషలిస్టు. ఆమెకూ నోబెల్ బహుమతి లభించింది. అందరికీ తెలిసినా తెలియకపోయినా వారు సోషలిస్టులయినప్పటికీ నోబెల్ బహుమతి లాంటి అత్యున్నత పురస్కారం వారికి ఇవ్వక తప్పని పరిస్థితి. ఇప్పుడు అలాంటి వారి కోవలో మలాలా కూడ చేరారు.

వేసవి సెలవులను ఆమె సాటి అమ్మాయిలు సరదాగా ఎంజాయ్ చేస్తూ ఉంటే లెనిన్, ట్రాట్స్కీల గురించి అధ్యయనం చేయడానికి మలాలా ఒక మార్క్సిస్ట్ శిబిరంలో చేరింది. శాంతి బహుమతి అందుకున్న అతి చిన్న వయస్కురాలుగా వేనోళ్ల పొగుడుతున్న వారు ఆమె లోని మరో విశిష్టతను కూడా గుర్తించాలి. అత్యంత కిరాతకమైన దాడికి గురైన అతి చిన్న వయస్కురాలైన ఒక అంతర్జాతీయ మార్క్సిస్ట్ వక్త కూడా ఆమే. 2012 జులైలో మలాలా ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొంది. తర్వాత కొద్దినెలలకే ఆమె మీద దాడి జరిగింది.

ఏ భావజాలం కోసమైతే చైనా, సోవియట్ యూనియన్, తూర్పు యూరపు, కంబోడియా, వియత్నాం, ఉత్తర కొరియా, ఆఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్, క్యూబాలలో కోట్లాది మంది ప్రాణాలు కోల్పోయారో ఆ భావజాలానికి ప్రతినిధిగా మాట్లాడుతూ మలాలా దాని వ్యాప్తి కోసం కృషి చేస్తోంది. తాలిబన్ హత్యాపూరిత నిరంకుశ భావజాలాన్నే ప్రతిఘటించడమే కాకుండా, అంతకన్న విస్తృతమైన లక్ష్యంగా ఆమె పనిచేస్తున్నది.

కరడు గట్టిన ఇస్లామిక్ సమాజాలలో విద్యాపరంగా లింగవివక్షను రూపుమాపాలన్నది, విద్య అనే పరివర్తన శక్తిని ప్రజలకు అందరికీ అందజేయడం ద్వారా వారి జీవితాలను మెరుగుపరచాలన్నది మలాలా అధికారిక లక్ష్యం. వాస్తవానికి అంతకంటే విస్తృతమైన ఆదర్శం ఆమెకు ఉంది. అది ఆర్థిక విధానాల్లో వామపక్షవాదం, సామాజిక విధానాల్లో మధ్యేవాదం ఉండాలన్నది ఆ ఆదర్శం.

# సన్మానాలు, పురస్కారాలు

**ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ పీస్ ప్రైజ్ :** (రన్నర్ అప్) 25 అక్టోబర్, 2011న అమ్మాయిలు చదువుకునే అధికారం కోసం ధైర్య సాహసాలతో నిలబడటం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచార మాధ్యమాలను ఉపయోగించుకుని ప్రతీ అమ్మాయికీ తెలియవచ్చేలా చేసినందుకు ఈ పురస్కారం లభించింది.

**పాకిస్తాన్ నేషనల్ యూత్ పీస్ ప్రైజ్ :** 19 డిసెంబర్,2011న అప్పటి పాకిస్తాన్ ప్రధానమంత్రి యూసుఫ్ రజా గిలాని ఈ పురస్కారం ప్రకటించారు. ఆ తర్వాత నేషనల్ మలాలా యూత్ పీస్ ప్రైజ్‌గా పేరు మార్చారు.

**వీర పురస్కారం:** 19 నవంబర్, 2012న హౌజ్ ఆఫ్ లార్డ్స్‌లో వరల్డ్ పీస్ అండ్ ప్రాస్పరిటీ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రిన్స్ అలీఖాన్ **వీర పురస్కారం** ప్రదానం చేశారు. దీనిని మలాలా తరఫున పాకిస్తాన్ ఉప ప్రధాని ఎస్.జుల్ఫికార్ గర్దేజి స్వీకరించారు.

టైమ్స్ మ్యాగజైన్ ద్వారా **పర్సన్ ఆఫ్ ఇయర్ పురస్కారం :** 26 నవంబర్, 2012లో ప్రకటించిన నాలుగు పురస్కారాలలో ఒకటి డిసెంబర్ 19న మలాలాకి ప్రదానం చేశారు. సామాజిక న్యాయం కోసం **మదర్ థెరిసా మెమోరియల్ అవార్డ్** 28 నవంబర్, 2012న ప్రదానం చేశారు.

శాంతి మరియు మానవత్వాన్ని కాపాడే కార్యక్రమాలు చేపట్టిన వారికి 2012 **రోమ్ ప్రైజ్**ను 29 డిసెంబర్‌న ప్రదానం చేశారు. ఇటలీ మానవ హక్కుల కార్యకర్త ఎంజెలా స్టీనే ఈ సందర్భంగా మాట్లాడుతూ "మలాలా చేపట్టిన సాహసకార్యానికి మేము సంతోషిస్తున్నాం. ఆమె ఇప్పుడు ఒంటరిగా లేదు. మేమంతా ఆమెతో ఉన్నాం" అన్నారు.

పిల్లలందరికీ సమాన విద్యా హక్కు కోసం దృఢ విశ్వాసంతో, సాహసంతో పోరాడటం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ 2012 సం॥కి **టిప్పరీ ఇంటర్నేషనల్ పీస్ అవార్డ్** 3 జనవరి, 2013న ప్రదానం చేశారు. ఇది ఎయిర్‌లాండ్‌కి ప్రతిష్టాత్మకమైన అవార్డుగా పేర్కొంటారు.

ఫ్రాన్స్ ప్రభుత్వం మలాలాకు **సీమాన్ డి బహ్‌వాయిర్** పురస్కారంతో 10 జనవరి, 2013న సన్మానం చేశారు. ఈ సన్మానం మలాలా తండ్రి యూసుఫ్ జాయీ స్వీకరిస్తూ "ఈ కష్టకాలంలో ప్రపంచం మొత్తం అలాగే భగవంతుడు ఆమెకు తోడ్పాటునిచ్చారు. కాబట్టి ఆమె పూర్తిగా కోలుకుంటుంది. భగవంతుడు మానవుల సంరక్షణ కోసం, ఇంకా చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడం కోసం ఆమెను రక్షించాడు.

లండన్‌లోని బ్రిటిష్ పార్టీ కార్యదర్శి ఖాలిద్ మహమూద్ ఫిబ్రవరి 2013న **నోబెల్ బహుమతి కోసం** మలాలా యూసుఫ్‌జాయీ పేరును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశాడు. ఆయన మాట్లాడుతూ మలాలా తన ప్రాణాలను పణంగాబెట్టి ఒక గొప్ప సాహసం చేసింది. అలాగే ప్రపంచం మొత్తాన్ని జాగృతం చేసింది. ఇది ఎవరి తరం కాని పని. నోబెల్ పురస్కారం కోసం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించినపుడు దాదాపు **మూడు లక్షల మంది సంతకాలు** చేశారు.

మలాలాను యూరోపియన్ పార్లమెంట్ **సఖారోవ్ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్** అవార్డుతో 21 మార్చి, 2013న సన్మానించింది. ఈ పురస్కారం ఆమె తండ్రి జియావుద్దీన్ స్వీకరిస్తూ "నేను మలాలాకు భావప్రకటన హక్కు ఇచ్చాను. భావప్రకటన హక్కు ప్రతి సమస్యకు సమాధానం అవుతుంది, ఇది అన్నింటికంటే శ్రేష్ఠమైన హక్కు" అన్నారు. ఐరాస సెక్రటరీ జనరల్ బాన్‌కీ మూన్ పాకిస్తాన్ సాహస యువతి మలాలా యూసుఫ్‌జాయీను 8 ఏప్రిల్, 2013న **యు.ఎన్.కి బేటి** (పుత్రిక)అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మలాలా వంటి వారు ఎంతమందికైనా సహకరించడానికి యు.ఎన్. ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, మలాలా ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని అన్నారు.

ఒపెక్ ఫండ్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (ఓ.ఎఫ్.ఐ.డి.) మంత్రిత్వ శాఖ సమితి ఛైర్మన్ యూసుఫ్ హుస్సేన్ కమాల్ 2013సం॥కి **ఓ.ఎఫ్.ఐ.డి. అవార్డు** 13 జూన్, 2013న ప్రకటించారు. ఈ పురస్కారం పాకిస్తాన్‌లోని స్వాత్ కొండల్లోని అమ్మాయిలు ఇంకా మహిళల హక్కుల కోసం నినదిస్తూ నిర్భయంగా పోరాడిన సందర్భంగా ఇచ్చినట్లు ప్రకటించారు. ఈ పురస్కారం ప్రకటించిన తర్వాత మలాలా వీడియో ద్వారా కృతజ్ఞతలు తెలిపింది. ఇంకా ఈ సంస్థ అమ్మాయిల చదువుకు వారి స్వయంశక్తిని పెంపొందించుటకు తోడ్పాటునివ్వాలని విజ్ఞప్తి చేసింది. **యుఎన్ఎ-యుఎస్ఎ ఛాంపియన్ ఫర్ గ్లోబల్ ఛేంజ్** పురస్కారం 2013కు మలాలా యూసుఫ్‌జాయీ పేరు ప్రకటించారు. ఈ పురస్కారం ఆమెకు 6 నవంబర్, 2013న వాషింగ్‌టన్‌లో ప్రదానం చేశారు.

మలాలాకు భారతదేశానికి చెందిన సత్యార్థితో పాటు 2014లో అత్యున్నత **నోబెల్ శాంతి బహుమతి** లభించింది. మలాలా బాలల విద్య కోసం పోరాటం చేస్తే, సత్యార్థి బాలల హక్కుల కోసం ఉద్యమిస్తున్నారు.

ఇదే సంవత్సరం మరొక ప్రతిష్టాత్మక అవార్డు కూడా మలాలాను వరించింది. స్వీడన్ ప్రభుత్వం ఇచ్చే **'బాలల నోబెల్ బహుమతి'** కూడా ఆమెకు ఇచ్చారు. ఈ విధంగా ఈ రెండు నోబెల్ బహుమతులను అది కూడా ఒకే సంవత్సరంలో దక్కించుకున్న అసాధారణ గౌరవం మలాలాకు లభించింది.

# మలాలా పై ఒక గజల్

**(సుప్రసిద్ధ భారతీయ ఉర్దూ కవి నిదా ఫాజలీ 20 ఫిబ్రవరి, 2013న రాసింది)**

మలాలా - మలాలా
నీ కన్నులు సూర్యచంద్రులు
నీ కలలు చల్లని జలపాతాలు

కాలచక్రంపై నువ్వు, నీ పేరును పొదిగించావు
బడి చదువుకు అడ్డొచ్చినా, దైవ ఖురాను చదివావు
అజ్ఞానానికి ఎదురొడ్డే నువ్వు
నీ పేరే వెలుగు దివ్వెలా... మలాలా మలాలా,

కొండా కోనల మధ్య చదువులు కొనసాగించగా
అడవి మృగాలు నీపై క్రూరపు దాడులు చేయగా
గింజంత ఆశాభావం నీది
ఆశయమై కాసింది కాపలా... మలాలా మలాలా,

నీపై పేలిన తూటాలు ప్రపంచం గుండెల్లో దిగిన గునపాలు
ఒకటే రూపం నీది ప్రపంచమంతా వెలుగిస్తోందీ
నీ అడుగుల వెంట గొడుగై ఆకాశం సైతం నడవాలా
మలాలా... మలాలా...

అది అక్టోబర్ 9, 2012. పదిహేను సంవత్సరాల మలాలా యూసఫ్‌జాయీ అనే బాలిక పైన పాకిస్తానీ తాలిబాన్ తీవ్రవాదులు తుపాకులతో దాడి చేశారు. మధ్యాహ్నం పాఠశాల నుంచి వస్తున్న సమయంలో ఆమె ఉన్న స్కూలు బస్సు ఆపి ఆమెపై తూటాల వర్షం కురిపించారు. పాఠశాలకు వెళ్ళి చదువుకోవాలను కోవడమే ఆమె చేసిన నేరం. అమ్మాయిలు అబ్బాయిలతో కలిసి దేశాభివృద్ధికి తోడ్పడటం తాలిబాన్లకు నచ్చదు. చదువుకోవడం షరియత్ (ఇస్లామిక్ ధార్మిక చట్టం) కు విరుద్ధమని భావిస్తారు.

*మలాలా అదృష్టవశాత్తు మృత్యువు నుంచి తప్పించుకుంది. ఆమెపై దాడిని యావత్ ప్రపంచం తీవ్రంగా ఖండించింది. మలాలా నేడు అమ్మాయిల చదువుకు ప్రతీకగా మారింది. బాలల హక్కుల కోసం పోరాడుతున్నందుకు భారతీయుడు కైలాశ్ సత్యార్థితో పాటు అతి పిన్న వయస్కురాలైన మలాలా యూసఫ్‌జాయికి 2014 నోబెల్ శాంతి బహుమతి ప్రకటించారు. పాకిస్తాన్‌కి చెందిన ఈ సాహస పుత్రిక కథే ఈ పుస్తకం.*

**'నాపై కాల్పులు జరిపిన ఆ తాలిబాన్లపై నాకు ద్వేషం లేదు. ఒకవేళ ఒక తాలిబాన్ నా ముందుకు వస్తే నావద్ద తుపాకీ ఉన్నా సరే నేను అతడిపై కాల్పులు జరపను. మీరు కూడా మీ పిల్లలను చదివించండి అని చెబుతాను... మహ్మద్ ప్రవక్త నుంచి, జీసస్ క్రైస్ట్ నుంచి, బుద్ధ భగవానుడి నుంచి ఈ దయాగుణాన్ని నేను నేర్చుకున్నాను...'**

***- మలాలా యూసుఫ్‌జాయి***

ప్రజాశక్తి బుక్‌హౌస్